
అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
శనివారం 22-02-2025
సంపుటి : 11 | సంచిక : 02 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



ఇంకెక్కడి బ్రిక్స్.. చచ్చిపోయింది

ట్రంప్ ప్రేలాపనలు

సుంకాల హెచ్చరికతో
నోట మాట రావడం లేదంటూ ప్రగల్భాలు

వాషింగ్టన్ : అధిక సుంకాలు విధిస్తానని తాను చేసిన హెచ్చరికలతో బ్రిక్స్ విచ్ఛిన్నమైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. బ్రిక్స్ భారత్ సహా ...11లో

ఆదాయం అంతంతే..

జనవరి చివరి నాటికి రాబడి 56 శాతమే



గతేడాది ఇదే సమయానికి 63 శాతం ఆదాయం
మార్చి నాటికి మిగతా 44 శాతం వచ్చేనా?
బడ్జెట్ ముందు సర్కారుకు సవాళ్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'రానున్న బడ్జెట్‌లో రూ.మూడువేల కోట్లతో ఎస్సీ, ఎస్టీ యువతకు స్వయం ఉపాధి పథకాలు రూపొందిస్తాం. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలకు సంబంధించి అద్దెలు, డైట్ బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించాలి...' శుక్రవారం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలివి. మరోవైపు ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ పెద్దల ఆలోచనలు, ప్రజల ఆకాంక్షలు ఈ విధంగా ఉంటే... రాష్ట్ర ఖజానా పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. మార్చితో ముగియబోతున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకూ వచ్చిన లెక్కలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) జనవరి చివరి నాటికి విడుదల చేసిన గణాంకాలను పరిశీలిస్తే...ఖజానా ఒడిదుడుకులకు లోనవుతోందని తేలింది. ఆ నెలాఖరు నాటికి రాష్ట్ర ప్రభుత్వం వేసుకున్న మొత్తం అంచనాల్లో 56 శాతం (రూ.1,23,815 కోట్లు) ఆదాయమే వచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి మూలధన ఆదాయం (రెవెన్యూ రిసీట్స్) రూపంలో మొత్తం రూ.2,21,242 కోట్లు ఖజానాకు చేరతాయని ప్రభుత్వం అంచనాలేసుకుంది. జనవరి నాటికి ఇందులో 56 శాతమే రాగా... మిగతా రెండు నెలల్లో (ఫిబ్రవరి, మార్చి) రావాల్సిన 44 శాతం వస్తుందా? రాదా? అనేది ...11లో

జనవరి చివరి నాటికి ఆదాయ వివరాలిలా..(రూ.కోట్లలో)

అంశం	అంచనాలు	వచ్చిన ఆదాయం
1) వస్తు సేవల పన్ను	58,594	42,657
2) స్టాంపులు, రిజిస్ట్రేషన్లు	18,228	5,821
3) భూముల అమ్మకాలు	11.20	0.78
4) అమ్మకపు పన్ను	33,449	26,725
5) ఎక్సైజ్ సుంకం	25,617	15,585
6) కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా	18,384	15,336
7) ఇతర ట్యాక్సులు	10,111	6,644
8) పన్నేతర ఆదాయం	35,208	5,866
9)గ్రాంట్లు, ఇతర ఆర్థిక సాయాలు	21,636	5,176



సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

రూ.మూడు వేల కోట్లతో ఎస్సీ, ఎస్టీ యువతకు ఉపాధి పథకాలు
అటవీ భూముల అభివృద్ధికి ప్రణాళికలు : ఎస్సీ, ఎస్టీ, బీసీ,
మైనారిటీ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

వివరాలు 11లో



12 ఏండ్ల మోడీ, పదేండ్ల కేసీఆర్ పాలనపై

చర్చిద్దాం రండి

12 నెలల మా ప్రజాపాలనపై చర్చకు సిద్ధం

- ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన చోట మేం పోటీ చేస్తాం
- డబుల్ బెడ్‌రూమ్‌లు ఇచ్చిన చోట బీఆర్ఎస్ పోటీ చేస్తుందా?
- డేట్, ప్లేస్, సమయం చెప్పండి.. నేనూ, మంత్రి దామోదర కలిసి చర్చకు వస్తాం
- పాలమూరు ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదు ?
- కేసీఆర్ వల్లే రాయలసీమ ఎత్తిపోతలకు నీళ్లు
- ప్రాజెక్టులు, పరిశ్రమలను అడ్డుకోవద్దు : నారాయణపేట సభలో సీఎం రేవంత్‌రెడ్డి

మేం ఓడితే ముక్కు నేలకు రాస్తా.. మరి మీరు?

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

పన్నేండ్లుగా దేశాన్ని ఏలుతున్న మోడీ, కేసీఆర్ పదేండ్ల పాలన.. ఏడాది కాలంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రజాపాలనపై చర్చకు సిద్ధమా..? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీజేపీ, బీఆర్ఎస్‌కు సవాల్ విసిరారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అంటున్నారు. మరోవైపు కాంగ్రెస్ పాలన బాగోలేదని, గట్టిగా కొడతామని కేసీఆర్ అంటున్నారు. ఎవరి పాలన ఏంటో తేల్చుకుందాం. ప్లేస్, సమయం, తేదీ నిర్ణయించండి.. ఎవరెవరు వస్తారో చర్చలకు రండి. మా వైపు నేను, మంత్రి దామోదర కలిసి వస్తాం. చర్చల్లో మేం ఓడితే ముక్కును నేలకు రాస్తా' అని రేవంత్ అన్నారు. నారాయణపేట జిల్లా పరిధిలో శుక్రవారం సుమారు రూ.వెయ్యి కోట్లతో వివిధ సంక్షేమ పథకాలను సీఎం ప్రారంభించారు. వికారాబాద్ దుంద్యాల మండలం పోలెపల్లి ఎల్లమ్మ జాతర సందర్భంగా పూజలు నిర్వహించారు. మహిళా సమాఖ్య భవనం, పెట్రోల్ బంక్, మెడికల్ కళాశాల మొదటి బ్లాక్ ప్రారంభం, నర్సింగ్ కళాశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ తమది రైతు ప్రభుత్వం అని చెబుతూనే.. రైతు వ్యతిరేక నల్లచట్టాలు తెచ్చి.. ఇబ్బందులకు గురి చేసిందని అన్నారు. రైతులు ఉద్యమించి ప్రధాని మోడీ మెడ వంచి ఆ చట్టాలను వెనక్కి తిప్పికొట్టారని గుర్తు చేశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పారని, ఎంతమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చాయని ప్రశ్నించారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నా.. రాష్ట్రానికి నిధులు తీసుకురాలేకపోయారని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా పదేండ్లపాటు అధికారంలో ఉండి.. పాలమూరు ఉమ్మడి జిల్లా నుంచి ఎంపీగా గెలిచి.. ఆ తర్వాత సీఎం అయిన కేసీఆర్.. తుమ్మిళ్ల, కల్వకుర్తి, నెట్టెంపాడు, జూరాల, పాలమూరు-రంగారెడ్డి, కోయిల్‌సాగర్, బీమా ఎత్తిపోతల పథకాలను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. జిల్లా ప్రాజెక్టులను పూర్తి చేయకపోగా శ్రీశైలం నీటిని ప్రతిరోజూ 10 టీఎంసీలను రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా ఏపీకి తరలించే ప్రయత్నాలను అడ్డుకోలేదని విమర్శించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఊడిగం చేసి పోతిరెడ్డిపాడుకు జలాలను తరలించుకు పోయేందుకు సహకరించారని ...10లో


ఒక్క ఎకరాకు నీళ్లివ్వలే..



సీఎం రేవంత్‌రెడ్డిది ఉత్తవాగుడే
ఆయన పాలనపై చర్చకు సిద్ధం
ఇందుకు ఎక్కడికైనా వస్తాం : మాజీమంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాలమూరుకు ఒక్క ఎకరానికి నీళ్లివ్వని సీఎం రేవంత్ రెడ్డిది ఉత్తవాగుడే అని మాజీ మంత్రి , బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రేవంత్ పాలనపై చర్చకు తాము సిద్ధమని సవాల్ విసిరారు. చర్చకు ఎక్కడికైనా రావడానికి సిద్ధమని స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పదేండ్ల ...11లో



కంప్లయింట్ చేసిన వ్యక్తి చనిపోతే.. కేసు విచారణ ఎలా?

మేడిగడ్డ కుంగుబాటు పిటిషన్‌పై హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జయశంకర్ భూపాలపల్లిలోని మేడిగడ్డ బీటలు వారడానికి అవినీతే కారణమని పేర్కొంటూ ఫిర్యాదు చేసిన రామలింగమూర్తి చనిపోయినందున ఆయన కింది కోర్టులో చేసిన ఫిర్యాదు విచారణార్హం కాదని హైకోర్టు చెప్పింది. ఫిర్యాదుదారు ...11లో

మొదటి ఓటు వేసి గెలిపించండి

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

మండలి లోపల, బయట అనేక పోరాటాలు
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి,
ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి




వివరాలు 3లో

తప్పుల తడక స్వమిత్వ డేటా

దేశవ్యాప్తంగా గ్రామాల్లో డ్రోన్లతో భూసర్వేలు

అక్కడి ప్రజలతో సంప్రదింపులు జరపకుండానే పథకం అమలు
భూములకు సంబంధించిన సమాచారంలో పెద్ద ఎత్తున లోపాలు
మోడీ సర్కారు తీరుపై ప్రజల్లో ఆందోళనలు



న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ సర్కారు 'స్వమిత్వ పథకం' పేరుతో దేశంలోని గ్రామీణ ప్రజలలో భయాలు, ఆందోళనలను కలిగిస్తున్నది. ఈ పథకం అమలు ద్వారా సేకరించిన సమాచారంలో పెద్ద ఎత్తున లోపాలు బయటపడుతున్నాయి. డేటాలో స్పష్టత లోపించింది. స్వమిత్వ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లోని భూకమతాలను మ్యాప్ చేయటానికి డ్రోన్లతో సర్వే నిర్వహిస్తారు. అయితే, ఈ ప్రక్రియ ద్వారా వెల్లడించిన సమాచారంలో ఇప్పటికీ అస్పష్టత, లోపాలు ఉన్నాయని ప్రజలు, మేధావులు చెప్తున్నారు. ఈశాన్య ఢిల్లీ జిల్లాలో స్వమిత్వ పథకం అమలులో భాగంగా పబ్లిక్ నోటీసు విడుదలైంది. డ్రోన్ సర్వే ఆధారంగా శికార్‌పూర్ మ్యాప్‌ను రూపొందించారు. గ్రామంలోని ఆస్తుల జాబితాను తయారు చేశారు. మ్యాప్, జాబితా ఖరారు కావటానికి ముందు ఏవైనా అభ్యంతరాలుంటే 15రోజుల్లో తెలియజేయాలని పేర్కొన్నది. స్వమిత్వ పథకం గురించి వినడం అక్కడ చాలా మందికి అదే మొదటిసారి కావటం గమనార్హం.

ఈ పథకం ఏమిటి?

ఈ పథకం పూర్తి పేరు సర్వే ఆఫ్ విలేజెస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రొవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్. సంక్షిప్తంగా స్వమిత్వగా పిలుస్తారు. 2020 ఏప్రిల్‌లో కేంద్రం దీనిని ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతాల్లో సుదీర్ఘకాలంగా ఉన్న భూములు, ఆస్తులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో దీనిని తీసుకొచ్చారు. భారత్‌లోని చాలా ప్రాంతాల్లో ప్రజలు నివాసముంటున్న ఇండ్లు, ఇతర ఆస్తులకు సంబంధించి ఓనర్‌షిప్‌పై ఎలాంటి డాక్యుమెంటరీ ప్రూఫ్ ఉండదు. దీనిని ...2లో

దేశవ్యాప్తంగా ఆందోళనలు

ఈ పథకం అమలు విషయంలో దేశవ్యాప్తంగా పలు గ్రామాల్లోని ప్రజల నుంచి ఆందోళనలు తలెత్తుతున్నాయి. శికార్‌పూర్‌లో అక్కడి స్థానికులకు మ్యాప్, ఇతర సమాచారం అందలేదు. దీంతో వారు డాక్యుమెంట్లను పొందటం కోసం తహశీల్దార్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. అయితే, ఈ విధంగా వారికి అందిన డాక్యుమెంట్లను చూసి షాకయ్యారు. 56 శాతం ఇండ్లకు సంబంధించిన డేటా తప్పులతడకగా ఉన్నదని గుర్తించారు. ఇందులో ఓనర్ల పేర్లలో స్పెల్లింగ్ మిస్టేక్‌లు, గ్రామంలో లేని వ్యక్తి పేరు మీద పలు ప్రాంతాల్లో ప్లాట్లు ఉండటం వంటి పెద్ద తప్పులే ఉన్నాయి. అలాగే, పక్కపక్కనే ఉన్న ముగ్గురు అన్నదమ్ములకు ఒకరి పేరు మీదే ముగ్గురికి ఇండ్లు కేటాయించినట్టు చూపటం, బతికి ఉన్నవారిని కూడా చనిపోయినట్టు చూపటం వంటివి సదరు డాక్యుమెంట్లలో కనిపించాయి. "శాశ్వత రికార్డుల్లో సమాచారం ఇలాగే ఉంటే, భవిష్యత్తులో కుటుంబాల ...2లో


విధానపరమైన జాప్యాలుండవ్

రెడ్ టేప్ అడ్డంకులు ఎదుర్కోవాల్సిన అవసరం లేదు



పెట్టుబడుల విధానాల సరళీకరణలో పురోగతి
వామపక్ష ప్రభుత్వం చర్యలు : 'ఇన్వెస్ట్ కేరళ గ్లోబల్ సమ్మిట్'లో సీఎం విజయన్

తిరువనంతపురం : కేరళకు వచ్చే ఏ పెట్టుబడిదారుడు కూడా విధానపరమైన జాప్యాల వలయాన్ని, రెడ్ టేప్ అడ్డంకులను ఎదుర్కోకుండా వామపక్ష ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని ఆ రాష్ట్ర సీఎం పినరయి విజయన్ చెప్పారు. రెండు రోజుల 'ఇన్వెస్ట్ కేరళ గ్లోబల్ సమ్మిట్' కార్యక్రమం ప్రారంభం సందర్భంగా ఆయన ప్రసంగించారు. "పెట్టుబడులకు సంబంధించిన విధానాలను సరళీకరించటంలో మేము పురోగతిని సాధించాం. కేరళ పెట్టుబడి దృశ్యం చరిత్ర శిఖరాగ్రంలో ఉన్నది. పెట్టుబడి రంగంలో మెరుగైన పురోగతి, మార్పును మనం చూస్తున్నాం. ఈ సమయంలోనే ఈ శిఖరాగ్ర సమావేశం ప్రపంచ పెట్టుబడిదారుల, ఈ రంగంలోని దార్శనికులు, విధాన రూపకర్తలను ఒక చోట చేర్చి, కేరళ పెట్టుబడి సామర్థ్యాన్ని ...11లో





పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి టీజేఎస్ మద్దతు

- ప్రొఫెసర్ కోదండరాం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి టీజేఎస్ మద్దతిస్తున్నట్టు ఆ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ మద్దతును కోరిందనీ, పొత్తు ధర్మంతో పాటు టీజేఎస్ డిమాండ్ల అమలుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్న విషయాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. జాబ్ క్యాలెండర్, కులగణన, విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి అవకాశాలను కాంగ్రెస్ ప్రభుత్వం పెంచిందని తెలిపారు. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు కూడా మద్దతు ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడానికి కారణమని చెప్పారు. కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో వై.అశోక్ కుమార్‌కు, వరంగల్-నల్లగొండ-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో స్వతంత్ర అభ్యర్థి పన్నాల గోపాల్ రెడ్డికి మద్దతిస్తున్నట్టు కోదండరాం ప్రకటించారు. ఉపాధ్యాయ, సామాజిక ఉద్యమాల్లో ఆయన పాల్గొనడం, విద్యా రంగంలో ప్రాముఖ్యత కలిగి ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఆ ముగ్గురు అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం నీటి పంపకాలల్లో విఫలమైందని ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. పదేండ్లు అధికారంలో ఉండి మౌనంగా ఉండి ఇప్పుడు పోరాటమంటే నమ్మేదెవరని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేఆర్ఎంబీ తక్షణమే జోక్యం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌ను నియంత్రించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఒక్క అడుగు కూడా వెనక్కి వేయొద్దని సూచించారు. ఉద్యోగుల హెల్త్ కార్డులు, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజలింగమూర్తి నిందితులను తక్షణమే పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగబద్ధమని చెప్పారు. హామీల అమలుకు కాంగ్రెస్ సర్కారుకు నాలుగేండ్ల గడువుందని తెలిపారు. ఈ సమావేశంలో టీజేఎస్ ప్రధాన కార్యదర్శులు బైరి రమేష్, పల్లె వినయ్ కుమార్, నేతలు సర్దార్ వినోద్ కుమార్, హన్మంత్ రెడ్డి, సత్యనారాయణ, రామ్ చందర్, ప్రశాంత్ పెరల, పుష్పలీల, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్స్‌కు కన్వర్షన్ ఇవ్వాలి

- తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ డిమాండ్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

విద్యుత్ శాఖలో పని చేస్తున్న దాదాపు 20 వేల మంది ఆర్టిజన్స్‌కు జేఎల్ఎం, సబ్-ఇంజినీర్, జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేటర్స్‌గా కన్వర్షన్ ఇవ్వాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ డిమాండ్ చేసింది. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో జేఏసీ చైర్మెన్ కె.ఈశ్వర్‌రావు(సీఐటీయూ) మాట్లాడుతూ.. విద్యుత్ శాఖలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఆర్టిజన్స్‌ను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ కార్మికులకు కన్వర్షన్ ఇవ్వాలనే డిమాండ్‌తో ఈ నెల 20న చలో విద్యుత్ సౌధ నిర్వహించిన కార్మికులను ప్రభుత్వం పోలీసులతో నిర్బంధించి అరెస్టు చేయించిందని విమర్శించారు. సంయుక్త కార్యదర్శి ఎస్.చంద్రారెడ్డి (సీఐటీయూ) మాట్లాడుతూ.. ఆర్టిజన్స్‌ను కన్వర్షన్ చేయడం వల్ల ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారమూ పడదన్నారు. అయినా.. కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వ తరహాలో వ్యవహరించడం సరికాదన్నారు. చలో విద్యుత్ సౌధలో పాల్గొన్న ఉద్యోగులను విధుల్లోకి తీసుకోకపోవడం దారుణమన్నారు.

ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే 20 వేల మంది విధులు బహిష్కరించి రోడ్డెక్కుతారని హెచ్చరించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ విషయంలో వెంటనే చొరవ తీసుకొని టీవీఏసీ జేఏసీని చర్చలకు పిలిచి, తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కన్వీనర్ ఎంఏ.వాజీర్ (టీఎస్ పీఈయూ) మాట్లా డుతూ.. ఆర్టిజన్ కార్మికుల కన్వర్షన్ సాధించే వరకు తమ పోరాటం కొనసా గిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కో-చైర్మెన్‌లు వి.నరేందర్, సిహెచ్.ఎల్లయ్య, కో-కన్వీనర్లు జి.నాగరాజు, జి.అరవింద్ కుమార్, ఫైనాన్స్ సెక్రటరీ ఎస్.సదానందం, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.కోటి గౌడ్, సలీం పాషా, మీడియా ఇన్‌చార్జి జె.ప్రసాద్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడి నిందితుడికి 20 ఏండ్ల జైలు శిక్ష

- రూ.పది వేల జరిమానా

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

కుమార్తెపై లైంగికదాడికి ఒడిగట్టిన తండ్రికి 20 ఏండ్ల జైలు శిక్ష, రూ.పది వేల జరిమానా విధిస్తూ శుక్రవారం ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కులకర్ణి విశ్వనాథ్ దిలీప్‌రావు తీర్పు ఇచ్చారు. అండర్ సెక్షన్ 376(2), (ఎఫ్). (ఐ), 376(3) ఐపీసీ అండ్ సెక్షన్ 5(ఎన్) రీ/w 6 ఆఫ్ పోక్సో యాక్ట్ -2012 ప్రకారం తీర్పు ఇచ్చినట్టు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి..

2023 డిసెంబర్ 14న కట్టంగూర్ మండలం మునుకుంట్ల గ్రామానికి చెందిన అక్కెనపల్లి అంజనేయులు 6వ తరగతి చదువుతున్న తన కుమార్తెపై లైంగికదాడి చేశాడు. ఆ తర్వాత ఎవరికీ చెప్పొద్దని బెదిరించాడు. పొలం పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లికి తనపై జరిగిన దాడిని బాధితురాలు చెప్పింది. వెంటనే తల్లి కట్టంగూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి ఆధారాలను కోర్టుకి అందజేశారు. విచారించిన ఫాస్ట్‌ట్రాక్ కోర్టు న్యాయమూర్తి బాలిక తండ్రి ఆంజనేయులును దోషిగా నిర్ధారించి 20 ఏండ్ల జైలు శిక్ష, రూ.పది వేల జరిమానా విధించారు. ఈ కేసులో సరైన ఆధారాలు సేకరించి కోర్టుకు అందజేసిన అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్ ఎస్.రాఘవరావు, సి.శ్రీనివాసరెడ్డి, డి.రాజు, ప్రస్తుత సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ ఎం.రవీందర్, ఏపీపీ వేముల రంజిత్ కుమార్, సీడీఓ రువ్వ నాగరాజు, లీగల్ ఆఫీసర్ ఎం.కల్పన, భరోసా సెంటర్, నల్లగొండ (అసిస్టెంట్ టు అడిషనల్ పీపీ) కోర్టు లైజెనింగ్ ఆఫీసర్స్ పి.నరేందర్, ఎస్.మల్లికార్జున్‌ను ఎస్పీ అభినందించారు.

జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

- పదేండ్లలో కాంగ్రెస్‌కు తొలిసారి చోటు

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉత్కంఠ రేపిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక మరోసారి ఏకగ్రీవమైంది. సంఖ్యా బలం లేకపోవడంతో బీఆర్ఎస్ కార్పొరేటర్లు నామినేషన్ విత్‌డ్రా చేసుకున్నారు. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీలో 15 మంది సభ్యులకుగాను 17 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎంఐఎం నుంచి 8 మంది, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ దూరంగా ఉంది. అయితే, బీఆర్ఎస్ అడ్డగుట్ట కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తమ నామినేషన్లను విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. జీహెచ్ఎంసీలో మొత్తం 150 మంది కార్పొరేటర్లు ఉంటే.. అందులో 15 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. పదేండ్లుగా స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమవుతూ వస్తోంది. పదేండ్ల తర్వాత తొలిసారి కాంగ్రెస్ కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీలో చోటు దక్కించుకున్నారు.

నాన్ టీచింగ్ కాంట్రాక్టు ఉద్యోగులకు టైమ్ స్కేల్ ఇవ్వాలి

- ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్
- స్కేల్ డిమాండ్ న్యాయమైంది
- తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి



నవతెలంగాణ-హిమాయత్ నగర్

యూనివర్సిటీ నాన్ టీచింగ్ కాంట్రాక్టు ఉద్యోగులకు టైమ్ స్కేల్ ఇవ్వాలని ముఖ్యమంత్రికి విన్నవిస్తామని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం రాష్ట్ర విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ జేఏసీ ఆధ్వర్యంలో యూనివర్సిటీల నాన్ టీచింగ్ కాంట్రాక్టు ఉద్యోగులకు టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ ప్రభుత్వం వర్సిటీలను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం పని చేసే ప్రభుత్వం అధికారంలో ఉండటం వల్ల న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంట్రాక్టు నాన్ టీచింగ్ ఉద్యోగులకు స్కేల్ న్యాయమైన డిమాండ్ అని, దీని పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తామని అన్నారు. ఉద్యోగులు ఐక్యతను కాపాడుకుంటూ సామాజిక న్యాయంతో ముందుకు సాగాలని సూచించారు.. తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల స్కేల్ డిమాండ్ న్యాయమైందన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగు న్యాయం చేస్తామన్నారు. ప్రొ.జి.హరగోపాల్ మాట్లాడుతూ.. విశ్వ విద్యాలయాలకు పూర్తి స్వయం ప్రతిపత్తి కల్పించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వ్యవస్థలను తీసుకొచ్చిందని, దీంతో విశ్వవిద్యాలయాలు స్వయం ప్రతిపత్తి కోల్పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్, ప్రయివేటు వ్యవస్థలు ప్రభుత్వంపై పెత్తనం చలాయిస్తున్నాయన్నారు. వచ్చే బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. నాన్ టీచింగ్ కాంట్రాక్టు ఉద్యోగులకు టైమ్ స్కేల్ అమలు చేసి పూర్తి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ఇటిక్యాల పురుషోత్తమ్, తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు డా.చారగొండ వెంకటేశం, జేఏసీ చైర్మెన్ సూర్యచందర్, అధ్యక్షులు కట్ట వెంకటేష్, ప్రధాన కార్యదర్శులు ఎస్.అరుణ్ కుమార్, టి.చేతన్, మన్మోహన్, కన్వీనర్ సి.శ్రీనివాస్, కె.శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ డా.విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

మంత్రితో ఆటోడ్రైవర్స్ జేఏసీ చర్చలు సఫలం

ఉద్యమ కార్యక్రమాలు వాయిదా :రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం

నవతెలంగాణ- హిమాయత్‌నగర్

ఆటో డ్రైవర్ల సంఘాలతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జరిపిన చర్చలు సఫలమైనట్టు రాష్ట్ర ఆటో డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జేఏసీ నాయకులతో మంత్రి పొన్నం ప్రభాకర్, కొత్తగూడెం ఎమ్మెల్యే.. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ ఎం.కోదండరామ్ సమక్షంలో ఆటో డ్రైవర్స్ సంఘాల జేఏసీ సమావేశం జరిగిందని చెప్పారు.



న్యాయమైన సమస్యలకు పరిష్కారం చూపారని తెలిపారు. జేఏసీ నిర్ణయం మేరకు ఉద్యమ కార్యక్రమాలను వాయిదా వేసుకున్నట్టు వెల్లడించారు. ఆటో డ్రైవర్లకు ఇస్తామన్న రూ.12 వేలు త్వరలోనే ప్రభుత్వ వెసులుబాటు ప్రకారం చెల్లిస్తామని, ఆటో రవాణా రంగ సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందని, లేబర్, రవాణా శాఖ కమిషనర్లతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఓలా, ఊబర్, రాపిడోల నుంచి డ్రైవర్లను రక్షించడానికి ప్రభుత్వమే ఒక యాప్‌ను తీసుకురావడానికి కృషి చేస్తుందని, గతంలో ఉన్న యాక్సిడెంటల్ బీమాను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చినట్టు చెప్పారు. ఇతర జిల్లాల ఆటోలను కట్టడి చేయడానికి గ్రేటర్‌లో ఎల్‌పీజీ, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్‌తో కూడిన ఆటోల కోసం నిరుద్యోగులకు కొత్త పర్మిట్లు ఇవ్వటానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2019 మోటార్ వాహనాల చట్టాన్ని రాష్ట్రంలో అమలు, ఆటోలకు, టూవీలర్లకు చలాన్లలో మినహాయింపు ఇస్తామని చెప్పారన్నారు. ఆటోలకు పార్కింగ్ స్థలాలకు సంబంధించి ఎక్కడెక్కడ అవకాశాలు ఉన్నాయో వాటిని గుర్తించి ఏర్పాటు చేస్తామని, అక్రమంగా నడుస్తున్న ఓలా, ఊబర్, రాపిడో టూవీలర్ల విషయంలో అధికారులను సంప్రదించి ఒక నిర్ణయం తీసుకుంటామని మంత్రి చెప్పినట్టు తెలిపారు. తమకు సహకరించిన పొన్నం ప్రభాకర్, కూనంనేని సాంబశివరావు, ఎం.కోదండరామ్‌కు జేఏసీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ చర్చల్లో విఎస్.బోస్ (ఏఐటీయూసీ), పి.శ్రీకాంత్ (సీఐటీయూ), వి.ప్రవీణ్ (టీయుసీఐ), వి.మారయ్య (బీఆర్‌టీయూ), ఎంఎ.సలీం (యూటీఏడీడబ్ల్యుఏ), ఎ.సత్తిరెడ్డి (టీఏడీఎస్), పి.రాంరెడ్డి (ఐఎఫ్‌టీయూ), ఆటో యూనియన్ జేఏసీ నాయకులు సి.హెచ్.జంగయ్య, ఎస్.అశోక్, ఎ.బిక్షపతియాదవ్, ఎండీ అఫ్జల్, ఎండి.నజీబ్, ఎస్.రాంకిషన్, అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

తప్పుల తడక స్వమిత్వ డేటా

(మొదటిపేజీ తరువాయి)

పరిష్కరించటం కోసం ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని జనావాస ప్రదేశాలలో సర్వేకు నిర్ణయించింది. దీని ద్వారా నివాసితులకు వారి ఆస్తులకు ప్రూఫ్‌లుగా.. ప్రాపర్టీ కార్డులు, ఇతర లీగల్ డాక్యుమెంట్లు అందించొచ్చని భావించింది.

ప్రక్రియ ఇలా..

డ్రోన్ సర్వే, మ్యాప్‌లను రూపొందించటం ఈ ప్రక్రియలో మొదటి భాగం. ఆ తర్వాత, మ్యాప్ డిజిటల్ కాపీలపై భూరెవెన్యూ విభాగం అధికారులు ప్రయివేటు ప్రాపర్టీపై యెల్లో రెక్టాంగిల్స్‌ను మార్క్ చేస్తారు. అలాగే, పబ్లిక్ ప్రాపర్టీగా, అంటే రోడ్లు, స్కూళ్లు, గుడులు కనిపిస్తే రెడ్ రెక్టాంగిల్స్‌ను మార్క్ చేస్తారు. ఆ తర్వాత సదరు అధికారులు..ఈ విధంగా గుర్తించిన ఆస్తులు కచ్చితమైనవేనా అని నిర్ధారించటానికి అధికారులు మ్యాప్ చేసిన గ్రామాల్లో పర్యటిస్తారు. వ్యక్తిగతంగా భూములు కలిగి ఉన్న వారికి సంబంధించిన సమాచారాన్ని వారు పొందుతారు.

ఈ డేటా ఆధారంగానే ఓనర్‌షిప్ డాక్యుమెంట్స్

ఈ విధంగా అందిన సమాచారం ఆధారంగా సదరు డిపార్ట్‌మెంట్ గ్రామవాసులకు ఓనర్‌షిప్ డాక్యుమెంట్స్ జారీ చేస్తుంది. అలాగే, దశాబ్దాల పాతకాలం నాటి ప్రభుత్వ భూరికార్డులను అప్‌డేట్ చేస్తారు. దేశవ్యాప్తంగా వివాదంలో ఉన్న భూసమస్యలను పరిష్కరించటం కూడా ఈ మ్యాపింగ్, వెరిఫికేషన్ ప్రక్రియ ఉద్దేశం. ఈ పథకం ప్రారంభం నుంచి ప్రభుత్వం బడ్జెట్‌లో దీనికి రూ.500 కోట్లకు పైగా కేటాయించింది. ఈ ఏడాది జనవరి నాటికి దేశవ్యాప్తంగా 31 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతా(యూటీ)లలో మూడు లక్షలకు పైగా గ్రామాల్లో డ్రోన్ మ్యాపింగ్ పూర్తయింది. జనవరి 18న ప్రధాని మోడీ దేశవ్యాప్తంగా 50వేలకు పైగా గ్రామాల్లోని ప్రజలకు 65 లక్షల ప్రాపర్టీ కార్డులను జారీ చేశారు.

దేశవ్యాప్తంగా ఆందోళనలు

మధ్య అనేక ఘర్షణలకు తావిస్తాయి" అని శికార్‌పూర్ నివాసి నరేంద్ర త్యాగి వాపోయాడు.

ఇలాంటి సమస్యలు ఒక్క ఢిల్లీకి మాత్రమే పరిమితం కాలేదు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లోని గ్రామాల నుంచి కూడా ప్రజలు ఇదే ఆందోళనను లేవనెత్తుతున్నారు. గ్రామాలలో ఎలాంటి సంప్రదింపులు జరపకుండానే అధికారులు ఈ పథకం అమలులో ముందుకెళ్తున్నారని నాటింగ్‌హామ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ టామ్ కోవాన్ తెలిపారు. ఈయన గత మూడేండ్లుగా స్వమిత్వపై పరిశోధన చేస్తున్నారు. డ్రోన్ సర్వే గురించి అధికారులు గ్రామస్తులకు సరైన సమాచారం కూడా ఇవ్వలేదన్న ఆరోపణలున్నాయి. శికార్‌పూర్‌లో నిర్మించబోయే మురుగుకాలువ కోసం డ్రోన్ సర్వేను నిర్వహిస్తున్నామని అధికారులు గ్రామస్తులకు చెప్పినట్టు నరేందర్ త్యాగి వివరించాడు. ఇలా ప్రజలను తప్పుదారి పట్టించే సంప్రదింపులు బాధాకరమని కోవాన్ చెప్పారు. "ఇలాంటి తప్పులతో పథకం అమలు, విధానంపై గ్రామస్తుల్లో ఆందోళనలు నెలకొన్నాయి. కానీ, అధికారులు ఇవేమీ పట్టనట్టు వ్యవహరిస్తారు" అని పలువురు వాపోతున్నారు.

24కు కేఆర్ఎంబీ వాయిదా

ఏపీ విజ్ఞప్తి మేరకే

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కృష్ణానదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) అత్యవసరంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం ఈనెల 24కు వాయిదా పడింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో మిగిలిన కాలానికి రెండు రాష్ట్రాల నీటి వాటాలు, ఇతర అంశాలపై చర్చించేందుకు శుక్రవారం కేఆర్ఎంబీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, తెలంగాణ నీటిపారుదల ముఖ్యకార్యదర్శితో కృష్ణాబోర్డు చైర్మెన్ అతుల్‌జైన్ మధ్యాహ్నం సమావేశం కావాల్సి ఉంది. అయితే తనకు ముందుగానే నిర్ణయించిన ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నందువల్ల ఈ సమావేశానికి హాజరు కాలేకపోతున్నాననీ, దీన్ని సోమవారానికి వాయిదా వేయాలని ఏపీ స్పెషల్ సీఎస్, కృష్ణా బోర్డుకు విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రత్యేక సమావేశాన్ని కేఆర్ఎంబీ చైర్మెన్ సోమవారానికి వాయిదా వేశారు. ఆరోజు మూడున్నర గంటలకు హైదరాబాద్ జలసౌ ధలో సమావేశం జరగనుంది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు కృష్ణాబోర్డు సమాచారం పంపించింది.

ఏపీ చుక్కనీటిని తరలించకుండా అడ్డుకోండి

కేఆర్ఎంబీని కోరిన రాహుల్‌బొజ్జా

కేఆర్ఎంబీ సమావేశం వాయిదాపై అభ్యంతరం వ్యక్తం చేసిన తెలంగాణ అధికారులు ఏపీ సర్కారు ఒక్క చుక్క నీటిని తరలించకుండా అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశాన్ని వాయిదా వేస్తూ బోర్డు నిర్ణయం తీసుకోగా, సమావేశానికి హాజరై ఏపీ నీటి తరలింపుపై నిరసన వ్యక్తం చేశారు. గంటపాటు జరిగిన సమావేశానికి హాజరై రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇంజినీర్ ఇన్ చీఫ్(జనరల్) జి అనిల్‌కుమార్, నల్లగొండ సీఈ(ఎన్ఎస్‌పీ) అజయ్‌కుమార్ సమస్యను నివేదించారు.

రానున్న జులై వరకు తాగు, సాగు నీటి అవసరాల కోసం 116 టీఎంసీలు విడుదల చేయాలని కోరుతూ రాహుల్ బొజ్జా కేఆర్ఎంబీ చైర్మెన్‌కు ప్రత్యేకంగా లేఖను అందజేశారు. ఆ మేరకు వాటర్ రిలీజ్ ఆర్డర్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే సోమవారం సాధారణ అంశాలతోపాటు తెలంగాణ ఇచ్చిన లేఖపై కూడా వాదనలు జరిగే అవకాశాలు లేకపోలేదు.

కర్నాటకలో త్వరలో పాత పెన్షన్ వర్తింపు

సీఎం సిద్ధరామయ్య ప్రకటనపై ఎన్ఎంఓపీఎస్ హర్షం

తెలంగాణలోనూ ఓపీఎస్ అమలు చేయాలి : స్థితప్రజ్ఞ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కర్నాటక సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని త్వరలోనే అమలు చేస్తామంటూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించడం పట్ల నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్ఎంఓపీఎస్) హర్షం ప్రకటించింది. ఈనెల ఏడో తేదీన ఉపవాస సత్యాగ్రహ దీక్షకు ఆ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్, సీపీఎస్ డీసీఎం డిఎ అంజూమ్ పర్వేజ్ కమిటీ తుది సమావేశాన్ని నిర్వహించారు.

నివేదికను తీసుకుని ఓపీఎస్‌ను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని సిద్ధరామయ్య హామీ ఇచ్చారు. ఈ మేరకు ఎన్ఎంఓపీఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ, టీఎస్‌సీపీఎస్ఈయూ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన హిమాచల్ ప్రదేశ్‌లో ఓపీఎస్‌ను అమలు చేస్తున్నదని తెలిపారు. ఇప్పుడు కర్నాటకలోనూ ఓపీఎస్ అమలు కోసం చర్యలు తీసుకుంటామని ఆ ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు.

రాష్ట్రంలో ఎస్‌బీఐ 1206 శాఖలకు విస్తరణ

ఒకే రోజు 10 శాఖల ఏర్పాటు

ప్రారంభించిన చైర్మెన్ సిఎస్ శెట్టి



హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తెలంగాణ రాష్ట్రంలో 1200 శాఖల మైలురాయిని అధిగించింది. హైదరాబాద్ సర్కిల్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన 10 శాఖలను శుక్రవారం ఆ బ్యాంక్ చైర్మెన్ సిఎస్ శెట్టి వర్చ్యువల్‌గా ప్రారంభించారు. ఆ బ్యాంక్ హైదరాబాద్ సర్కిల్ సీజీఎం రాజేష్ కుమార్‌తో కలిసి వీటిని అందుబాటులోకి తెచ్చారు. ఇందులో అలాంపూర్ ఎక్స్ రోడ్, చిన్నమ్‌బావి, రాఘవేంద్ర కాలనీ (కొండాపూర్), నియోపోలిస్, కిష్టరెడ్డిపేట్ (పటాన్‌చెరు), ఖాజాగూడా, ఉస్మాన్ నగర్, కంగ్టి (నారాయన్‌ఖేడ్), సుచిత్ర సర్కిల్, నందిపేట్‌లలో కొత్త శాఖలు ఉన్నాయి. వీటిల్లో ఐదు గ్రామీణ ప్రాంతాల్లో, మరో ఐదు పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తంగా 1206 శాఖలకు విస్తరించినట్లు ఎస్‌బీఐ వెల్లడించింది. దీంతో ఈ ప్రాంతంలో తమ సేవలు మరింత విస్తృతం అయ్యాయని ఎస్‌బీఐ పేర్కొంది.

తమ బ్యాంక్ ముఖ్యంగా ఖాతాదారులు సంతృప్తి, వ్యాపార వృద్ధి, సమాగ్రాభివృద్ధి, ఉద్యోగాల ప్రాధాన్యత అనే నాలుగు స్థంబాలపై పని చేస్తోందని ఎస్‌బీఐ చైర్మెన్ సిఎస్ శెట్టి అన్నారు. అన్ని రకాల బ్యాంకింగ్ సేవల్లో మరింత మంది ఖాతాదారులను చేరాలనే అంకితభావంతో కొత్త శాఖలను విస్తరిస్తున్నామన్నారు. నూతన శాఖలు మరింత విస్తృతమైన సేవలను అందించనున్నాయన్నారు. దేశ ఆర్థిక భవిష్యత్తు కోసం ఎస్‌బిఐ పని చేస్తోందన్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలోనూ తమ బ్యాంక్ ముందు వరుసలో ఉందన్నారు. ప్రపంచ దేశాల బ్యాంక్‌ల్లో నాలుగో అత్యంత నమ్మదగిన బ్యాంక్‌గా ఎస్‌బీఐ గుర్తింపు పొందిందన్నారు.

సాగు, తాగు నీటికి కటకట

ప్రభుత్వం వద్ద ముందస్తు ప్రణాళికల్లేవు

హరీశ్‌రావుపై కుట్రపూరితంగా కేసులు - బీఆర్ఎస్ నేతల విమర్శ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో మళ్లీ పాత రోజులు వచ్చాయనీ, సాగు, తాగు నీటికి కటకటలాడే పరిస్థితులు వచ్చాయని బీఆర్ఎస్ నేతలు మాజీ మంత్రులు జీ జగదీశ్‌రెడ్డి, వీ శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. శుక్రవారంనాడిక్కడి తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తాగు, సాగునీటి సరఫరాపై ప్రభుత్వం వద్ద ఎలాంటి ముందస్తు ప్రణాళికలు లేవన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్రం అనుమతులు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నా కాంగ్రెస్ సర్కార్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందన్నారనీ, కానీ ప్రభుత్వ నివేదికలే ఆ ప్రాజెక్ట్ ద్వారా 20 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చినట్టు చెప్తున్నాయన్నారు. అబద్ధాల పునాదులతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందనీ, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కలిసి ఇతర రాష్ట్రాలతో కృష్ణా నీటి హక్కుల గురించి పోరాడాల్సింది పోయి, రెండూ కొట్లాడుకునే పరిస్థితికి తెచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో అరాచక శక్తులు రాజ్యమేలుతున్నాయనీ, ఏడో గ్యారంటీగా ప్రతీకార పాలన అమలు చేస్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి హరీశ్‌రావుపై కక్షపూరితంగానే నేరస్తుడు చక్రధర్‌తో పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో తప్పుడు కేసులు పెట్టించారన్నారు. హరీశ్‌రావుకు తక్షణం పోలీసు రక్షణ కల్పించాలని కోరారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఎదుర్కొనే సత్తా బీఆర్ఎస్ పార్టీకి ఉందన్నారు. కృష్ణా జలాలపై హరీశ్‌రావు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెత్త మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రానికి వాటా ప్రకారం నీళ్లు రాకపోవడానికి చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్, బీజేపీ పార్టీలే కారణమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రాజెక్టుల నిర్మాణంపై జగన్ , చంద్రబాబు ఒకే వైఖరితో ఉన్నారనీ, తెలంగాణలో మాత్రం కేసీఆర్ ప్రాజెక్టులు కడుతుంటే కాంగ్రెస్ నేతలు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారని అన్నారు.

విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా చదవాలి

- పది ఫలితాలు భవిష్యత్తుకు తొలిమెట్టు
- ఎస్సీ బాలుర వసతి గృహాన్ని రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

నవతెలంగాణ -బూర్గంపాడు

బూర్గంపాడులోగల ఎస్సీ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం రాత్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో కలిసి రాత్రి బస చేశారు. వసతి గృహంలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని రికార్డులు పరిశీలించారు. భోజనాన్ని పరిశీలించారు. టీచర్స్, మెస్ కమిటీతో భోజనం ఎలా ఉంటుందని అడిగి తెలుసు కున్నారు.



బియ్యం స్టాక్ రిజిస్టర్ ను చెక్ చేశారు. నిల్వ ఉంచిన కూరగాయలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం వస్తే గృహంలో ప్రతి మరుగుదొడ్లను పరిశీలించి ప్రతిరోజు మరుగు దొడ్లను శుభ్రం చేయాలని ఆదేశించారు. వసతి గహంలో విద్యార్థులు నిద్రించేం దుకు ఏర్పాటు చేసిన బెడ్స్ ను పరిశీలించి ఇంతమంది విద్యార్థులు నిద్రించడానికి ఈ బెడ్లు ఎలా సరిపోతాయి, మిగిలిన వారు క్రింద పడుకుంటున్నారా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిత్వ వికాసం పెంపొందించే మంచి మాటలు చెబుతూనే.. జీవిత లక్ష్యం ఏమిటని కుశల ప్రశ్నలను సంధించి విద్యార్థుల నుండి సమాధానాలు రాబట్టారు.

ఎలాంటి ఒత్తులు లేకుండా చదవాలి: కలెక్టర్ జితేష్ వి. పాటిల్

ఎలాంటి వత్తిడి లేకుండా విద్యార్థులు చదవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. వెనుకంజలో ఉన్న సబ్జెక్టుపై ప్రత్యేక శ్రద్ధ చూపిం చాలని తెలిపారు. విద్యా ర్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టంతో కాకుండా ఇష్టంగా చదవాలని, మానసిక ఒత్తిడికి గురికావొద్దని సూచించారు. పది ఫలితాలు విద్యార్థుల భవిష్యత్తుకు తొలి మెట్టు అని, భవిష్యత్ లక్ష్య సాధనకు దిక్సూచి అని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే పరిశీలించి నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఎస్సీ సంక్షేమ అధికారి అనసూయ, హాస్టల్ వార్డెన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**

రిజిస్టర్డు ఆఫీసు: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.

బ్రాంచ్ ఆఫీసు: డి.నెం.12-107/7, ఫ్లాట్-12, అను టవర్స్, సూర్యాపేట రోడ్, కోదాడ టౌన్, సూర్యాపేట జిల్లా-508206

(రూల్-8(3)) స్వాధీనతా ప్రకటన

గమనిక: ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" అనునది ఎన్‌సిఎల్‌టి, చెన్నై ఉత్తర్వుల ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" విలీనమైనది. తరువాత "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్" పేరును 30.11.2022 తేదినాటి పేరు మార్పును అనుసరించి ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికేట్ ఆధారంగా 31.11.2022 నుండి "శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్" గా మార్చబడినది. ఏదైతే, దిగువ సంతకందారు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్) యొక్క అధీకృత అధికారిగా ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టం) క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (సదరు రూల్స్)లోని రూల్ 3తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని దిగువ వివరాలు ఏవైతే దిగువ పట్టికలో పేర్కొన్న మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీచేసి, సదరు డిమాండ్ నోటీసుల్లో పేర్కొన్న మొత్తాలను తిరిగిచెల్లించవలసిందిగా కోరబడినది. రుణగ్రహీతలు మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రిందిసంతకందారు ఎస్ఎఫ్ఎల్ యొక్క అధీకృత అధికారిగా సదరు చట్టంమరియు రూల్స్‌లోని సెక్షన్ 14 క్రింద సిఆర్ఎల్ ఎం.పి.నెం.115/2024లో గౌరవ చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్, సూర్యాపేట్ వారిచే జారీచేసిన ఉత్తర్వులను అనుసరించి దిగువ తాకట్టుపెట్టిన ఆస్తులను 20-02-2025న భౌతికంగా స్వాధీనతాను అప్పగించారు.

రుణగ్రహీత పేరు మరియు చిరునామా	డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం
1) సైదా షేక్ తండ్రి షేక్ బుర్హానుద్దీన్, వయస్సు సుమారు 39 సం౹౹లు, వృత్తి: వ్యాపారం (ఎంఎస్ టైమ్ స్టోన్) నివాసం: ఇ.నెం.5-53, మజీద్ బజార్, రఘునాథపాలెం గ్రామం, మట్టంపల్లి మండలం, నల్గొండ జిల్లా, పిన్‌కోడ్: 5088204. 2) షేక్ కొండటి రజియా, భర్త సైదాషేక్, సుమారు 39 సం౹౹లు, వృత్తి: వ్యాపారం, నివాసం: ఇ.నెం.5-53 మజీద్ బజార్ రఘునాథపాలెం గ్రామం, మట్టంపల్లి మండలం, నల్గొండ జిల్లా, పిన్‌కోడ్: 508204. 3) షేక్ బాబావలి తండ్రి షేక్ జానిమియా, సుమారు 29 సం౹౹లు, వృత్తి: వ్యాపారం (మొబైల్ షాప్ సేల్స్ అండ్ సర్వీసెస్), నివాసం: ఇ.నెం.6-40, రఘునాథపాలెం గ్రామం, మట్టంపల్లి మండలం, నల్గొండ జిల్లా, పిన్ కోడ్: 508204.	రూ. 56,88,581/- (రూపాయలు యాభైఆరు లక్షల ఎనభైఎనిమిది వేల ఐదువందల ఎనభై ఒకటి మాత్రమే)

స్థిరాస్తికి సంబంధించిన వివరణ: సైదా షేక్ తండ్రి షేక్ బుర్హనుద్దీన్: పత్రం నెం.7114 ఆఫ్ 2008 ఆధారంగా బ్లాక్ నెం.7, మట్టంపల్లి గ్రామపంచాయత్ మరియు రెవెన్యూ గ్రామం, మట్టంపల్లి రెవెన్యూ మండలం, నల్గొండ జిల్లా, ప్రస్తుతం సూర్యాపేట జిల్లా, ఎస్ఆర్ఓ హుజూర్‌నగర్ పరిధిలోని 600 చ.గ.లు లేదా 504.00 చ.మీ.ల విస్తీర్ణపు ప్లాట్ నెం.6 రియు సర్వే నెం.830లోని మొత్తం భాగం మరియు ఈ క్రింది విధంగా సరిహద్దులు: ఉత్తరం: కందుల ఆరోగ్య రెడ్డి, దక్షిణం: 20 అ.ల గ్రామపంచాయతీ బజార్, తూర్పు: తిరుమలరెడ్డి థామస్ రెడ్డి ల్యాండ్, పడమర: సంగ్య ల్యాండ్.

ఇందుమూలంగా ప్రకటన ద్వారా సర్వజనులను హెచ్చరించడమేమనగా, ఎస్ఎఫ్ఎల్ యొక్క అధీకృత అధికారి, ఇందు పై పేర్కొన్న స్థిరాస్తులను చట్టబద్ధంగా లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకున్నారు మరియు రుణగ్రహీతలు లేదా ఎవరైనా వ్యక్తి ఈ నోటీసు స్వీకరించిన తరువాత ఎస్ఎఫ్ఎల్ యొక్క ముందస్తు అనుమతి లేకుండా, ఈ ప్రకటనలో పేర్కొన్న పై పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్స్‌ను అమ్మకం, లీజు లేదా ఇతర విధానాల ద్వారా లావాదేవీలు జరుపుటకు బదలాయింపు చేయలేరని గమనించగలరు.

తేది: 20-02-2025
ప్రదేశం: కోదాడ

సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఢిల్లీ రిమోట్ కంట్రోల్‌ను అంగీకరించం

యూజీసీ ముసాయిదా నిబంధనలపై ప్రతిపక్షాల మండిపాటు

రాష్ట్రాల హక్కులు హరిస్తుంది : పినరయి

యూజీసీ ముసాయిదా నిబంధనలపై ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశాయి. ఈ నిబంధనలు ఉన్నత విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను హరిస్తాయని మండిపడ్డాయి. 'ఢిల్లీ రిమోట్ కంట్రోల్'ను అంగీకరించేది లేదని స్పష్టం చేశాయి. తెలంగాణ, తమిళనాడు, కేరళ, జార్ఖండ్ వంటి బీజేపీ యేతర పార్టీల పాలనలోని రాష్ట్రాలు గురువారం తిరువనంతపురంలో జాతీయ సదస్సు నిర్వహించాయి. ఇది యూజీసీ ముసాయిదా నిబంధనలను వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు నిర్వహించిన రెండో సదస్సు. ఈ నెల ఐదవ తేదీన బెంగళూరులో జరిగిన మొదటి సమావేశానికి హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, కేరళ, జార్ఖండ్ సహా ఆరు రాష్ట్రాల ఉన్నత విద్యా శాఖ మంత్రులు హాజరయ్యారు. తిరువనంతపురం సదస్సుకు కేరళ ఆతిథ్యం ఇచ్చింది.

తిరువనంతపురం : దేశ సమాఖ్య మూలాలను దెబ్బతీస్తూ ఉన్నత విద్యలో రాష్ట్రాల హక్కులను హరించేలా కేంద్రం నిబంధనలు తీసుకొస్తున్న నేపథ్యంలో జాతీయ సదస్సు ప్రాధాన్యతను సంతరించుకున్నదని సదస్సును ఉద్దేశించి ప్రకసంగించిన కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెప్పారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాల ఏర్పాటు, నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్రను ఈ సదస్సు పునరుద్ఘాటిస్తోందని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమానికి కేరళ ఉన్నత విద్యా మంత్రి డాక్టర్ ఆర్.బిందు, ఆర్థిక మంత్రి ఎన్.బాలగోపాల్, కేరళ ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ (కాంగ్రెస్), తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల ఉన్నత విద్యా మంత్రులు డాక్టర్ ఎంసీ సుధాకర్, డాక్టర్ గోవి చెజియన్ తదితరులు హాజరయ్యారు. యూజీసీ నిబంధనలను కేరళలోని అధికార ఎల్డీఎఫ్‌తో పాటు ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా వ్యతిరేకిస్తోంది.

కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ జనవరి 6వ తేదీన ముసాయిదా నిబంధనలను ప్రవేశపెట్టారు. వీటిని ఉపసంహరించుకోవాలని కోరుతూ జనవరి 21న కేరళ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. అంతేకాక నిబంధనల ప్రభావంపై పత్రాన్ని రూపొందించేందుకు ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో రాష్ట్ర ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఇచ్చిన నివేదికను కూడా సదస్సులో విడుదల చేశారు.

నిబంధనలు అమలు చేస్తే రాష్ట్ర చట్టాల కింద ఏర్పాటైన ప్రభుత్వ యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వాలకు ఎలాంటి ప్రమేయం లేకుండా పోతుందని విజయన్ తెలిపారు. సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రాలకు ఉన్న చట్టబద్ధమైన హక్కులను ఇవి హరిస్తాయని చెప్పారు. 'ప్యానల్ నుండి ఛాన్సలర్ ఎవరో ఒకరిని ఎంపిక చేస్తే అది కచ్చితంగా అధికారంలో ఉన్న వారి ఆదేశాల మేరకే జరుగుతుంది. పాలకులే గవర్నర్లను నియమిస్తారు.

దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ గవర్నర్లే యూనివర్సిటీల ఛాన్సలర్లుగా ఉన్నారు' అని అన్నారు. బోధించాల్సిన సబ్జెక్టులో డిగ్రీ లేకపోయినా అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమించడం ఉన్నత విద్యా రంగానికి హానికరమని చెప్పారు. ముసాయిదా నిబంధనలను ఉల్లంఘిస్తే చేపట్టబోయే చర్యలు తీవ్రంగా, అతిగా, అప్రజాస్వామికంగా ఉన్నాయని అంటూ వీటిని పునఃపరిశీలించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు.

తదుపరి సదస్సు హైదరాబాద్‌లో : భట్టి

ఉన్నత విద్యను కేంద్రీకృతం చేయడం వల్ల రాష్ట్రాలు తమ సొంత విశ్వవిద్యాలయాల్లోనే ప్రేక్షకులుగా మిగిలిపోతాయని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. 'విద్యను ఢిల్లీనుండి రిమోట్ కంట్రోల్ ద్వారా నడపలేము. కేంద్రానికి సహకార ఫెడరలిజంపై విశ్వాసం ఉంటే ఆ సహకారానికి సంప్రదింపులు అవసరం. మేము నిధులు అడగడం లేదు. కేవలం మా హక్కులనే నొక్కి చెబుతున్నాం' అని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వం తదుపరి సదస్సును హైదరాబాదులో నిర్వహిస్తుందని భట్టి ప్రకటించారు.



పట్నాయక్ కమిటీ ఏం చెప్పిందంటే....

ముసాయిదా నిబంధనల్లో తీవ్రమైన రాజ్యాంగ అంశాలు ఉన్నాయని, అవి రాష్ట్రాల హక్కులపై దాడి చేస్తున్నాయని ప్రభాత్ పట్నాయక్ కమిటీ తన నివేదికలో తెలియజేసింది. ఈ కమిటీలో కేరళ ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ రాజన్ గురుక్కల్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌వీ వర్ఘీస్ తదితరులు సభ్యులు. రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యుల్ ప్రకారం ప్రభుత్వ యూనివర్సిటీల ఏర్పాటు, పర్యవేక్షణలో రాష్ట్రాలకు అధికారం ఉన్నదని నివేదిక తెలిపింది. యూనివర్సిటీలను సంప్రదించి ఉన్నత విద్యలో సమన్వయం, ప్రమాణాల రూపకల్పనకే యూజీసీ పాత్రను పరిమితం చేసిందని వివరించింది. 'ప్రభుత్వ వర్సిటీలకు 80 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వాలే సమకూరుస్తాయి. అలాంటి రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయాన్ని ముసాయిదా నిబంధనలు తప్పించడమే కాకుండా వర్సిటీలు ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయకుండా అడ్డుకుంటాయి' అని తెలిపింది. ప్రైవేటు రంగానికి చెందిన వారిని వైస్ ఛాన్సలర్లుగా నియమిస్తే ఉన్నత విద్య మరింత వ్యాపారమయం అవుతుందని, దాని సమగ్రత దెబ్బతింటుందని, విద్యా సంబంధమైన స్వేచ్ఛ, విమర్శనాత్మక ఆలోచనలకు విఘాతం కలుగుతుందని పట్నాయక్ కమిటీ తన నివేదికలో హెచ్చరించింది.



జర్నలిస్టులకు ఆరోగ్య, జీవిత బీమా

బడ్జెట్‌లో తగిన నిధుల కేటాయింపు

పాత్రికేయుల ఇండ్లస్థలాల సమస్యలపై ఆలోచిస్తున్నాం

హెచ్‌యూజే డైరీ ఆవిష్కరణలో ఉప ముఖ్యమంత్రి భట్టి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జర్నలిస్టులకు హెల్త్ ఇన్సూరెన్సు కల్పించడంతో పాటు జీవిత బీమా కల్పించే దానిపై ప్రభుత్వంలో చర్చించి నిర్ణయం తీసుకుం టామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యను ఏం చేయాలనే దానిపై ఆలోచన చేస్తున్నట్టు వివరించారు.

శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో హైదరాబాద్ యూనియన్ అఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే-టీడబ్ల్యూజేఎఫ్) 2025 డైరీని భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు బి అరుణ్ కుమార్, బి జగదీశ్వర్ జర్నలిస్టుల సమస్యలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా జర్నలిస్టుల హెల్త్ కార్డులు సక్రమంగా పనిచేయడం లేదని వివరించారు.

జర్నలిస్టుల కుటుంబాలకి ప్రతి ఏటా రూ.10 లక్షల వరకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్ స్కీంలో జర్నలిస్టుల హెల్త్ స్కీం కలిపి అన్ని ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో జర్నలిస్టులకు ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతుల కోసం రైతు బీమా అమలు చేస్తున్నట్టు, అక్రిడిటేషన్ ఉన్న జర్నలిస్టు లందరికీ జర్నలిస్టు బీమా కింద జీవిత బీమా అమలు చేయాలని సూచించారు. ఏదేని కారణంతో ప్రమాదవశాత్తు జర్నలిస్టు చనిపోతే.. వారి కుటుంబాలకు పరిహారం కింద రూ.ఐదు లక్షల నుంచి రూ.10 లక్షలు అందేలా ప్రభుత్వం జర్నలిస్టు బీమా పథకం తీసుకురావాలని కోరారు.

ఈ అంశాలపై సానుకూలంగా స్పదించిన ఉప ముఖ్యమంత్రి భట్టి జర్నలిస్టుల ఆరోగ్య బీమా, జీవిత బీమా, హెల్త్ కార్డులపై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనారోగ్యంతో వైద్య చికిత్స తీసుకుని ఇంటి దగ్గర రెండు మూడు నెలలు విశ్రాంతిలో ఉండే జర్నలిస్టులకూ కుటుంబ పోషణ కోసం ఆర్థిక సహకారం అందించే విషయాన్ని పరిశీలన చేస్తామన్నారు. ఇండ్ల స్థలాల సమస్య కోర్టు పరిధిలో ఉన్నందున, ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై ఆలోచన చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, కోశాధికారి బట్టిపాటి రాజశేఖర్, నాయకులు రామకృష్ణ, మధుకర్, క్రాంతి, ప్రశాంత్, కొడవటి నవీన్, సీనియర్ జర్నలిస్టులు యాదగిరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'సుగుణ ఫుడ్స్'లో ఎగిరిన ఎర్రజెండా

- కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూ జయకేతనం
- బీఎంఎస్‌పై భారీ మెజారిటీతో గెలుపు

యూనియన్ నాయకులు, కార్మికుల సంబురాలు



నవతెలంగాణ-శివ్వంపేట

మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని శభాష్‌పల్లి శివారులోని సుగుణ ఫూడ్స్ కంపెనీలో శుక్రవారం నిర్వహించిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూ మరోసారి జయకేతనం ఎగురవేసింది. సంఘం గుర్తింపు ఎన్నికల్లో మొత్తం 58 ఓట్లకుగాను 57 ఓట్లు పోలవగా, అందులో సీఐటీయూ అభ్యర్థి జె.మల్లికార్జున్‌కు 39 రాగా బీఎంఎస్ తరుపున పోటీ చేసిన మల్లేష్‌కు 18 ఓట్లు వచ్చాయి. 21 ఓట్ల భారీ మెజారిటీతో సీఐటీయూ విజయకేతనం ఎగురవేసింది. రెండోసారి యూనియన్ ఎన్నికల్లో సీఐటీయూ తరుపున జె.మల్లికార్జున్ ఎన్నిక కావడంతో కార్మికులు ఆనందోత్సాహాలలో ఉన్నారు.

పరిశ్రమ ఎదుట సంబురాలు

ఎన్నికల్లో గెలుపొందిన వెంటనే సుగుణ కంపెనీ ముందు కార్మికులు భారీ ఎత్తున పటాకులు కాల్చుతూ, మల్లికార్జున్‌ను పూలవర్షంతో ముంచెత్తారు. 'సీఐటీయూ జిందాబాద్' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ.. మెరుగైన వేతన ఒప్పందం, కార్మికులను పర్మినెంట్ చేయటం, పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు, కార్మికుల కోసం నిరంతరం పోరాటం చేయడం వల్లనే రెండోసారి భారీ విజయాన్ని సాధించిందన్నారు. యూనియన్ తరుపున గుర్తింపు ఎన్నికల్లో గెలిపించడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. భవిష్యత్‌లో కూడా సుగుణ కంపెనీ కార్మికులకు సీఐటీయూ మరింత అండగా నిలబడి పోరాడుతుందని స్పష్టం చేశారు. యూనియన్‌లకు అతీతంగా, కార్మిక సంఘాలతో కలిసి ప్రతి కార్మికుని తరుపున పోరాడుతూ, వారికి మేలు జరిగేలా ప్రతినిత్యం కృషి చేస్తామన్నారు. ఈ గెలుపు కంపెనీ కార్మికులకే అంకితమని, విజయానికి కృషి చేసిన కార్మికులకు, సంఘాల నాయకులకు పేరుపేరున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుగుణ ఫుడ్స్ కంపెనీ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎ. మహేందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు ఎ.మల్లేశం, ప్రధాన కార్యదర్శి యాదగిరి, కోశాధికారి వై. కుమార్, నాయకులు ఇంద్రేష్, శేఖర్, కల్లూరి రాజు, సాయిలు, షబ్బీర్, బిక్షపతి, భాస్కర్, మహేందర్ రెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరాన్నజీవులనటం సరికాదు

నిరాశ్రయులపై ఆ వ్యాఖ్యలు అన్యాయం

- జస్టిస్ గవాయ్ వ్యాఖ్యలపై మాజీ బ్యూరోక్రాట్ల అభ్యంతరం
- బహిరంగ లేఖ విడుదల



న్యూఢిల్లీ : ఉచితాల విషయంలో నిరాశ్రయులను ద్వేశిస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై మాజీ బ్యూరోక్రాట్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. వారిని పరాన్నజీవులుగా పిలవటాన్ని తప్పుబట్టారు. ఈమేరకు రిటైర్డ్ సివిల్ సర్వెంట్లు, దౌత్యవేత్తలు ఆయనకు బహిరంగ లేఖను రాశారు. పిటిషన్ విచారణ సందర్భంగా ఈనెల 12న జస్టిస్ గవాయ్ చేసిన వ్యాఖ్యలను వారు లేవనెత్తారు. "ఇలా అంటున్నందుకు క్షమించాలి, వీరిని ప్రధాన స్రవంతి సమాజంలో భాగం చేయకుండా, ఒక తరగతి పరాన్నజీవులను మనం తయారు చేయటం లేదా?" అని గవాయ్.. పిటిషన్ విచారణ సందర్భంగా వ్యాఖ్యలు చేసినట్టు సమాచారం. నిరాశ్రయుల విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతూ మాజీ బ్యూరోక్రాట్లు తమ బహిరంగ లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు.

"ప్రభుత్వ విధుల వైఫల్యం కారణంగా పేదరికంలోకి నెట్టివేయబడినవారే నిరాశ్రయులు. ఈ విధులలో తగిన ఇండ్లు, పని, గృహ, లైంగిక వేధింపుల నుంచి రక్షణర, సామాజిక భద్రత, ఆహారం, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, ప్రత్యేకించి పిల్లల కోసం సురక్షిత, సంతోషకర పరిస్థితుల్లో విద్యాహక్కు ఉన్నాయి. అసంఘటిత కార్మికుల్లో నిరాశ్రయులైన మహిళలు, పురుషులు 'అత్యంత అభద్రత' ఉన్నారు. వారు ప్రతిరోజూ తక్కువ మొత్తానికే పని చేస్తున్నారు" అని మాజీ బ్యూరోక్రాట్లు పేర్కొన్నారు.దేశంలోని సంపన్నులకు ప్రకటించే ఆదాయ పన్ను మినహాయింపులు, పెద్ద కంపెనీలకు రుణ మాఫీలు, ట్యాక్స్ హాలీడేస్‌లను ఉచితాలుగా పరిగణించకుండా.. మన పౌరులకు ఇండ్లు, సామాజిక భద్రత, పని భద్రత, ఆరోగ్య సంరక్షణపై ప్రజా ధనాన్ని ఖర్చు చేయటాన్ని ఉచితాలుగా పేర్కొనటం ఆశ్చర్యకర మని వారు వివరించారు. దేశంలోని నిరాశ్రయులు అత్యంత ప్రమాదకర పరిస్థితులలో జీవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టికల్ 21కు కట్టుబడి ప్రభుత్వాలు తమ బాధ్యతలు నిర్వర్తించాలనీ, నిరాశ్రయులకు నైట్ షెల్టర్లు కల్పించాలన్న సుప్రీంకోర్టు గత తీర్పును ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.

ఎల్‌ఓసీ పరిస్థితులపై భారత్, పాక్ సైన్యం చర్చలు

శ్రీనగర్ : జమ్మూ రీజన్‌లోని నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) వెంబడి పరిస్థితులపై శుక్రవారం భారత్, పాకిస్తాన్ సైన్యం చర్చలు జరిపాయి. పూంచ్ జిల్లాలోని పిర్ పంజాల్ లోయలో ఈ సమావేశం జరిగింది. లోయలోని చక్కన్ డ బాఘ్ క్రాసింగ్ పాయింట్ వద్ద బ్రిగేడ్ కమాండర్ స్థాయిలో నిర్వహించిన ఈ సమావేశం ఉదయం 10:30 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకూ జరిగినట్టు ఒక అధికారి తెలిపారు. ఎల్‌ఓసీ వద్ద పెరుగుతున్న ఉద్రికత్తలు, వాటిని తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ భేటీలో చర్చించినట్టు సమాచారం. అయితే ఈ సమావేశం తరువాత ఇరు దేశాల సైన్యం ఎలాంటి ఉమ్మడి ప్రకటన విడుదల చేయలేదు, అదే విధంగా సమావేశంలో చర్చించి వివరాలు కూడా వెల్లడించలేదు. అయితే 'ఎల్‌ఓసీ వద్ద శాంతిని తీసుకురావడం, అలాగే 2003, 2020ల్లో జరిగిన కాల్పుల విరమణ ఒప్పందాలకు కట్టుబడి ఉండటం లక్ష్యంగా ఈ సమావేశం జరిగినట్టు' అధికారులు తెలిపారు. గత 24 గంటల్లో పూంచ్‌లో ఎల్‌ఓసి వెంబడి రెండు పేలుడు ఘటనలు, కాల్పులు జరిగిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. ఇందులో ఒకటి శుక్రవారం ఉదయమే జరిగింది. 2020 నుంచి ఎల్‌ఓసీ వెంబడి కాల్పుల విరమణ ఒప్పందాన్ని భారత్, పాక్‌లు అమలు చేస్తున్నాయి.

'మొదటి' ఓటు వేసి గెలిపించండి

- విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా
- మండలి లోపల, బయట అనేక పోరాటాలు
- 30శాతం ఫిట్మెంట్‌తో పీఆర్సీ సాధనకు నిరాహార దీక్ష
- ఇంకా ఎన్నో సమస్యలు.. మరోసారి అవకాశమిస్తే వాటినీ సాధిస్తా:

టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్, తదితర సంఘాలు బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ - ఖమ్మం, నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధులు

వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉమ్మడి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గానికి 27వ తేదీన జరిగే ఎన్నికల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్, అధ్యాపక, రెసిడెన్షియల్ స్కూల్, మోడల్ స్కూల్, తదితర సంఘాలు బలపరుస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు. 2019 మార్చి 22న జరిగిన ఎన్నికల్లో తనను గెలిపించిన నాటి నుంచి ఉపాధ్యాయులు, అధ్యాపకుల గొంతుకగా శాసన మండలి లోపల, బయట పని చేశానన్నారు. రాష్ట్రంలో మొదటి పీఆర్సీ ఆలస్యమవుతున్న నేపథ్యంలో 2020 మార్చి 5న ఇందిరాపార్కు వద్ద నిరాహారదీక్ష చేశామని గుర్తు చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని యూటీఎఫ్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడారు. 30శాతం ఫిట్మెంట్‌తో పీఆర్సీ సాధనలో తన కృషి ఉందన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకారం 30శాతం వేతనాలు పెంచేందుకు కృషి చేశానని చెప్పారు. ప్రమోషన్స్‌కు టెట్ సమస్య ప్రధాన అడ్డంకిగా ఉన్న స్థితిలో ఢిల్లీకి వెళ్లి ఎన్సీటీఈ చైర్మెన్, సెక్రెటరీతో మాట్లాడి సమస్యను పరిష్కరించానని తెలిపారు. జూన్ 16న ఉపాధ్యాయ సంఘ నాయకులతో పాటు ముఖ్యమంత్రిని కలిసి మాట్లాడటం వల్లనే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ వేగంగా పూర్తి చేశారని చెప్పారు. గిరిజన సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతు లు చేయించానని తెలిపారు. పాఠశాలల్లో క్లీనింగ్, సర్వీసు పనుల కోసం విద్యాశాఖ నుంచి గ్రాంట్స్ ఇవ్వాలని మూడు సంవత్సరాలుగా శాసన మండలిలో ప్రస్తావించడం వల్లనే ఆరు స్లాబుల్లో గ్రాంటు మంజూరు చేశారన్నారు. పాఠశాలల విద్యుత్తు బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేలా కృషి చేసినట్టు చెప్పారు. మోడల్ స్కూల్స్ ఉపాధ్యాయులకు 2020 పీఆర్సీ, లీవ్‌ల మంజూరు, బదిలీల సమస్యలను పరిష్కరించినట్టు తెలిపారు. ఐదు రకాల గురుకులాల్లో బదిలీలు, పదోన్నతుల షెడ్యూలు పూర్తి చేయించానని, కేజీబీవీ ఉపాధ్యాయు లకు రెండుసార్లు జీతం పెంపు, మూడుసార్లు బదిలీలు, ఎండాకాలం జీతం, ఆటో రెన్యూవల్, ఎమ్మెల్సీ ఓటు హక్కు సాధించటంలో కృషి చేశానన్నారు. జూనియర్ లెక్చరర్స్ బదిలీలు, కాంట్రాక్ట్ లెక్చరర్ల రెగ్యులరైజేషన్, గెస్టు లెక్చరర్ల సమస్యల పరిష్కారంలో తన కషి ఉందన్నారు. డిగ్రీ లెక్చరర్లు, పాలిటెక్నిక్ లెక్చరర్ల బదిలీలు, రెగ్యులరైజేషన్, యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల వేతనాల పెంపు కోసం కృషి చేశానన్నారు. సీపీఎస్ రద్దు కోసం శాసన మండలితో పాటు వెలుపల పోరాటాలు చేసినట్టు తెలిపారు. దీనికోసం ఇందిరాపార్కు వద్ద ఒకసారి నిరాహార దీక్ష, మరొకసారి నిరసన దీక్ష చేశానన్నారు. నల్లగొండ నుంచి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం (ప్రగతి భవన్) వరకు నాలుగు రోజులు నడక యాత్ర చేశానన్నారు. శాసన మండలి జరిగే సమయంలో ఎమ్మెల్సీ క్వార్టర్స్ నుంచి శాసన మండలి వరకు సమస్యల బ్యానర్‌లతో నడుచుకుంటూ వెళ్ళి, నిరసన వ్యక్తం చేసినట్టు గుర్తుచేశారు.

పరిష్కారం చేయాల్సిన సమస్యలపైనా పోరాటం..


పరిష్కరించాల్సిన పలు సమస్యలపైనా పోరాటం చేస్తానని నర్సిరెడ్డి హామీ ఇచ్చారు. 2023 డీఎస్సీ ఉపాధ్యాయులతో సహా సెప్టెంబర్ 2004 నుంచి ఉద్యోగాల్లోకి వచ్చిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేయించి, ఓపీఎస్ అమలు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. మండల విద్యాధికారులు, ఉప విద్యాధికారులు, డైట్ లెక్చరర్స్, జూనియర్ లెక్చరర్స్ పోస్టుల్లో ప్రమోషన్స్ అమలు చేయిస్తానని హామీ ఇచ్చారు. గురుకులాల సమయ మార్పిడి, హెల్త్ కార్డులు, డిప్యూటీ వార్డెన్ పోస్టుల మంజూరు, 010 ద్వారా జీతాల చెల్లింపు సమస్యల పరిష్కారానికి పాటుపడతానన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 ద్వారా జీతాలు, హెల్త్ కార్డులు, ప్రమోషన్స్ ఇప్పించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమమ్ బేసిక్ పే, కేర్ టేకర్ పోస్టు, హెల్త్ కార్డులు, ఉద్యోగ భద్రత సాధించాలన్నారు. గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పండిట్, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్, సీఆర్‌లకు మినిమం బేసిక్ పే, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు పోస్టులు మంజూరు చేయిస్తానన్నారు. జూనియర్ కళాశాలలకు నిర్వహణ గ్రాంట్స్ మంజూరి, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. డిగ్రీ కాలేజీ, పాలిటెక్నిక్ అధ్యాపకులకు 7వ కేంద్ర ప్రభుత్వ పీఆర్సీ ఏరియర్స్ కోసం పోరాడుతానన్నారు. యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల రెగ్యులరైజేషన్, గ్రాంట్స్ పెంపు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగా మార్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రయివేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు పీఎఫ్ అమలు, హెల్త్ స్కీమ్, రిటైర్మెంటప్పుడు ఎక్స్‌గ్రేషియా చెల్లింపు, అర్హులైన వారికి ప్రభుత్వ గృహాల కల్పనకు పాటుపడతానన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావ దుర్గాభవాని, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. విజయ్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏవీ నాగేశ్వరరావు, వెంగళరావు, నాయకులు జీవీ నాగమల్లేశ్వరరావు, వెంకన్న, రాంబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి గెలిస్తేనే.. ఓటరు గెలిచినట్టు : టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి

ఈ నెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి గెలిస్తేనే ఓటరు గెలిచినట్టని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి అన్నారు. ఇంకెవరు గెలిచినా వారు వెంటనే అధికార పార్టీలో చేరిపోయే అవకాశవాదులేనని, అప్పుడు ఓటర్ ఓడిపోతారని తెలిపారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సిరెడ్డి మాత్రమే గత ఆరేండ్లుగా నిజమైన ఉపాధ్యాయ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని, నిత్యం నియోజకవర్గంలో పర్యటిస్తూ విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. ఈ క్రమంలో మరోసారి అలుగుబెల్లి నర్సిరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలిపించాలని కోరారు. అంతకంటే ముందు నల్లగొండ జిల్లాలోని పలు పాఠశాలలను రవి సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎం రాజశేఖర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఢిల్లీ రూపు 'రేఖ' మార్చేనా?



ఇరవై ఏడేండ్ల సుదీర్ఘ విరామ అనంతరం ఢిల్లీ పీఠాన్ని బీజేపీ అధిరోహించింది. ఊహగానాలకు తెరదించుతూ తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన రేఖాగుప్తాను ముఖ్యమంత్రిగా ఎంపిక చేసింది. మొన్న గురువారం రాంలీలా మైదానంలో సీఎంగా ఆమె ప్రమాణ స్వీకారం చేసింది. ఇప్పటివరకు ఢిల్లీని పాలించిన వారిలో తొమ్మిదవ ముఖ్యమంత్రి. మహిళల్లో నాలుగో వ్యక్తి. షీలాదీక్షిత్, సుష్మాస్వరాజ్, అతిశీ, తాజాగా రేఖ. ఇక ఇప్పుడు అందరి దృష్టి ఆమె హస్తినను ఎలా పాలిస్తారనే వైపు మరలింది. ఇంతకీ ఢిల్లీకి కావాల్సిందేమిటి? అక్కడున్న ప్రధాన సమస్య లేమిటి? కొత్తగా ఎన్నికైన రేఖా గుప్తా రాష్ట్ర రూపురేఖలు మారుస్తారా? ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తారా? ఇప్పుడు రాజకీయవర్గాలు, ప్రజానీకంలో జరుగుతున్న ప్రధానమైన చర్చ.

> అన్నిటికంటే ముఖ్యమైనది మత సామరస్యం. ఇప్పటివరకు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరిగిన మత కలహాలను చూస్తే ఎవరికైనా ఆందోళన కలగక మానదు. ఎందుకంటే, బీజేపీ నమ్ముకున్నది ప్రజల్ని కాదు, ప్రజా సంక్షేమాన్ని అంతకన్నా కాదు.మతం, దాంతో చేసే రాజకీయం! అందుకే గుజరాత్, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో విపరీతమైన అల్లర్లు, ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. ఇంతకాలం బీజేపీకి దేశ రాజధాని ఢిల్లీ తమ చేతుల్లో లేదనే తీవ్రమైన అసంతృప్తి ఉండేది.ఇప్పుడు అధికారం హస్తగతమైన నేపథ్యంలో భిన్నమతాలు, విశ్వాసాలు, సంప్రదాయాలు, సంస్కృతికి నిలయమై ప్రశాంతంగా ఉన్న ఢిల్లీలో మత బీజాలు నాటితే మాత్రం ముమ్మాటికీ బీజేపీని ప్రజలు క్షమించరు. ఆ పరిస్థితి రాకుండా చూసుకుంటారని ఆశిద్దాం.

దేశ రాజధాని అయిన ఢిల్లీకి ప్రపంచ పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, అందుకుగాను మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని, ఢిల్లీని చూసి దేశమంతా ఎలా ఉంటుందో ఊహించుకునేలా హస్తినను తయారు చేస్తామని బీజేపీ నాయకత్వం చెబుతున్నది. కానీ అసలు సమస్యను పట్టించుకోకపోవడం విచిత్రం. దశాబ్దాలుగా ఢిల్లీని వణికిస్తున్నది వాయు కాలుష్యం. ప్రపంచంలోనే అత్యధిక కాలు ష్యపు నగరాల్లో ఒకటిగా మారింది. దీన్ని అరికట్టేందుకు ఇప్పటివరకు పాలకవర్గాలు తీసుకున్న చర్యలు శూన్యం. గత ఏప్రిల్ నాటికి నగరంలో 1.72 కోట్ల టన్నుల ఘన వ్యర్థాలు పోగవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. ఈ కాలుష్యం నగరవాసుల సగటు జీవితకాలం పన్నెండేండ్లకు తగ్గిస్తుందని అనేక నివేదికలు ఘోషిస్తున్నాయి. కొత్తగా పగ్గాలు చేపట్టిన బీజేపీకి దీనిపై స్పష్టత లేకపోవడం మరీ ఘోరం. పైపై మెరుగులను ప్రాధాన్యతగా చెబుతున్న 'డబులింజన్' సర్కార్ ఈ కాలుష్యాన్ని ఎలా అధిగమిస్తుందని చెప్పాల్సిన బాధ్యత రేఖా ప్రభుత్వానిది.

కోటిన్నరకు పైగా జనాభా నివాసముండే ఢిల్లీ నూట నలభై దేశాలతో పోలిస్తే పెద్దది. 2028 నాటికి జపాన్‌లోని టోక్యోను అధిగమిస్తుందని ఐక్యరాజ్యసమితి అంచనా. అంతకంటే ముందు దేశ రాజధాని కావడంతో ఉన్న ఊళ్లో పని దొరకని వారు ఉపాధి అవకాశాలను వెతుక్కుంటూ ఢిల్లీబాట పడుతున్నారు. దీన్ని అరికట్టేందుకు, గ్రామాల్లో భరోసానిచ్చే కార్యక్రమాలు పాలకులు ప్రవేశపెట్టకపోవడంతో వలసలు అధికమై అక్కడి వనరులపై ఒత్తిడి పెరుగుతున్నది. తరచూ మంచినీటి సంక్షోభం తలెత్తుతున్నది. ఈ సమస్యకు ముందు పరిష్కారం చూపాలి. అంతే కాదు, ఢిల్లీలోకి స్వచ్ఛంగా ప్రవేశించే యమునా నది నీళు రాజధానిని వీడే ప్రాంతంలో అత్యధికంగా కాలుష్యమయంగా మారుతున్నాయని అధికార పరీక్షల్లో రుజువైంది. యమునా నది మొత్తం కలుషితమవుతున్నదని, దీన్ని ఆప్ పట్టించుకోవడం లేదని గత సర్కార్‌పై గగ్గోలుపెట్టిన బీజేపీ ఇప్పుడు అధికారం చేపట్టింది. తగిన చొరవ తీసుకుంటుందా లేదా అనేది నగరవాసుల మెదళ్లను తొలుస్తున్న ప్రశ్న. ఇవేకాదు, ఇరుకు రోడ్లు, మురుగునీరు, వ్యర్థాల కాల్చివేత లాంటివి ఢిల్లీని వేధిస్తున్న నిత్య సమస్యలు. ఈ నేపథ్యంలో ఢిల్లీని సుందరంగా తీర్చిదిద్దడం కాదు, ముందుగా ప్రజల్ని పట్టి పీడిస్తున్న కలుషితపు నీరు, గాలి, పారిశ్రామిక కాలుష్యం, రహదారులపై దుర్గంధం, తదితర మౌలిక వసతులపై దృష్టి సారించాలి.

ఇక అన్నిటికంటే ముఖ్యమైనది మత సామరస్యం. ఇప్పటివరకు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో జరిగిన మత కలహాలను చూస్తే ఎవరికైనా ఆందోళన కలగక మానదు. ఎందుకంటే, బీజేపీ నమ్ముకున్నది ప్రజల్ని కాదు, ప్రజా సంక్షేమాన్ని అంతకన్నా కాదు.మతం, దాంతో చేసే రాజ కీయం! అందుకే గుజరాత్, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో విపరీతమైన అల్లర్లు, ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. ఇంతకాలం బీజేపీకి దేశ రాజధాని ఢిల్లీ తమ చేతుల్లో లేదనే తీవ్రమైన అసంతృప్తి ఉండేది.ఇప్పుడు అధికారం హస్తగతమైన నేపథ్యంలో భిన్నమతాలు, విశ్వాసాలు, సంప్రదాయాలు, సంస్కృతికి నిలయమై ప్రశాంతంగా ఉన్న ఢిల్లీలో మత బీజాలు నాటితే మాత్రం ముమ్మాటికీ బీజేపీని ప్రజలు క్షమించరు. ఆ పరిస్థితి రాకుండా చూసుకుంటారని ఆశిద్దాం.

ట్రంప్-సామ్రాజ్యవాద అమెరికా విస్తరణవాదం



ఆర్.అరుణ్ కుమార్

ట్రంప్ తిరిగి వచ్చాడు. ఆయన విదేశాంగ విధాన ప్రకటనలు, జోక్యాలు ఆయన ఉద్దేశాల్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఒక పిచ్చివాడు చేసినవిగా పరిగణించబడిన ప్రకటనలు ఇప్పుడు ఆలోచనలతో చేసిన ప్రకటనలుగా మారుతున్నాయి. "మళ్లీ అమెరికా గొప్పగా మారడం" అనే దాని నిజమైన అర్థం ఇప్పుడు స్పష్టంగా కనపడుతుంది. అధ్యక్షునిగా ట్రంప్ అనేక కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేయడం ద్వారా మొదటి రోజును ప్రారంభించాడు. వాటిలో మెక్సికో గల్ఫ్‌ను అమెరికా గల్ఫ్‌గా పేరు మార్చడం ఒకటి. అది అపాయం కానిదిగా కనిపించవచ్చు, కానీ అది అమెరికన్ సామ్రాజ్యవాద గాఢమైన వాంఛను సూచిస్తుంది. చారిత్రాత్మకంగా అమెరికా, మెక్సికోకు చెందిన అనేక భూభాగాల్ని ఆక్రమించింది. ఇప్పుడు గల్ఫ్ పేరును మార్చడం ద్వారా చరిత్రను చెరిపేసి, దాన్ని తన నిబంధనలకనుగుణంగా తిరిగి రాయాలనుకుంటుంది.

మెక్సికన్ అధ్యక్షురాలు క్లాడియా షేయిన్ బామ్ 1607 నాటి ఒక చారిత్రాత్మక పటాన్ని ప్రదర్శించి, ఆ పటం చరిత్ర ప్రకారం చూస్తే మొత్తం ఉత్తర అమెరికాను "మెక్సికన్ అమెరికా" అని పిలవాలని ప్రకటించింది. ట్రంప్ ముందు తలవంచి, మెక్సికో గల్ఫ్ పేరును మార్చినందుకు ఆమె గూగుల్‌ను కూడా విమర్శించింది. పటములలో ఏదైనా పేరు మార్పు, ఒక దేశ తీర ప్రాంతం చుట్టూ ఉన్న 12 నాటికల్ మైళ్లకు మాత్రమే వర్తిస్తుందని ఆమె గూగుల్‌కు సూచించింది. అంటే ట్రంప్, గల్ఫ్ పేరు మార్చడం అనేది మొత్తం గల్ఫ్ జలాలకు వర్తించదు, అది కేవలం అమెరికాకు మాత్రమే వర్తిస్తుంది, మెక్సికోకు, ఆమాటకొస్తే ప్రపంచానికి వర్తించదు. ట్రంప్‌ను వ్యతిరేకించడం ద్వారా ఆయన విధానాలను, ఆయననెలా ఎదిరించాలో ఆమె ప్రపంచానికి చూపింది.


పనామా కాలువ

పనామా కాలువ గురించి ట్రంప్ చేసిన ప్రకటనల ద్వారా ఆయన సామ్రాజ్యవాద వాంఛలు మరింత బట్టబయలు అయ్యాయి. పనామా కాలువను చైనీయులు నిర్వహిస్తున్నారనీ, అధిక పన్నుల వసూళ్ల ద్వారా అమెరికా నావికా దళ నౌకలు, ఓడలు వివక్షతకు గురవుతున్నాయని ఆయన తప్పుడు వాదనలు చేశాడు. ఈ ఆరోపణలన్నింటినీ పనామా అధ్యక్షుడు ఖండించాడు, కానీ ట్రంప్ వాస్తవాల్ని పట్టించుకోలేదు. బలవంతంగానైనా అమెరికా "పనామా కాలువను తిరిగి తీసుకుంటుందని" ఆయన పనామాను బెదిరించాడు. ఆ కాలువ, పనామా నిర్వహణలో ఉంది, పన్నుల విధింపులో ఎలాంటి వివక్షత లేదనే విషయం వాస్తవం.

ట్రంప్ ఇటీవలి కాలంలో, తన బెదిరింపులకు పనామా తలొగ్గి, అమెరికా నౌకల ఉచిత ప్రయాణాల అనుమతికి అంగీకరించినట్లు ప్రకటించాడు. పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినో అమెరికా వాదనలను ఖండించాడు. "ఫీజులకు సంబంధించిన ఎలాంటి సర్దుబాట్లు చేయలేదని" పనామా కెనాల్ అథారిటీ పేర్కొంది. పనామా ప్రజానీకం, అమెరికా పాలకవర్గం చేసిన ప్రకటనలు, వాదనలకు వ్యతిరేకంగా ఉన్నారు. వారు ఏ విధంగానైనా తమ దేశ సార్వభౌమత్వాన్ని రక్షించుకోవాలనుకుంటున్నారు. ఇప్పటికీ వారు డిసెంబర్ 20, 1989న పనామాపై అమెరికా దురాక్రమణను గుర్తు చేసుకుంటారు. మా దేశాన్ని, ప్రజల్ని రక్షించుకోవడానికి "మేము లేస్తాం, రక్షించుకుంటాం, ఐక్యంగా ఉంటామని మీకూ తెలుసు. ఎందుకంటే కాలువ గురించి కాదు, ఇది మా సమగ్రత గురించి " అని వారంటున్నారు. పనామా ప్రజల పట్టుదల వారి సోషల్ మీడియా పోస్టుల్లో ప్రతిబింబిస్తుంది: "ఎలాంటి అవకాశం లేదు. ఇది మళ్ళీ జరగదు".

ఆసక్తికరమైన కెనడా అంశం

ట్రంప్ మరో ప్రకటన ప్రజల్ని కదిలించి, వారిని గమనించేలా చేసింది కెనడా. కెనడా, అమెరికాకు 51వ రాష్ట్రంగా మారాలని తాను కోరుకుంటున్నట్లు ట్రంప్ ప్రకటించాడు. ఇది ప్రతీ ఒక్కర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది, ఎందుకంటే పనామా మాదిరిగా కాకుండా కెనడా ఒక చిన్న దేశం కాదు. పరిమాణం, ఆర్థిక వ్యవస్థలోనే కాక కెనడా నాటో కూటమిలో భాగస్వామి కూడా,"ఫైవ్ ఐస్ ఎలైన్స్"లో ఒక సభ్య దేశం, ప్రపంచ వ్యాప్తంగా అనేక అమెరికా ప్రాజెక్టుల్లో జరిగిన నేరాల్లో ఓ భాగస్వామి. ఇన్ని అంశాలున్నప్పటికీ ట్రంప్ ఏ మాత్రం కలత చెందకుండా పట్టుదలతో ఉన్నాడు. ఇది నెమ్మదిగా కెనడా ప్రభుత్వం, తాను చెప్పేది అర్థం చేసుకుం టానని అంగీకరించేలా చేసింది. ఇంకా కెనడియన్ పాలనా విభాగంలో ఎవరైనా అపనమ్మకంతో ఉంటే, అన్ని కెనడా వస్తువులపై 25 శాతం సుంకం విధింపు (తరువాత అమెరికాతో వాణిజ్య సంబంధాల పునఃపరిశీలన కోసం కెనడాకు ఒక నెల సమయం ఇవ్వడానికి వాటిని రద్దు చేశారు) వాస్తవ విషయాల పట్ల వారి కళ్లు తెరిపించాయి. మార్చి 12 నుండి అమెరికాకు దిగుమతయ్యే ప్రపంచ స్టీల్, అల్యూమినియం పైన 25 శాతం పన్ను విధింపుకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఫిబ్రవరి 10న ట్రంప్ ఒక ప్రకటన చేశాడు. ఇది కెనడా ఆర్థిక వ్యవస్థను బాగా దెబ్బతీస్తుంది. ట్రంప్ బెదిరింపులకు భయపడి 13 మంది ప్రధాన కెనడా ప్రభుత్వ అధినేతలు, నూతన పాలకవర్గంలోని అధికారులను కలిసేందుకు వాషింగ్టన్ వెళ్లారు. అక్కడ జరిగింది వారు ఆశించిన దానికి విరుద్ధంగా ఉంది. సుంకాల విధింపుతో వారిని శిక్షించకుండా అమెరికాను ఒప్పించగలమని ఆశించారు. కానీ బ్రిటీష్ కొలంబియా ప్రీమియర్ అయిన డేవిడ్ ఏబీ స్పష్టంగా చెప్పినట్టు, "వైట్ హౌస్ సలహాదారులు అధ్యక్షుని మాటను నమ్మమని మమ్మల్ని కోరారు".



> 2019లో మొదటి సారిగా డెన్మార్క్ నుండి "గ్రీన్ ల్యాండ్" ను కొనుగోలు చేయాలన్న ప్రతిపాదనను ట్రంప్ పునరుద్ఘాటించాడు. గ్రీన్‌ల్యాండ్‌ను కొనుగోలు చేయడం అమెరికా ఆర్థిక వ్యవస్థ భద్రతకు, జాతీయ భద్రతకు, ప్రపంచ వ్యాప్తంగా స్వేచ్ఛకు అవసరమని ఆయన అన్నాడు. దానిపై డెన్మార్క్ కున్న హక్కు ఏమిటో నిజంగా నాకు తెలియదు. అయితే వారు అది జరగకుండా అనుమతించక పోవడం అనేది స్నేహరహిత చర్య అనీ, ఎందుకంటే ఇది స్వేచ్ఛాయుత ప్రపంచ రక్షణ కోసమని ఆయన అన్నాడు. అమెరికా "దానిని పొందుతుందని" తన విశ్వరూపాన్ని వ్యక్తం చేస్తూ "ప్రజలు మాతో ఉండాలని కోరుకుంటున్నారనే" విపరీత వ్యాఖ్య కూడా చేశాడు.ఒక మీడియా ఏజెన్సీ నిర్వహించిన సర్వేలో 85 శాతం మంది గ్రీన్‌ల్యాండ్ వాసులు, తమకు అమెరికాతో ఉండటం ఇష్టం లేదని చెప్పారు కాబట్టి ఇది ట్రంప్ చేసిన మరొక తప్పుడు వాదన అని రుజువైంది.

డెబ్బై ఐదు శాతానికి పైగా కెనడా ఎగుమతులు అమెరికా వెళ్తాయి. రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలు కలిసిపోయాయి. అమెరికా సంవత్సరానికి ఆరు మిలియన్ టన్నుల కెనడా స్టీల్, మూడు మిలియన్ టన్నులకు పైగా అల్యూమినియం ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటుంది. 1988లో అమెరికా-కెనడా స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందం పై సంతకాలు చేసిన నాటినుండి కెనడా, అమెరికాకు చాలా దగ్గరగా ఉంటూ వస్తోంది. ఇది దాని ముందున్న అనేక అవకాశాల్ని తిరస్కరించి, కెనడా అమెరికా పై ఆధారపడేట్టు చేసింది. రెండు దేశాలు భాగస్వామ్య విలువల్ని పంచుకుంటాయి, రెండూ కలిసిపోవాలి, లాంటి ప్రకటనలతో కెనడియన్లు ఓదార్పు పొందారు. ఇప్పుడు వాస్తవం వారి ముఖాలపై కనిపిస్తుంది.

కెనడా తన స్వాతంత్ర్యం, సమగ్రత కోసం నిలబడాలని నిర్ణయం తీసుకుంటే ఇతర అవకాశాల గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఖర్చులు చెల్లించడం మంచిదనీ, కానీ వారి స్వాతంత్ర్యం, సమగ్రతలను నిలబెట్టుకోవాలని వీధుల్లో ప్రజలు అభిప్రాయపడు తున్నారు. అయితే పాలకవర్గాల ప్రయోజనాలకు ప్రతినిధులైన ఎన్నికైన నాయకులు మాత్రం ఖర్చుల గురించి ఆందో ళన చెందుతున్నారు. వారి ప్రయోజనాల గురించి సానుభూతిగా వ్యవహరించమని అమెరికాను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. సుంకాల ద్వారా ప్రతీకారం తీర్చుకోవాలనే చర్చ ఉన్నప్పటికీ, ఈ ప్రకటనల వెనుక నిజాయితీ, ధైర్యం ఉన్నట్లు కనిపించడం లేదు.ఈ కారణంగా కెనడాలోని అన్ని రాష్ట్రాల ప్రధాన ప్రతినిధి బృందం అమెరికా రాజధానికి వెళ్లింది.

గ్రీన్‌ల్యాండ్, మెక్సికో, గాజా

2019లో మొదటి సారిగా డెన్మార్క్ నుండి "గ్రీన్ ల్యాండ్" ను కొనుగోలు చేయాలన్న ప్రతిపాదనను ట్రంప్ పునరుద్ఘాటించాడు. గ్రీన్‌ల్యాండ్‌ను కొనుగోలు చేయడం అమెరికా ఆర్థిక వ్యవస్థ భద్రతకు, జాతీయ భద్రతకు, ప్రపంచ వ్యాప్తంగా స్వేచ్ఛకు అవసరమని ఆయన అన్నాడు. దానిపై డెన్మార్క్ కున్న హక్కు ఏమిటో నిజంగా నాకు తెలియదు. అయితే వారు అది జరగకుండా అనుమతించక పోవడం అనేది స్నేహరహిత చర్య అనీ, ఎందుకంటే ఇది స్వేచ్ఛాయుత ప్రపంచ రక్షణ కోసమని ఆయన అన్నాడు. అమెరికా "దానిని పొందుతుందని" తన విశ్వరూపాన్ని వ్యక్తం చేస్తూ "ప్రజలు మాతో ఉండాలని కోరుకుంటున్నారనే" విపరీత వ్యాఖ్య కూడా చేశాడు.ఒక మీడియా ఏజెన్సీ నిర్వహించిన సర్వేలో 85 శాతం మంది గ్రీన్ ల్యాండ్ వాసులు, తమకు అమెరికాతో ఉండటం ఇష్టం లేదని చెప్పారు కాబట్టి ఇది ట్రంప్ చేసిన మరొక తప్పుడు వాదన అని రుజువైంది.

సుంకాల సమస్య గురించి మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షెయిన్ బామ్ అమెరికాతో, మెక్సికో ప్రజలతో సార్వభౌమత్వం, సమగ్రత సూత్రాలను పునరుద్ఘాటిస్తూ మాట్లాడింది. అక్రమ వలసలు, మాదకద్రవ్యాల స్మగ్లింగ్ గురించి అమెరికా ఆందోళనను పరిష్కరిస్తానని ఆమె అంగీకరిస్తూ, కానీ మెక్సికో సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టడం ద్వారా మాత్రం కాదని పేర్కొంది. మెక్సికన్ ప్రభుత్వం లాభాలు గడించే ఉత్పత్తిదారులకు సురక్షితమైన ఆశ్రయమని అమెరికా ఆరోపించిన పుడు, షెయిన్ బామ్ ఆ నిందను తిరస్కరించి, "అలాంటి పొత్తు ఏదైనా ఉంటే అది అమెరికా తుపాకుల దుకాణాలకు, నేరస్తుల గ్రూప్‌ల మధ్యే ఉందని" గట్టిగా సమాధానం ఇచ్చింది. ఆమె అమెరికాతో నిక్కచ్చిగా వ్యవహరించిన తీరు, ఆమెకు మెక్సికోలోనే కాక ప్రపంచ వ్యాప్తంగా కూడా అభిమానుల్ని సంపాదించి పెట్టింది.

విధ్వంసం కారణంగా గాజా "నివసించడానికి ఒక నరకంగా" ఉందనీ, దాన్ని "శుభ్రం" చేయాల్సిన అవసరం ఉందని ప్రకటించడం ద్వారా ట్రంప్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. గాజాలో నివసిస్తున్న పాలస్తీనియన్లు అందరూ జోర్డాన్, ఈజిప్ట్‌కు తరలివెళితే, అమెరికా గాజాను స్వాధీనం చేసుకుని, దానిని "మధ్య ప్రాచ్య తీర ప్రాంతం"గా అభివృద్ధి చేయాలని కోరుకుంటాడు. ఆయన చెప్పే మాట ప్రకారం 70 ఏళ్లకు పైగా ఈ ప్రాంతాన్ని రావణకాష్టంలా మండిస్తున్న "మధ్య ప్రాచ్య సమస్యకు" ఇది మాత్రమే పరిష్కారం. ఈ మాటలు విన్న ట్రంప్ పక్కనే నిలబడి ఉన్న ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నెతన్యాహూ తన సంతోషాన్ని దాచుకోలేక పోయాడు. శాంతిని తీసుకొచ్చే పేరుతో ట్రంప్, పాలస్తీనియన్లంతా తమ ఇళ్లు, భూమిని వదులుకొని, అమెరికా, ఇజ్రాయిల్‌లో స్థిరపడి, పాలస్తీనాను ఒక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెయ్యాలని ప్రతిపాదిస్తున్నాడు. పాలస్తీనా పట్ల, రాష్ట్ర హోదా కోసం డిమాండ్ పట్ల ఆయన చూపుతున్న దారుణమైన ధిక్కారం అలా ఉంది. పనామా, మెక్సికో, కెనడా, గ్రీన్‌ల్యాండ్, గాజా, లేక ఉక్రెయిన్ పైన ట్రంప్ చేసిన వాదనలన్నీ చాలా స్పష్టంగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఉన్న చాలా ఖరీదైన అరుదైన భూ ఖనిజాల కోసం ఈ ప్రాంతాలను, జల మార్గాలను అమెరికా నియంత్రించాలని ఆయన కోరుకుంటున్నాడు. అమెరికాకు అవసరమైన అరుదుగా లభించే భూ నిల్వలు కెనడా, గ్రీన్‌ల్యాండ్, ఉక్రెయిన్‌లలో ఉన్నాయి. ప్రపంచ వాణిజ్యం పై ఆధిపత్యం సాధించాలంటే జల మార్గాల నియంత్రణ, దాని పట్టు నిలుపుకోవడం, ఎవరు ఏ వాణిజ్యం ఎవరితో చెయ్యాలో నిర్ణయించడం కోసం అవసరం. ట్రంప్ ప్రకటనల వెనుక ఉన్న అసలు నిజం ఇదే. తన ఆధిపత్యానికి చైనా ఒక పెద్ద ముప్పనే వాస్తవాన్ని అమెరికా గ్రహించింది. అమెరికాకు రష్యా లేక ఏ ఇతర దేశం వల్ల ముప్పు లేదని నూతనంగా ఎన్నికైన రక్షణ కార్యదర్శి ప్రకటించాడు. అమెరికా ఆధిపత్యానికి చైనా, చైనా కమ్యూనిస్ట్ పార్టీ నుంచే ప్రతిఘటన ఉంటుంది కాబట్టి అమెరికాకు ముప్పు. కమ్యూనిస్ట్ పార్టీని గుర్తించడం ద్వారా, పెట్టుబడిదారీ వ్యవస్థ దోపిడీ, విస్తరణ వాదానికి వ్యతిరేకంగా నిలబడగలిగేది సోషలిజం, వామపక్షాలు మాత్రమే అని ట్రంప్ పాలకవర్గం గుర్తిస్తుంది.

ఈ కారణంగానే ట్రంప్, క్యూబాను తీవ్రవాదం ప్రోత్సాహించే దేశాల జాబితాలో చేర్చి, బైడెన్ అధ్యక్ష పదవి ముగియడానికి కొన్ని రోజుల ముందు జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేశాడు. క్యూబా ఈ చర్యను ఖండించింది, అమెరికా ముందు తలవంచకుండా, తమ ప్రతిఘటనను కొనసాగిస్తామని కూడా ప్రకటించింది. అమెరికాకు 90 మైళ్ల దూరంలో ఉన్న ఒక చిన్న దేశం, ఇప్పటికే అమెరికా విధిస్తున్న ఆర్థికపరమైన ఆంక్షలతో ఇబ్బందిపడుతూ ఇలాంటి వైఖరి తీసుకోవడానికి చాలా ధైర్యం కావాలి. క్యూబా ధైర్యం, దాని ప్రజలపై ఉన్న విశ్వాసం, సోషలిస్ట్ దృఢవిశ్వాసం నుండి వస్తుంది. వలసదారులను బలవంతంగా వెళ్లగొట్టడం ట్రంప్ చొరవ చూపి తీసుకున్న ఓపెద్ద చర్య. వేలమంది వలసదారులను చుట్టుముట్టి బలవంతంగా వెళ్లగొట్టారు. ఈ ప్రక్రియలో వారి పట్ల చాలా అమానవీయంగా వ్యవహరించారు. భారతీయ వలసదారులకు సంకెళ్లు, చేతికి బేడీలు వేసి ఒక మిలిటరీ విమానంలో ఎలా పంపిం చారో మనం స్వయంగా చూశాం. ఈ విధంగా వ్యవహరించిన తీరుపై మన ప్రభుత్వం చాలా విధేయంగా స్పందించింది. ఇప్పుడు ప్రధాని మోడీ అమెరికా పర్యటనలో ఉన్నాడు. మెక్సికో, క్యూబా, చైనా లాంటి దేశాలు స్పందించిన విధంగా కాకుండా, అమెరికా ముందు చాలా విధేయంగా లొంగిపోవడాన్ని అన్ని సంకేతాలు మరోసారి సూచిస్తున్నాయి. అమెరికా గొప్పతనం ఆధిపత్యం, విస్తరణ వాదంపై ఆధారపడి ఉంటుందని ట్రంప్ విశ్వాసం. వాస్తవాన్ని మించింది ఏదీ లేదు. నిజమైన గొప్పతనం ప్రజల వెంట ఉండడం, వారి ప్రయోజనాల కోసం సేవ చేయడం, స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం, మనం జీవించాలనుకున్న వ్యవస్థను ఎంపిక చేసుకునే స్వేచ్ఛను నొక్కి చెప్పే ధైర్యం కలిగి ఉండడం ద్వారా వస్తుంది.

("పీపుల్స్ డెమోక్రసీ" సౌజన్యంతో)

అనువాదం: బోడపట్ల రవీందర్, 9848412451

ఒక తూరుపు పొద్దు పొడిచినపుడు
నారింజ కిరణాల శుశ్రూషకు ఉన్నట్టుండి
గాజా మూర్ఛ నుండి లేచింది..
దాని ఊపిర్లు, తిరుగుతున్న భూగోళం
చుట్టూ చక్కర్లు కొట్టి వచ్చేశాయ్
గుండెలపై, నిరుదు పారేసుకొన్న
నవ్వులు ఏరుకొంటూ పసిపాపల పాదముద్రలు
పరుగులు పెడుతుంటే కొత్తగా పుట్టాననుకొంది
జాత్యహంకార శరాఘాతానికి మూర్ఛిల్లి లేచి

పడి లేచిన గాజా..!



కాళ్లు చేతులు విదిలించుకొంటూంటే..
దరిమిలా, అలాగే చచ్చిపొమ్మని
సామ్రాజ్యవాద హూంకరింపొకటి!
గాజా గుండెల్లో గిజిగాడి గూళ్లు అల్లుకొన్న
పాత బంధాలు
కూలిపోయిన బతుకులకు మిగిలిపోయిన
కొత్త ఆశలు ప్రోదిచేసుకొంటుంటే..
అంత బతికున్నాక శవంగా ఎలా అవుతుంది!
సరిహద్దుల వద్ద కొత్తదార్లకు కొన్ని వేదుకోళ్లు
పాతుకొంటుంటే
పగిలిన గాజు గుండె ముక్కల్లో
పాత ఉదయాల కోసం కోటి ఆకాంక్షలు
వెతుక్కొంటూన్న హృదయాలెన్నో..
గాజా! నీవిప్పుడు మరోజన్మే!
హృదయం నిండా శాంతి సుమాలే
విరబూయాలిప్పుడు!

-భీమవరపు పురుషోత్తమ్

వికలాంగుల పోరాట దిక్సూచి ఎన్‌పీఆర్‌డీ



యం.అడివయ్య
9490098713

అసమానతలకు, అవమానాలకు, అన్యాయలకు గురవుతూ సమాజంతో పాటు కుటుంబ సభ్యుల నుండి చీదరింపులకు గురవుతున్న వికలాంగుల్లో చైతన్యం నింపి, కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఒంటరిగా ఉన్న వారిని ఐక్యం చేసి ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం పోరుబాట పట్టించేందుకు ఏర్పడిందే వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ). పదిహేనేండ్లుగా వికలాంగుల కోసం అనేక పోరా టాలు నిర్వహించి, విజయాలు సాధించి దేశంలోని వికలాంగులకు ఒక పోరాట దిక్సూచిగా నిలబడింది. 2010 కంటే ముందు దేశవ్యాప్తంగా వికలాంగుల హక్కుల కోసం పనిచేసే సంఘాలు లేవు. వికలాంగుల సమస్యలు జిల్లా, రాష్ట్రమే కాదు, కేంద్ర ప్రభుత్వంతో ముడిపడి ఉన్నాయనే ఆలోచనతో, వికలాంగులను ఐక్యం చేసి, పోరాటలు నిర్మించేందుకు 2010 ఫిబ్రవరి 21-22 తేదీల్లో పశ్చిమ బెంగాల్ రాష్ట్ర రాజధాని కలకత్తాలో ఆత్మగౌరవం, హక్కుల సాధన లక్ష్యాలతో క్రాంతి గంగూలీ కన్వీనర్‌గా ఎన్‌పీఆర్‌డీ ఆవిర్భవించింది. ఏడు రాష్ట్రాలతో ప్రారంభమై పదిహేడు రాష్ట్రాల్లో విస్తరించి వికలాంగుల హక్కుల సాధన కోసం పోరాడుతున్న ఏకైక వేదిక.

2010కంటే ముందు దేశంలో వికలాంగుల కోసం పోరాడే సంస్థలు లేవు. ఎన్‌పీఆర్‌డీ ఏర్పడే నాటికి దేశంలో వికలాంగులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. 1995 పిడబ్ల్యూడి చట్టం అమల్లో ఉన్నా వికలాంగుల సంక్షేమంతో పాటు ఇతర అనేక అంశాలపై స్పష్టత లేదు.నూతన వికలాంగుల చట్టం చేయాలనే డిమాండ్స్ 2011 నుండి 2016 వరకు దేశవ్యాప్తంగా దశల వారీగా ఉద్యమాలు నిర్వహించి, సీపీఐ(ఎం) పార్లమెంట్ సభ్యురాలు బృందా కరత్ నేతృత్వంలో ఎన్‌పీఆర్‌డీ ప్రతినిధి బృందం ముసాయిదా చట్టాన్ని రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి అందచేసింది. చట్టం సాధన కోసం పార్లమెంట్ లోపల, బయట ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో చేసిన పోరాట ఫలితమే 2016 ఆర్‌పీడీ చట్టానికి నాంది వలికింది. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టానికి రూల్స్ రూపొందించాలని పోరాటాలు చేసి అనేక రాష్ట్రాల్లో నిబంధనలు సాధించింది. కేంద్ర ప్రభుత్వం అమోదించిన 2007 ఐక్య రాజ్య సమితి హక్కుల ఒప్పంద పత్రం అమలు కోసం పోరా టాలు నిర్వహిస్తున్నది.

2016వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం సెక్షన్ 89, 92, 93లకు సవరణలు చేయాలనే కేంద్ర ప్రభుత్వం నిర్ణ యానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త పోరాటాలు చేసి, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తిప్పికొట్టింది.అలాగే పెన్షన్‌లో కేంద్ర ప్రభుత్వం వాటా రూ.300 నుండి 5వేలకు పెంచాలనే డిమాండ్స్‌పై దేశవ్యాప్తంగా పోరాడుతూనే 2025 ఫిబ్రవరి 10న వేలాది మంది వికలాంగులతో ఢిల్లీ నడిబొడ్డున కదంతొక్కింది. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ కోసం అనేక పోరాటాలు చేస్తున్నది.21రకాల వైకల్యాలకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని, సంక్షేమ పథకాల్లో ఐదుశాతం రిజర్వేషన్స్ అమలు కోసం, యూనిక్ డిసెబుల్డ్ ఐడి కార్డ్స్ విక లాంగులకు జారీ చేయాలని ఉద్యమాలు చేస్తున్నది. మహిళా వికలాంగులు, వికలాంగులపై జరుగుతున్న హింస, లైంగిక వేధింపులపై వికలాంగులను చైతన్యం చేస్తూ ముందుకు సాగుతున్నది. కేంద్ర ప్రభుత్వం తెస్తున్న వికలాంగుల వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించడంలో దేశంలో ఎన్‌పీఆర్‌డీ అగ్రస్థానం లో ఉంది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో వికలాంగుల పట్ల తీవ్రమైన నిర్లక్ష్యం చేస్తున్నది. పెన్షన్ హక్కుగా సాధించేందుకు దేశ వ్యాప్త పోరాటాలకు రూపకల్పన చేసింది.



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నల్లగొండ, రంగారెడ్డి, మెదక్, వరంగల్, హైదరాబాద్ జిల్లాల్లో 2014 తర్వాత విభజన అనంతరం తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాల్లో విస్తరించింది. 25 జిల్లాల్లో వికలాంగుల సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నది. వికలాంగుల హక్కుల పరిరక్షణకు, ప్రభుత్వ పథకాల్లో వాటాకు, పెన్షన్ పెంపునకు దశాద్దకాలం(2014-2024) పాటు చేసిన పోరాటాల ఫలితంగా పెన్షన్ రూ.500 నుండి 4016కు పెరిగింది. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ రూ.6వేల పెన్షన్ కోసం రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు చేస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో రద్దయిన వికలాంగులకు పోరాడి వేలాది మందికి పదకొండు నెలల పెన్షన్ తీనుకొచ్చింది. అలాగే అంత్యోదయ అన్న యోజన రేషన్ కార్డ్స్ వికలాంగులకు కేటాయించాలని పోరాడి సాధించింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2005లో ప్రారంభమైన వికలాంగులకు 2011 వరకు జాబ్ కార్డ్స్ మంజూరు చేయలేదు.దీనిపై రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేసి లక్షలాది మంది వికలాంగులకు జాబ్ కార్డ్స్, పని సాధించింది.ఉన్నత విద్యాసంస్థల్లో రిజర్వేషన్స్ అమలు చేయాలని ఉస్మానియా యూనివర్సిటీలో దీర్ఘకాలిక పోరాటం చేయడం వలన వికలాంగులైన విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పించింది. ఈ క్రమంలోనే ఫిబ్రవరి 21 నుంచి 27వరకు రాష్ట్రవ్యాప్తంగా ఆవిర్భావ దినోత్సవాలకు శ్రీకారం చుట్టింది. జిల్లా, మండల, గ్రామాల్లో జెండా ఆవిష్కరణాలు చేయాలని పిలుపునిచ్చింది.వారం రోజుల పాటు రక్తదాన శిబిరాలు, పండ్ల పంపిణీ, మొక్కలు నాటడం వంటి బహుముఖ కార్యక్రమాలు నిర్వహించి విక లాంగులను భాగస్వామ్యం చేసేందుకు కృషి చేస్తున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎన్‌పీఆర్‌డీ డిమాండ్ చేస్తున్నది. 2016 ఆర్‌పీడీ చట్టంతో పాటు 2017 మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్, ఐక్య రాజ్యసమితి హక్కుల ఒప్పంద పత్రం, నేషనల్ పాలసీ, నేషనల్ ట్రస్ట్ చట్టాల అమలు కోసం పోరాడాలని, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్స్, నామినేటెడ్ పదవుల సాధనకు ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చింది. వికలాంగుల సంక్షేమం సాధికారత, సమగ్రాభివృద్ధి సాధించుకోవడానికి చేపట్టే ఉద్యమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎన్‌పీఆర్‌డీ కోరుతున్నది.

> 2016 ఆర్‌పీడీ చట్టంతో పాటు 2017 మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్, ఐక్య రాజ్యసమితి హక్కుల ఒప్పంద పత్రం, నేషనల్ పాలసీ, నేషనల్ ట్రస్ట్ చట్టాల అమలు కోసం పోరాడాలని, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్స్, నామినేటెడ్ పదవుల సాధనకు ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చింది. వికలాంగుల సంక్షేమం సాధికారత, సమగ్రాభివృద్ధి సాధించుకోవడానికి చేపట్టే ఉద్యమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎన్‌పీఆర్‌డీ కోరుతున్నది.

గురుకుల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-కల్లూరు

కల్లూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఐదవ తరగతి ప్రవేశ పరీక్ష ఈనెల 23వ తేదీన ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తున్నట్లు, అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కనకదుర్గ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-2025 విద్యా సంవత్సరానికిగాను 5 తరగతిలో ప్రవేశానికి 6, 7, 8, 9 తరగతులలో మిగిలిన సీట్ల భర్తీకిగాను తెలంగాణ సాంఘిక సంక్షేమ విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్న "కామన్ ఎంట్రన్స్ టెస్ట్" కోసం ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్స్‌తో పాటు ఐడెంటిఫికేషన్ కోసం ఆధార్ కార్డు తీసుకొని రావాలని సూచించారు. ఉదయం 10 గంటల కల్లా పరీక్ష కేంద్రాన్ని చేరుకోవాలని పేర్కొన్నారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష హాల్లోకి అనుమతించబడవని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు బాలురు 338, బాలికలు 296 మొత్తం 634 పరీక్ష రాయనున్నట్టు తెలిపారు.

ఖురాన్‌ను ప్రేమించండి : ముఫ్తీ సిద్ధిక్ సాహెబ్

నవతెలంగాణ-తల్లాడ

పవిత్ర గ్రంథం ఖురాన్‌ను ప్రతి ముస్లిం కుటుంబం ప్రేమించాలని ప్రముఖ ఇస్లాం ధార్మిక పండితులు ముఫ్తీ సిద్ధిక్ సాహెబ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నారాయణపురం, మస్జిద్‌లో ఇస్తే మా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధిక్ సాహెబ్ ప్రధానోపాన్యాసం చేశారు. మస్జిద్ సదర్ షేక్ కమల్ సాహెబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మౌలానా అబ్దుల్ సత్తార్ సాహెబ్, మౌలానా అబ్దుల్ వజీర్, గ్రామ ముస్లింలు పాల్గొన్నారు.

టీబీ రహిత పంచాయతీలగా మార్చడమే లక్ష్యం

నవతెలంగాణ-కల్లూరు

టీబీ రహితంగా గ్రామపంచాయతీలను తీర్చిదిద్దటమే లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నట్లు సూపర్వైజర్ రామారావు అన్నారు. మండల పరిధిలోని కిష్టయ్య బంజర గ్రామంలో శుక్రవారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నవ్యకాంత్ సహకారంతో కల్లూరు పీహెచ్ పరిధిలో గల కిష్టయ్య బంజార గ్రామ పంచాయతీలో టీబీ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టీబీ నోడల్ పర్సన్ రామారావు మాట్లాడుతూ కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రతి పంచాయతీని టీబి ఫ్రీ పంచాయతీగా మార్చడం కోసం టీబీ నిర్మూలన విభాగంలోని టీబీ చికిత్స సూపర్వైజర్ వై.సురేష్, ల్యాబ్ సూపర్వైజర్ సంజీవ్ కుమార్, వైద్య సిబ్బంది సహకారంతో పనిచేస్తున్నామని తెలియజేశారు. టీబీ వ్యాధికి సంబంధించిన మందులు,పరీక్షలు పూర్తి ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందని తెలియజేశారు. టీబీ వ్యాధి లక్షణాలున్న వారి నుంచి కళ్లే నమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ సత్యనారాయణ, ఏఎన్ఎం విజయలక్ష్మి నిర్మల, ఆశా కార్యకర్తలు రాణి, లక్ష్మి పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసి ఆర్యవైశ్య ప్రముఖులు

నవతెలంగాణ-కల్లూరు



రెవెన్యూ శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో గురువారం రాత్రి ఆర్యవైశ్య ప్రముఖులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గుర్రం గోవర్ధన్ కుమారిని పెళ్లికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కల్లూరు మండల నాయకులు కాటేపల్లి కిరణ్‌కుమార్, ఆర్యవైశ్య నాయకులు అనుములు వెంకటేశ్వరరావు, అశో లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి ఖమ్మం రీజియన్‌లో 75 బస్సులు

- **ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరాం**

నవతెలంగాణ-సత్తుపల్లిరూరల్

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఖమ్మం రీజియన్‌లో 75 బస్సులు ఏర్పాటు చేసినట్లు రీజినల్ మేనేజర్ ఏ.సరిరాం తెలిపారు. శుక్రవారం నీలాద్రి ఆలయాన్ని సందర్శించిన అనంతరం సత్తుపల్లి డిపో సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భక్తుల సౌకర్యం కోసం ఖమ్మం రీజినల్ పరిధిలో శివాలయాలకు శివరాత్రి సందర్భంగా 75 బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సత్తుపల్లి నుండి నీలాద్రికి 25 బస్సులు, ఖమ్మం నుండి తీర్థాలకు 25 బస్సులు, వైరా నుండి స్నానాల లక్ష్మీపురంకు పది బస్సులు, భద్రాచలం నుండి మోతే గడ్డకు ఐదు బస్సులు, కొత్తగూడెం నుండి నీలాద్రి, బెండలపాడు అన్నపురెడ్డిపల్లికు పది బస్సులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. భక్తుల రద్దీనిబట్టి అదనంగా బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఉద్యోగులకు ఇస్తున్న శిక్షణ తరగతులకు హాజరై వృత్తి పట్ల అంకితభావంతో, సమిష్టిగా పని చేసినట్లయితే విజయాలు అవే వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓ జీఎస్ పవిత్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లుకు సన్మానం

- **నూతన విద్యాశాఖ అధికారి వెంకట్‌కు స్వాగతం**

నవతెలంగాణ-కామేపల్లి



మండల ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో పూర్వ మండల విద్యాశాఖాధికారి కొత్తపల్లి వెంకటేశ్వర్లు మండల విద్యాశాఖకు, ఉపాధ్యాయులకు నిస్వార్థంగా సేవలు అందించారని ఉపాధ్యాయ సంఘాల నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా ఆయనను శుక్రవారం ఘనంగా శాలువాలు, బోకేలతో సన్మానించారు. నూతన విద్యాశాఖ అధికారి వెంకట్‌కు స్వాగతం పలికి సాలువాలు, బోకేలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు రామారావు, సౌకత్ అలీ, లింగానాయక్, ఎం.నరసింహారావు, శ్యామ్ కుమార్, గౌస్, నాగు, వెంకన్న, జక్కుల వెంకటేశ్వర్లు, దేవ్‌సింగ్, దస్రు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెడుతున్న బీజేపీ...

నవతెలంగాణ-ఖమ్మం రూరల్



బీజేపీ వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెడుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. మండలంలోని ఆరెకోడు గ్రామంలో అల్ ఇండియా కిసాన్ సభ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రూరల్ మండల మూడవ మహాసభ శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడారు. బిజెపి అధికారం చేపట్టిన గత పదకొండేళ్లలో మోడీ ఈ దేశంలో కర్షకులపై కక్షకట్టి, పారిశ్రామికవేత్తలకు తొత్తులుగా వ్యవహరిస్తూ వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలో నెడుతున్నారని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్‌ను తక్షణమే అమలు చేసి ఈ దేశంలో రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం 21 మందితో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా మామిడి సుదర్శన్ రెడ్డి, కార్యదర్శిగా ఏలూరు భాస్కర్‌రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మెన్ మహమ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రైతు సంఘం నాయకులు కొండపర్తి గోవిందరావు, తాటి వెంకటేశ్వర్లు, మిడికంటి వెంకటరెడ్డి, బానోత్ రామకోటి, యండ్లపల్లి శంకరయ్య, పగిళ్ల వీరభద్రం, పుచ్చకాయల సుధాకర్, బానోత్ రామ్మూర్తి, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT HANUMAKONDA
ARB. O.P. NO. 2 OF 2022

Between:
Inapanuri Ratna Kumari ...Petitioner
AND
M/s. Shriram City Union Finance Limited, Rep. by Sri. K. Srinivasulu, its GPA & Authorised signatory and others ...Respondents

NOTICE

To
1.Respondent No.2 Inapanuri Suresh Ratna Prasad, S/o. Adam, age: 52 yrs, R/o. H.no. 12-11-281/1, VDO's colony, Khammam urban, Khammam Dist, Telangana state, M -9618108098.
2. Respondent No.3 Mukku Bhaskar Rao, S/o. Appa Rao, Age: 47 Yrs, Occu: M/s. Bhaskar Iron & Steel Industries, Granite Industries, R/o. H.No. 6- 106,Pandurangapuram, Ballepalli,KHAMMAM, TELANGANA M - 9440324960.

Take notice that the above suit is posted to 03-03-2025 for your appearance. You are hereby directed to appear before the above court on 03- 03-2025 by 10:30 AM either in person or through agent. Otherwise the Hon'ble Court could set you ex-parte.

// BY ORDER OF COURT //
K.V.K. GUPTA
Advocate- Hanumakonda
Cell : 9390106755

విద్యార్థులకు హక్కులపై అవగాహన అవసరం

- **సీడీపీఓ కనకదుర్గ**

నవతెలంగాణ-వేంసూరు



విద్యార్థులకు హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సిడిపిఓ కనకదుర్గ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అడసర్లపాడు ముద్దులగూడెం పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చిన్నారి ముచ్చట్లు కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు హక్కులపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం పిల్లల హక్కులపై 1098 హెల్ప్‌లైన్ నెంబర్‌ను వినియోగించుకోవాలని, గ్రామాలలో ఎక్కడైనా బాల్యవివాహాలు బాల కార్మికులు మానవ అక్రమ రవాణా లైంగిక వేధింపులు మాదకద్రవ్యాలు సరఫరా చేసినట్లయితే వెంటనే 100కు డయల్ చేయాలని సూచించారు. విద్యతోపాటు వీటిపై అవగాహన కలిగి ఉన్నట్లయితే మంచి సమాజాన్ని స్థాపనకు దోహదపడవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ సూపర్వైజర్ కే.భవాని, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, నాగేందర్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశాలు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందని సాగు నీరు..



ఎండిపోయిన చెరువు

ఇబ్బంది పడుతున్న రైతులు

- **ఎండుతున్న చెరువులు**
- **పొట్ట దశకు వరి పైరు**
- **నీరు సరఫరా చేయాలని రైతు సంఘం డిమాండ్**

నవతెలంగాణ-కల్లూరు

రబీలో సాగు చేసిన వరి పైరు పొట్ట దశకు చేరి సరఫరా చేస్తున్న సాగునీరు సరిపోక రైతులు ఆందోళనలో ఉన్నారు. ఇప్పటికే అన్ని పెట్టుబడులు పెట్టి చివర దశలో సాగునీరు కొరతతో ధాన్యం తాలుగా మారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గత 15 రోజుల నుండి ఎండలు విపరీతంగా ఉండటంతో పొలాల్లో తేమ ఆవిరి అయిపోయి పొలాలు వెంటనే బేట్టకు వస్తున్నాయి.. రబీ ప్రారంభం నుండి వరిపైరుకు చిడ పిడలు అధికమై ఒక రైతు 4 నుండి 5 సార్లు పురుగు మందు పిచికారి చేసి పంటను కాపాడుకున్నారు. దీంతో ఖరీఫ్ కంటే కూడా రబీలో పెట్టుబడి పెరిగిందని రైతులు వాపోతున్నారు. మండలంలో చెరువులు, కుంటలు, సాగర్ కాల్వ కింద సుమారు 30 వేల ఎకరాల్లో రబీలో వరి సాగు చేశారు. రబీ సీజన్ ప్రారంభం నుండి ఇప్పటి వరకు ఒక వర్షం కూడా పడలేదు. కేవలం సాగర్ జలాల పైన ఆధారపడి సాగు చేయటం జరిగింది. రబీ ప్రారంభం నుండి వారా బంది పద్ధతిలో సాగునీటి సరఫరా చేస్తున్నారు. నాటు వేసిన దగ్గర నుండి ఇప్పటి వరకు వారాబంధి పద్ధతిలోనే సాగునీరు సరఫరా చేసిన పంటలకు సరిపోయాయి. కానీ వేసవి తీవ్రత ఫిబ్రవరిలోనే పెరగటంతో సాగునీటి అవసరం అత్యధికంగా పెరిగింది. ప్రస్తుతం వరి పైరు పొట్ట దశలో ఉంది. కొంత పైరు పొట్ట కొంత కంకి వేసే దశలో ఉంది. ఈ సమయంలో సుమారు 20 రోజులు పైగా సాగునీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. కంకి వేసిన దగ్గర నుంచి సుంకు పోసుకొని గింజ పాలు పాలు పోసుకొనే వరకు నీటి అవసరం అధికంగా ఉంది. ఈ సమయంలో నీటి ఏర్పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగర్ కాలువ చివరి ఆయకట్టుకు నీరందే పరిస్థితి లేదు. ప్రస్తుతం వారబంది పద్ధతిలో సాగునీరు సరఫరా చేయడంతో చివర పొలాలకు చేరకముందే నీటి సరఫరాను నిలిపివేస్తున్నారు. పైరు చివర దశలో నీరు అందక రైతులు మనోవేదనకు గురవుతున్నారు.

అడుగంటుతున్న చెరువులు, కుంటలు

వారాబంది పద్ధతిలో సాగునీరు సరపరా చేయడంతో మండలంలోని చెరువులు, కుంటలు తూములకు నీరు అందక అడుగంటి పోతున్నాయి. మండలంలో సుమారు పదివేల ఎకరాల పైన చెరువులు, కుంటలపై ఆధారపడి సాగు చేస్తున్నారు. ఈ చెరువుల్లోకి సాగర్ కాల్వలో నుంచి తుములు ఉండటంతో ఎప్పుడూ నిండుకుండలా కనిపించే చెరువులు ప్రస్తుతం తూములకు నీరు సరపర అయ్యే పరిస్థితి లేదు. కేవలం వారం రోజులు పాటు నీటి సరఫరా ఉండటంతో చెరువులోకి నీరు సక్రమంగా రాక ఉన్న నీరు పంట పొలాలకు వినియోగించడంతో చెరువులు అడుగంటుతున్నాయి. సాగర్ ప్రధానకాలలో నీటి నిల్వను ఉంచితేనే చెరువులు పోయే తూములు ద్వారా నిరు వెళ తుంది. ఇప్పుడు వారాబంది పద్ధతిలో వారం మాత్రమే సాగునీటి అందించడంతో మిగిలిన వారం రోజులు నూజివీడు బ్రాంచ్‌కి సాగునీరు సరఫరా అవుతుంది. ఈ సమయంలో చెరువులకు నీరు వెళ్లే తూములకు నీరు అందదు. దీంతో చెరువులకు నీటి సరఫరా లేక అడుగంటుతున్నాయి. లోకవరం పెద్ద చెరువులో నాలుగు తుమ్ములు ఉన్న కూడా నీటి సరఫరా కావడం లేదు. చెరువులో నీరు అడుగంటటంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ చెరువు ఆయకట్టు సుమారు 1000 ఎకరాల పైన ఉంటుంది. ఈ విధంగా కల్లూరు, చెన్నూరు, పెద్ద కోరుకొండి, వెన్నవల్లి, ముచ్చవరం, పాయపూరు, ఈ విధంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటలు కూడా అడుగంటే ఉన్నాయి. పంట చివరి దశలో ఉన్నప్పుడు నీటి అవసరం ఎక్కువగా ఉంటుందని, నీరు సక్రమంగా అందకపోతే గింజ తాలుగా మారి దిగుబడులు పూర్తిగా తగ్గుతుంది. పెట్టుబడులు కూడా వస్తాయా రావా అని రైతుల ఆందోళన చెందుతున్నారు. పంటకు సరిపడా సాగునీటి సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

వారాబంధి లేకుండా సాగునీరు సరఫరా చేయాలి

తెలంగాణ రైతు సంఘం డిమాండ్

రబీలో సాగుచేసిన వరి పైరుకు సరిపడా సాగునీరు అందించి పంటను కాపాడాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి ముదిగొండ అంజయ్య, సహాయ కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పొట్ట దశలో ఉన్న పైరుకు నిరంతరంగా సాగునీటి సరఫరా చేసి రైతుల ఆదుకోవాలన్నారు. కనీసం 20 రోజులు పాటు అయినా వారాబంధి లేకుండా సాగునీరు సరఫరా చేసి పంటను కాపాడాలని అధికారులని, ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమయంలో సాగునీరు పుష్కలంగా లేకపోతే గింజ పాలు పోసుకోకుండా తాలూగా మారే పరిస్థితి ఉందని, దీంతో దిగుబడులు తగ్గి పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి ఉండదని తెలిపారు. ప్రభుత్వం రైతుల ఇబ్బందిని గమనించి సాగునీరు సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

చివరి ఆయకట్టుకు నీళ్లు అందేలా చూడండి

- **తహసీల్దార్ కరుణ శ్రీ**

నవతెలంగాణ-కూసుమంచి



చివరి ఆయకట్టు భూములకు నీళ్లు అందేలా చూడాలని తహసిల్దార్ కరుణశ్రీ కోరారు. మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో రెవిన్యూ ఇరిగేషన్, ఎలక్ట్రిసిటీ, అగ్రికల్చర్, ఎన్ఎస్పి అధికారుల సంయుక్త సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. భక్త రామదాసు ఎత్తిపోతల ద్వారా వ్యవసాయ పంటల కోసం నీటిని విడుదల చేయటం జరిగిందని, ఈ నీళ్ల మండలానికి చేరుతున్నాయని, ఈ నీటిని రైతులందరూ పొదుపుగా వాడుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాలువల ద్వారా వచ్చే నీటిని మోటార్లు పెట్టి ఉపయోగించకూడదని, నీటిని వృధా చేయవద్దని, చివరి ఆయకట్టు రైతులందరికీ నీరు అందే విధంగా సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేసి నీటిని సద్వినియోగం అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఇఇ రత్నకుమారి, ఏఇఇ కోక్యనాయక్, ఏవో వాణి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- **కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

నవతెలంగాణ-ఖమ్మం



జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలపై జిల్లాల కలెక్టర్‌లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి పాల్గొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాల ముద్రణ, పోస్టల్ బ్యాలెట్ జారీ, పోలింగ్ కేంద్రాలలో అవసరమైన వసతులు, వెబ్ కాస్టింగ్, డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కేంద్రాల వద్ద ఏర్పాటు, పోలీస్ బందోబస్తు, తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదీర్ఘంగా చర్చించి జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు జారీ చేశారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు 24 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సిబ్బందిని నియమించి అవసరమైన శిక్షణ అందించామని తెలిపారు. పోలింగ్ ముగిసిన తరువాత బ్యాలెట్ బాక్స్‌లను నేరుగా నల్గొండ తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నామని తెలిపారు.

ఎన్నికలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలు అందుబాటులో ఉన్నాయని, పోలింగ్ కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు చేపట్టామని అన్నారు. పోలింగ్ నాడు ప్రతి రెండు గంటలకు రిపోర్ట్ అందించేలా వ్యవస్థ సిద్ధం చేసుకున్నామని అన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బందోబస్తుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్వో ఏ.పద్మశ్రీ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మకు సీపీఐ(ఎం) నాయకుల నివాళి

నవతెలంగాణ-బోనకల్



మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమర వీరురాలు, స్వాతంత్ర్య సమరయోధురాలు, సీపీఐ(ఎం) నాయకురాలు ఏడునూతల సీతమ్మ ఇటీవల మృతిచెందారు. శుక్రవారం ఆమె దశదినకర్మ గోవిందాపురం ఎల్ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీతమ్మ చిత్రపటానికి సీపీఐ(ఎం) పూర్వ రాష్ట్ర కమిటీ సభ్యులు మన్నేపల్లి సుబ్బారావు, మాజీ జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, బివికే ట్రస్ట్ మేనేజర్ ఎనిగండ్ల శ్రీనివాసరావు, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, ముష్టికుంట్ల మాజీ సర్పంచ్ కొంగర వెంకటనారాయణ, రావినూతల గ్రామ శాఖ కార్యదర్శి కొంగర భూషయ్య పూలమాలలు వేసిన నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, లక్ష్మీపురం సొసైటీ అధ్యక్షులు మాదినేని వీరభద్రరావు, లక్ష్మీపురం మాజీ ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత, సీపీఐ(ఎం) నాయకులు కళ్యాణపు శ్రీనివాసరావు, కోట కాటయ్య, ఉమ్మనేని రవి, కళ్యాణపు బుచ్చయ్య, వల్లంకొండ సురేష్, తమ్మారపు లక్ష్మణ్, కొమ్ము కమలమ్మ, యేసుపోగు బాబు, నల్లమోతు నాగేశ్వరరావు, నల్లమోతు వాణి, పసుపులేటి నరేష్ తదితరులు ఉన్నారు.

దళితుల సమస్యలపై కదం తొక్కండి

- **23న కేవీపీఎస్ డివిజన్ సదస్సు**
- **రాష్ట్ర అధ్యక్షుడు జాన్ వెస్లీ రాక**
- **బోదులబండ ఎస్సీ కాలనీలో బండి రమేష్ రాత్రి బస**
- **దళిత బిడ్డల ఘన స్వాగతం**

నవతెలంగాణ-నేలకొండపల్లి



దళితుల సమస్యలపై కదం తొక్కండి అని కేవీపీఎస్ నాయకులు బండి రమేష్ అన్నారు. రాష్ట్రంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని, దళితులపై దాడులను అరికట్టాలని, దళిత వాడలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న ఖమ్మం నాయుడుపేట చౌరస్తాలోని రామ్ లీలా ఫంక్షన్ హాల్‌లో జరిగే కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) పాలేరు డివిజన్ స్థాయి సదస్సును జయప్రదం చేయాలని బండి రమేష్ పిలుపునిచ్చారు. సదస్సు జయప్రదం కోరుతూ గురువారం రాత్రి మండలంలోని బోదులబండ గ్రామంలో ఎస్సీ కాలనీలో చేపట్టిన ప్రచార యాత్రకు ప్రజల నుండి విశేష స్పందన లభించింది. తమ కాలనీలో బస చేసేందుకు తమ సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గాన్ని చూపేందుకు విచ్చేసిన కెవిపిఎస్ నాయకులు బండి రమేష్‌కు పూలమాలలతో ప్రజలు ఘన స్వాగతం పలికారు. కాలనీలో చేపట్టిన ప్రదర్శన దళితుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా స్టాలిన్ అధ్యక్షతన కాలనీలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న అసమర్థ విధానాల ఫలితంగా స్వాతంత్రం సిద్ధించి ఏళ్ల గడుస్తున్న దళితుల బతుకుల్లో మార్పు లేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని శరవేగంగా ముందుకు సాగుతున్న తరుణంలో కూడా దళితులపై వివక్ష, దాడులు, అత్యాచారాలు, హత్యలు, కొనసాగడం దళితుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి అద్దం పడుతుందన్నారు. అధికార పీఠం కోసం దళితులను ఓటు బ్యాంకుగా వాడుకొని సామాజిక అణచివేతలకు గురి చేయడం అన్యాయమన్నారు. తమ పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న అంటరానితనం, వివక్షతలపై దళితులు చైతన్యవంతం కావాలన్నారు. దళితుల పట్ల పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడంతో నేటికీ దళిత వాడలు ఏమాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న దళిత వ్యతిరేక విధానాలపై దళితులంతా ఐక్యంగా దండు కట్టాల్సిన అవసరం ఆసన్నమైనదన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన ఇందిరమ్మ అభయహస్తం 12లక్షల రూపాయలను తక్షణమే ప్రతి దళిత కుటుంబానికి ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వాలని కోరుతూ జరిగే పాలేరు నియోజక వర్గ స్థాయి సదస్సుకు పెద్ద సంఖ్యలో దళిత సోదర సోదరీమణులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు పాపిట్ల సత్యనారాయణ, పగిడికత్తుల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పొట్టపింజర స్టాలిన్, గీతకార్మిక సంఘం నాయకులు కట్టెకోల వెంకన్న, చింతలపాటి భాస్కర్, సీతరాములు, మధు, పొట్టపింజర రాజేష్, రవి, బొల్లికొండ శ్రీను, బుచ్చన్నారాయణ, పుట్టపింజర వాణి, మరియమ్మ, ఏసోబు(పెద్దమాదిగ) మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఒలింపియాడ్‌లో సర్వజ్ఞ విద్యార్థుల విజయకేతనం

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని వీడివోస్ కాలనీలో సర్వజ్ఞ పాఠశాలకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభను కనబరచి ఒలింపియాడ్ పరీక్షలో ఘన విజయం సాధించారు. టిఇఓఎఫ్ ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ వారు నిర్వహించిన పరీక్షలో రెండు వేలకు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీ పరీక్షలో సర్వజ్ఞ పాఠశాల 3వ తరగతి చెందిన కే.జయదేవ్ చౌహాన్ సైన్స్ ఒలింపియాడ్‌లో జిల్లా ప్రథమ స్థాయి, 6వ తరగతి చెందిన ఎం.అక్షయ్ రుత్విక్ ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో రాష్ట్రంలో ప్రథమ స్థానం పొందారని పాఠశాల డైరెక్టర్ ఆర్‌వి.నాగేంద్ర కుమార్ తెలిపారు. విద్యార్థుల ఈ విజయం సర్వజ్ఞకి ఎంతో గర్వకారణమని తెలిపారు. ఆటపాటలతో పాటు విద్యలోను సర్వజ్ఞ గల ప్రత్యేకతను ఎల్లప్పుడూ చాటుకుంటుందని అన్నారు. డైరెక్టర్ కే.నీలిమ మాట్లాడుతూ విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందించడంలో సర్వజ్ఞ ముందడుగులో ఉంటుంది అన్నారు. వీడివోస్ కాలనీలో సర్వజ్ఞ పాఠశాల పరిమితమైన విద్యార్థులతో అత్యాధునిక వసతులతో నాణ్యమైన విద్యనందిస్తూ ఖమ్మం జిల్లాకే తలమానికంగా నిలిచిందని అన్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ పవిత్ర, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
6
ఖమ్మం
శనివారం | ఫిబ్రవరి 22, 2025 | www.navatelangana.com

సాగర్ నీటి విషయంపై వివాదం

- ఇద్దరిపై కేసు నమోదు

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని రావినూతల గ్రామానికి చెందిన సాగర్ నీటి వివాదంపై ఇద్దరి వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై కడకండ్ల మధుబాబు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం రావినూతల గ్రామానికి చెందిన తాళ్లూరి రాంబాబు, గార్లపాటి కిషోర్ వ్యవసాయ పొలాలు పక్కపక్కనే ఉన్నాయి. అయితే సాగర్ నీళ్ల పెట్టుకునే విషయంపై ఇద్దరి మధ్య వివాదం నెలకొంది. ఈ వివాదం కాస్త ముదిరి ఘర్షణకు దారితీసింది. దీంతో ఇద్దరు కొట్టుకున్నారు. ఆ తర్వాత ఇద్దరు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు చేసుకున్నారు. ఇద్దరి ఫిర్యాదులు మేరకు ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సైలో బంకరుకు బాధితులు 'పిండ' ప్రదానం

- సింగరేణికి బాధితుల వినూత్న నిరసన

నవతెలంగాణ-సత్తుపల్లి



కాలుష్యం వెదజల్లుతూ ప్రాణాలు హరిస్తున్న సింగరేణి సైలో బంకరును తీసెయ్యాలని ఈనెల 10నుంచి దీక్షలకు దిగిన సత్తుపల్లి మండలం కిష్టారంలోని అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీకి చెందిన సైలో బంకరు బాధితులు తమ నిరసన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం దీక్షా శిబిరం వద్ద సైలో బంకరు ఫ్లెక్సీని ఏర్పాటు చేసి పూజారులతో పిండ ప్రదానం చేశారు. కార్యక్రమంలో సైలో బంకరు నిరసన దీక్షల బాధ్యులు పాలకుర్తి నాగేశ్వరరావు, పాలకుర్తి ప్రభుదాసు, కడారి మదీన, మారోజు నాగేశ్వరరావు, పాలకుర్తి ప్రభాకర్, మారోజు శ్రీను, పాలకుర్తి రాజు, మారోజు అశోక్‌కుమార్, వాడపల్లి కోటేశ్వరరావు, కొండా నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

రుణం తీర్చుకోలేనిది

- ఎల్ఆర్ఎస్‌పై హర్షం
- శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి
- శ్రీ బాలాజీ ఎస్టేట్స్ ఆధ్వర్యంలో సీఎం, రెవెన్యూ మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-ఖమ్మం



ఎల్ఆర్ఎస్‌ను (ల్యాండ్ రెగ్యులేషన్ పథకం) ప్రకటించటం హర్షనీయమని, ప్రభుత్వం ఋణం ఎలా తీర్చుకోవాలలో తెలియటం లేదని శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి కొనియాడారు. ఎల్ఆర్ఎస్ ప్రకటించడంపై ధన్యవాదాలు తెలుపుతూ గురువారం నగరంలోని శ్రీ బాలాజీ స్టేట్ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అకుంఠిత దీక్షతో ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకుందన్నారు. అంతేకాకుండా 25 శాతం సబ్సిడీని ప్రకటించటం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనం అని కొనియాడారు. ఎల్ఆర్ఎస్ వల్ల ప్రజలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, ఏజెంట్ మిత్రులకు వరంగా మారిందన్నారు. ఎల్ఆర్ఎస్ పథకం కోసం గత నాలుగున్నర సంవత్సరాల నుంచి ప్రజలు రియల్, ఎస్టేట్ వ్యాపారులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం విధానం వల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనేక రకాల ఇబ్బందులకు గురి అయ్యారని తన ఆవేదన వ్యక్తం చేశారు. దాని ఫలితంగా దాదాపు నాలుగున్నర సంవత్సరాల వ్యాపార కాలం వృథా ప్రయాసగా మారిందని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోనే ఎల్ఆర్ఎస్ సమస్యను పరిష్కరించిందని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని పేర్కొన్నారు. సబ్సిడీ గడువు కాలం మార్చి 31 వరకు ఇవ్వటం తమకే కలిసొచ్చే అంశం అయినప్పటికీ ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న ప్లాట్ల క్రయవిక్రయాలు ఇక ప్రారంభించాల్సి ఉంటుందని, ప్లాట్లు కొన్నవారికి రిజిస్ట్రేషన్‌కు గడువు కాలం పడుతుందని, సబ్సిడీ సమయాన్ని మరో ఆరు నెలలు పొడిగించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తద్వారా పెండింగ్లో ఉన్న ప్లాట్ల క్రయవిక్రయాలు ఊపొందుకొని ప్రభుత్వానికి రెవెన్యూ పెరిగిద్దని అన్నారు. ఇంతటి బృహొత్తర కార్యక్రమానికి సహకరించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, మంత్రివర్గ ఉప సంఘానికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కొనిజర్ల మాజీ ఎంపీపీ గోసు మధు, ఆఫీస్ ఇంచార్జ్ పోగుల రవికుమార్, సీనియర్ మార్కెటింగ్ డైరెక్టర్లు షేక్ తాజుద్దీన్, కాసాని శ్రీశైలం, గాలి నారాయణ, తోట వెంకటేశ్వర్లు, బాబురావు, జానీ భాష, వసీం, కళ్యాణ్ చౌదరి, సాయి కిరణ్, శ్రీకృష్ణ, ప్రశాంత్, శ్రీనివాసరావు, మల్లికార్జున్, పిఎస్ఆర్ ఏఎస్ఆర్, రవికుమార్, కృష్ణ చౌదరి, రజినీకాంత్ చంద్రన్న గౌడ్, ఉపేందర్, సుమన్, అలవాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బోనస్ వెంటనే విడుదల చేయాలి

- రైతు భరోసా గందరగోళం తొలగించాలి
- రుణమాఫీ పూర్తి చేయాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్



ఖమ్మం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 65 కోట్ల రూపాయలు ధాన్యం బోనస్ విడుదల చేయాలని, రైతు భరోసాలో రైతుల్లో నెలకొన్న గందరగోళం తొలగించాలని, రుణమాఫీ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వైరా తహసిల్దార్ కార్యాలయం వద్ద రైతులు నిరసన తెలిపి తహశీల్దార్ కెవి శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి మయాన్ మంజు ఖాన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ గత రెండు నెలల నుంచి సన్న ధాన్యం బోనస్ రైతుల బ్యాంకు ఖాతాలకు జమ కావడం లేదు అన్నారు. ఖమ్మం జిల్లాలో 23,244 మంది రైతులకు 64 కోట్ల, 41 లక్షల 83 వేల, 400 రూపాయలు, వైరా మండలంలో 3,115 మంది రైతులకు 9 కోట్ల 45 కోట్ల రూపాయిలు పెండింగ్ లో ఉన్న నేపథ్యంలో రైతులు రోజు బ్యాంకులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని అన్నారు. రైతు భరోసా మూడు ఎకరాలలోపు పూర్తి అయిందని రాష్ట్ర మంత్రులు పదే, పదే ప్రకటనలు చేస్తున్నారని, రైతులు బ్యాంకు ఎకౌంటులకు ఎకరం ఉంటే ఒక కుంటకు రెండు ఎకరాల ఉంటే రెండు కుంటలకు మాత్రం రైతు భరోసా జమ అయినట్లు వాపోతున్నారని, తమ భూమి విస్తీర్ణం అసలు ప్రభుత్వ రికార్డుల్లో ఉందో లేదో తెలుసుకోవడం కోసం రైతులు రెవెన్యూ వ్యవసాయ శాఖ కార్యాలయాలకు వెళ్ళి అధికారులను సంప్రదించినా సమాధానం చెప్పే పరిస్థితి లేదు అన్నారు. రెండు లక్షల రూపాయలలోపు అప్పు ఉన్న రైతులకు కూడా రుణమాఫీ పూర్తి కాలేదని, రెండు లక్షల రూపాయలు పైన అప్పు ఉన్న రైతులు రుణమాఫీ ఊసే లేదని, రైతులకు ప్రభుత్వం ప్రకటించిన నగదు బదిలీ పథకాలు అమలులో స్పష్టత కొరబడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం బోనస్, రైతు భరోసా, రుణమాఫీపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, జిల్లా కమిటీ సభ్యులు బాణాల శ్రీనివాసరావు, వైరా మండల అధ్యక్షులు మేడా శరబంధి, తోట నాగేశ్వరరావు, పారుపల్లి కృష్ణారావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, సంక్రాంతి నర్సయ్య, పైడిపల్లి సాంబశివరావు, హరి వెంకటేశ్వరరావు, బెజవాడ వీరభద్రం, వడ్లమూడి మధు, పాసంగులపాటి చలపతిరావు, అమరనేని కృష్ణ, మచ్చా కృష్ణమూర్తి, గాలి శివ, ద్రోణాదుల నాగేశ్వరరావు, నూకల వెంకటేశ్వరరావు, రాధా, గరిడేపల్లి సుబ్బారావు, వడ్లమూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా జరిగిన సైన్స్ మాసోత్సవ సంబరాలు

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం పట్టణంలోని మంచికంటిభవన్ హాల్‌లో విజ్ఞానదర్శిని, టిపిఎస్‌కె, బివికె, ఇపిటిఆర్ఐ, ఇఎసిపి హబ్‌ల ఆధ్వర్యంలో సైన్స్ మాసోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు రమేష్ మాట్లాడుతూ ఆదిమ మానవుల నుండి ఆధునిక వైజ్ఞానిక మానవులుగా ఎదిగిన మానవ పరిణామక్రమ ప్రస్థానం అనేది, వైజ్ఞానిక దృక్పథం ద్వారా సాధ్యమైంది అన్నారు. వైజ్ఞానిక ఆలోచన మానవుల్ని ప్రగతిమార్గం వైపు నడిపిస్తుంది అన్నారు. మూఢ నమ్మకాలు సమాజ ప్రగతికి ఆటంకంగా వుంటాయి అన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ నెం.51 (ఎ.హెచ్.) అనేది, వైజ్ఞానిక దృక్పథాన్ని పెంపొందించటం మన బాధ్యత అని చెప్పింది అన్నారు. ప్రతి ఒక్కరిలో వైజ్ఞానిక ఆలోచన పెంపొందించడానికి విజ్ఞాన దర్శిని ఈ సైన్స్ మాసోత్సవ సంబరాలను నిర్వహిస్తోంది అని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో కథా రచన, వ్యాస రచన, పాటలు, చిత్ర లేఖనం, కవితా రచన, సైంటిస్టుల వేషధారణ మరియు అభినయం అనే అంశాల్లో ఖమ్మం పట్టణంలోని పదుల సంఖ్యలోని పాఠశాలల్లోని 8, 9 తరగతుల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. సైంటిస్టుల వేషధారణ పోటీలు ఆకర్షణీయంగా నిలిచాయి. అనంతరం మధ్యాహ్నం మ్యాజిక్ ప్రదర్శన కూడా ఉత్సాహంగా జరిగింది. పాల్గొన్న విద్యార్థులందరికీ కంచెపు రాంబాబు (శ్రీ జయ విలాసిని డెవలపర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్) బహుమతుల్ని అందజేశారు.



స్థానిక సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయాలి

నవతెలంగాణ-నేలకొండపల్లి

మండల వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పార్టీ శ్రేణులు నిరంతర అధ్యయనం ద్వారా ప్రజలను చైతన్యవంతం చేస్తూ పోరాటాలను ఉధృతం చేయాలని సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కెవి రామిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ళ సత్యనారాయణ భవనంలో రెడ్ బుక్స్ డే సందర్భంగా పగిడికత్తుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన మండల స్థాయి చర్చ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఐ(ఎం) 24వ జాతీయ మహాసభ తమిళనాడు రాష్ట్రంలోని మదురై పట్టణంలో జరుగుతుందని ఈ సందర్భంగా రూపొందించిన మహాసభ రాజకీయ ముసాయిదా తీర్మానంపై ప్రతి కార్యకర్త సంపూర్ణమైన అవగాహనతో ముందుకు సాగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అసమర్థ విధానాల మూలంగా ప్రజలకిచ్చిన హామీలులో రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, రైతు రుణమాఫీ లాంటి పథకాలు అర్హత కలిగిన లబ్ధిదారులకు అందకుండా పోయాయన్నారు. ఈ నేపథ్యంలో నిరంతర అధ్యయనం పోరాటం ద్వారానే ప్రభుత్వ మెడలు వంచి ప్రజా సమస్యల పరిష్కారానికి కషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దండ సూర్యనారాయణ, మారుతి కొండలరావు, ఎడ్ల తిరపారావు, బెల్లం లక్ష్మి, కాటం కోటేశ్వరి, కె.వి చారి, మందడపు మురళీకృష్ణ, ముకరాల నరసింహారావు, దేగల హరి ప్రసాద్, సిహెచ్ భాస్కర్, ఎస్.మల్లికార్జున్‌రావు, సీలం అప్పారావు, కే.కోటేశ్వరరావు, దుగ్గి నరసింహారావు, గిరిజాల వెంకటేశ్వర్లు, ఏలూరి రామారావు, బలుసు హనుమంతరావు, కోదండ రామారావు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం సోషలిజమే

నవతెలంగాణ-కొణిజర్ల



అమానవీయ పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం సోషలిజమేనని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్, తాళ్లపల్లి కృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని సంక్రాంతి రామచంద్రయ్య భవనంలో పార్టీ మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు అధ్యక్షతన జరిగిన రెడ్ బుక్స్ డే (సామూహిక పుస్తక పఠనం) కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈసందర్భంగా బండారు రమేష్ మాట్లాడుతూ నేడు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ముంచుకొస్తోందని, అనేక దేశాలలోని ఆర్థిక వ్యవస్థలు వృద్ధిని సాధించలేక ఇబ్బంది పడుతున్నాయని ఆయన తెలిపారు. ఇది పెట్టుబడిదారీ సమాజం యొక్క సహజ లక్షణం అని ఆయన విమర్శించారు. ధరలు, నిరుద్యోగం పెరుగుదలకు పెట్టుబడి దారి వ్యవస్థనే బాధ్యత వహించాలన్నారు. పెట్టుబడి దారీ సమాజం తన అంతర్గత ఆర్థిక మాంద్యం సమస్యలను పరిష్కరించు కునేందుకు యుద్ధాలను ముందుకు తెస్తుందన్నారు. ఆయుధ వ్యాపారం చేసైనా తమ ఆర్థిక సమస్యను పరిష్కరించుకోవాలని చూస్తుందని, అందులో భాగంగానే అమెరికన్ సామ్రాజ్యవాదం యుద్ధాలకు ఊతమిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు మోత్కూరు వెంకటేశ్వరరావు, బోయినపల్లి శ్రీనివాస రావు, చింతపల్లి ప్రసాద్, అన్నారపు వెంకటేశ్వర్లు, లింగాల చిన్నదానయ్య, భానోత్ హరిచంద్, తాళ్లపల్లి విజయ, జోనబోయిన అంజయ్య, తేజావత్ సీతారాములు, తాత వెంకయ్య, ధారగాని రాములు, జోనబోయిన నరసింహారావు, బుర్రి గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలను వినియోగించుకోండి

- 10వ తరగతి విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఎల్.నవీన్ జ్యోతి విజ్ఞప్తి

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా పట్టణంలోని ఏకైక ప్రభుత్వ జూనియర్ కళాశాలను పదో తరగతి పాస్ అయ్యే విద్యార్థులు ఉపయోగించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎల్ నవీన్ జ్యోతి కోరారు. శుక్రవారం కళాశాల ప్రచార గోడ పత్రికను ఆవిష్కరిస్తూ మండలంలోని ప్రభుత్వ హైస్కూల్లో చదివే విద్యార్థిని, విద్యార్థులకు పదో తరగతి హాల్ టికెట్ భద్రపరిచే కవర్ ఉచితంగా కళాశాల అధ్యాపకులు అందజేస్తూ కళాశాలలోని కోర్సులు వివరాలు తెలియజేస్తారని అన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీసీ, సీఈసీ, హెచ్ఈసి,(ఇంగ్లీష్ మీడియం, తెలుగు మీడియ), వృత్తి విద్య కోర్సులు ఏఈటి, ఎంఈ ఉన్నాయని తెలిపారు. కళాశాలలో అంకితభావం గల టీచింగ్, నాన్-టీచింగ్ స్టాఫ్ ఉన్నారని, పదో తరగతి విద్యార్థులు అత్యుత్తమ గ్రేడ్స్‌తో ఉత్తీర్ణత కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీచింగ్, నాన్- టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు నెల నెలా... వెన్నెల

నవతెలంగాణ-ఖమ్మం

అమరజీవి అన్నా బత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ, ఖమ్మం కళాపరిషత్, ప్రజానాట్యమండలి ఖమ్మం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో భాషా సాంస్కతిక శాఖ తెలంగాణ ప్రభుత్వం సౌజన్యంతో సాగుతున్నటువంటి నెల నెలా... వెన్నెల 91వ నెల కార్యక్రమం ఈ నెల 23వ తేదీ ఆదివారం సాయంకాలం 6 గంటలకు ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో జరుగుతుందని నిర్వాహకులు అన్నాబత్తుల సుబ్రమణ్య కుమార్, మోటమర్రి జగన్మోహన్రావు, కె.దేవేంద్ర, డాక్టర్ నాగబత్తిని రవి, డాక్టర్ వేల్పుల విజేత, వేముల సదానంద్, నామ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల జరిగే కార్యక్రమాలలో భాగంగా శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరి వారి జనరల్ బోగీలు నాటిక, స్థానిక కళాకారులు రాయల్ డాన్స్ అకాడమీ కూచిపూడి నృత్యాలయం మాస్టర్ రాజు ఆధ్వర్యంలో జానపద నృత్య రూపకాలు, అభినయ నృత్యాలయ నాట్యగురువు షకీల్ కణతాల శిష్య బృందంచే భరతనాట్య ప్రదర్శనలు ఉంటాయని, ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ కాంట్రాక్టర్ మహమ్మద్ అజీజ్, ఆత్మీయ అతిథులు డాక్టర్ కావ్య చంద్ యలమూడి, ప్రముఖ వైద్యులు, చెరుకూరి రాజి, చైర్మన్ ముకుంద ట్రస్ట్ తదితరులు హాజరవుతారని, ఖమ్మం ప్రజలు, పుర ప్రముఖులు, కళాభిమానులు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

బాధిత కుటుంబాలకు భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత

నవతెలంగాణ-ఖమ్మం

కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ లోకేశ్, అదే విధంగా అనారోగ్యంతో మరణించిన ఏఆర్ కానిస్టేబుల్ ఐ.బాలరాజు కుటుంబ సభ్యులకు ఒక్కొక్క కుటుంబ సభ్యులకు రూ.8 లక్షల భద్రత ఎక్స్‌గ్రేషియా చెక్కును శుక్రవారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా అందజేశారు.

అత్యంత సుందరంగా శ్రీవారి కల్యాణ వేదిక నిర్మాణం

- శ్రీ వకుళ మాత స్టేడియం,శిఖర ప్రతిష్ఠ ప్రారంభోత్సవం
- పనులు పూర్తి చేసుకుని మార్చి7న ప్రారంభానికి సర్వం సిద్ధం
- దాత తుళ్లూరు కోటేశ్వరరావు, నిర్మల కుమారి దంపతులు
- వాల్ పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరణ

నవతెలంగాణ - ఎర్రుపాలెం







తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన మహా దివ్యక్షేత్రం కోరుకున్న వారికి కొంగు బంగారమై వెలసిన స్వయంభు జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవాలయ ఆవరణలో సుమారు అర ఎకరం విస్తీర్ణంలో కోట్ల రూపాయల ఖర్చుతో అతి సుందరంగా నిర్మాణం చేపట్టిన శ్రీ వకుళ మాత స్టేడియం (శ్రీవారి కల్యాణ వేదిక) శిఖర ప్రతిష్ఠ మహోత్సవ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసుకుని మార్చి 7వ తారీకున ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం చేశారు. అలివేలు మంగా పద్మావతి దేవేరులతో శ్రీ వారి కళ్యాణ మహోత్సవానికి కళ్యాణ వేదిక(వకుళ మాత స్టేడియం)ని జమలాపురం గ్రామానికి చెందిన దాత ఖమ్మం కెఎస్ఆర్ గ్రానైట్ అధినేత తుళ్లూరు కోటేశ్వరరావు, నిర్మల కుమారి దంపతులు కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించారు. శుక్రవారం శ్రీ వకుళ మాత స్టేడియం ప్రారంభో త్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్‌లు కరపత్రములు ఆహ్వాన పత్రికలను ఆలయ ప్రాంగణంలో దాత తుళ్లూరు కోటేశ్వరరావు, నిర్మల కుమారి దంపతులు ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరా మ చంద్రమూర్తి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. స్వస్తిశ్రీ చాంద్రమానేన శ్రీ కోధి నామ సంవత్సర పాల్గొన శుద్ధ అష్టమి శుక్రవారం ఏడవ తారీఖు ఉదయం 8:37 నిమిషాలకు శ్రీవారి కల్యాణ వేదిక అనంతరం మృగాసిర నక్షత్ర యుక్త వషభ లగ్న పుష్కరాంశంమందున ఉదయం 11 గంటల ఏడు నిమిషాలకు అంగరంగ వైభవంగా శిఖర ప్రతిష్ఠ ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించబడును. 12 గంటలకు శాంతి కల్యాణోత్సవం బ్రహ్మ శ్రీ జూనూతుల త్రివేది శర్మ బ్రహ్మత్వంలో తిరుమల తిరుపతి దేవస్థానానికి సంబంధించిన వేద పండితుల ఆధ్వర్యంలో వేద మంత్రాలు మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించబడుతుందని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు పద్మావతి అలివేలు మంగ దేవిరులతో కలిసి స్వామివారిని గ్రామంలో ఊరేగింపు (గ్రామోత్సవం) కార్యక్రమం నిర్వహిస్తారు. దేవాలయం నందు సంవత్స రానికి రెండు పర్యాయాలు ఉగాది, దసరాకు బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజులు అత్యంత వైభోవపేతంగా నిర్వహిస్తారు. శ్రీదేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఆశ్వీజ శుద్ధ పాడ్యమి మొదలుకొని విజయ దశమి దసరా పండుగతో తొమ్మిది రోజులు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. శ్రీ వారి వార్షిక వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఉగాది నుండి శ్రీరామ నవమి పండుగ వరకు చైత్ర శుద్ధ పాడ్యమి మొదలుకొని శ్రీరామ నవమి వరకు తొమ్మిది రోజులు కన్నుల పండుగగా ఘనంగా నిర్వహిస్తారు. సప్తమి రోజు అలివేలు మంగా పద్మావతి దేవరులతో కలిపి శ్రీ వారికి కళ్యాణ మహోత్సవాన్నీ వేద పండితులు అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. శ్రీ రామ నవమి రోజు లోక కళ్యాణార్థం సీతారాముల వారి కళ్యాణాన్ని నిర్వహిస్తారు. హంపి విరూపాక్ష పీఠాధిపతులు శ్రీ విద్యారణ్య భారతి మహాస్వామి వకుళ మాత స్టేడియంకి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంవత్సరం వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాల లోపు శ్రీవారి కల్యాణ వేదికను ప్రారంభించి నూతన కళ్యాణ వేదిక నందు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఏప్రిల్ 4వ తారీకు చైత్ర శుద్ధ సప్తమిన అభ్జిత్ లగ్నంలో నూతనంగా నిర్మించిన వకళ మాత స్టేడియంలో శ్రీవారి కళ్యాణాన్ని నిర్వహించాలని దాత కళ్యాణ వేదిక పనులను త్వరితగతిన పూర్తి చేయించారు. స్వామి వారి కళ్యాణం కోసం కళ్యాణ వేదికను నిర్మించారు. వకుళ మాత స్టేడియం తెలంగాణ రాష్ట్రంలోనే ఏ ఆలయానికి లేని విధంగా నిర్మాణం పూర్తి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తిరుమల తిరుపతిదేవాలయం తర్వాత తెలంగాణ రాష్ట్రంలో అంతటి ప్రతిష్ఠ కలిగిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం స్వయంభు కావడం విశేషం. దాత తుళ్లూరు కోటేశ్వరరావు ఆయన ధర్మపత్ని నిర్మల కుమారి దంపతులు జమలాపురం గ్రామ నివాసులు కావడంతో దేవాలయ అభివృద్ధికి చాలా ధనాన్ని వ్యయ పరుస్తూ కృషి చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో సప్తమి రోజు స్వామివారి (గ్రామ సేవ) ఊరేగింపు 300 ఎకరాల విస్తీర్ణం కలిగిన తటాకం (పెద్ద చెరువు) నందు తెప్పోత్సవ కార్యక్రమాన్ని విద్యుత్ దీపాల అలంకరణతో నిర్వహిస్తారు. దాత సొంత ఖర్చులతో రెండు పడవలను తెప్పించి విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించి దేవత మూర్తులను పడవలలో ప్రతిష్ఠించి బాణాసంచాను పేలుస్తూ చెరువు లోపల మూడు ప్రదక్షిణలు చేస్తారు. స్వామి వారి గ్రామ సేవ (ఊరేగింపు) ముందు కోయ నృత్యం కోలాటం భజనలు వివధ రకాల వేషధారుణలతో ఊరేగింపు కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహిస్తారు. ఇట్టి కార్యక్రమాలను చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తిలకించి తరించుతారు. తెప్పోత్సవం కార్యక్రమానికి ఆంధ్రతెలంగాణ రాష్ట్రాల నుండి వేలాదిమంది భక్తులు చెరువు వద్దకు వచ్చి తిలకించి తరించుతారు. కళ్యాణ వేదికలో కళ్యాణానికి ప్రతిష్ఠించ వలసిన దేవతా మూర్తులను దాత కోటేశ్వరరావు తిరుమల తిరుపతి దేవస్థానం వద్ద తయారు చేయించారు. కళ్యాణ వేదిక నిర్మాణాన్ని ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు పర్యవేక్షిస్తున్నారు.



పోరాటాల ద్వారానే ప్రజా పునాది నిర్మాణం

నవతెలంగాణ - బోనకల్



ప్రజా పోరాటాల ద్వారానే ప్రజా పునాది నిర్మాణం జరుగుతుందని సీపీఐ(ఎం) మధిర పట్టణ మాజీ కార్యదర్శి పాపినేని రామ నరసయ్య అన్నారు. స్థానిక వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో రెడ్ బుక్ డే సందర్భంగా శుక్రవారం సెమినార్ నిర్వహించారు. సీపీఐ(ఎం) రాజకీయ సమీక్ష నివేదిక, 24వ మహాసభ రాజకీయ తీర్మాన ముసాయిదాపై ఈ సెమినార్ నిర్వహించారు. పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు తెల్లాకుల శ్రీనివాసరావు ఈ సెమినార్‌కు అధ్యక్షుడిగా వ్యవహరించారు. ప్రజా పోరాటాలు నిర్వహించకుండా ప్రజా పునాది సాధ్యం కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేసి ప్రజా పోరాటాల నిర్వహించినప్పుడే ప్రజా పునాది బలపడుతుందన్నారు. ప్రజా సమస్యలు పార్టీ ద్వారానే పరిష్కారం అవుతాయని, సంకేతం క్షేత్రస్థాయిలో ప్రజలలోకి వెళ్లాలన్నారు. ఆ విధంగా పోరాటాలకు రూపకల్పన చేయాలని కోరారు. ప్రధానంగా క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై సర్వే నిర్వహించాలన్నారు. ఆ సర్వే ఆధారంగా ఆ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించినప్పుడే ప్రజలు పోరాటాలలోకి వస్తారన్నారు. పార్టీ డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు మాట్లాడుతూ మతోన్మాద పార్టీలను ఎదుర్కోవాలంటే కమ్యూనిస్టుల వల్లే సాధ్యమైతుందన్నారు. ఈ సెమినార్లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దొండపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి మండల కార్యదర్శి కిలార్ సురేష్, మండల కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సునీత, పసుపులేటి నరేష్, కొమినేని నాగేశ్వరరావు, గుగులోత్ నరేష్, దొప్ప కొరివి వీరభద్రం, నల్లమోతు వాణి, వివిధ గ్రామాల సిపిఎం శాఖా కార్యదర్శులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రజాసంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో 'రెడ్ బుక్ డే'

నవతెలంగాణ-సత్తుపల్లి



సీపీఐ(ఎం) సత్తుపల్లి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రెడ్ బుక్ డేను నిర్వహించారు. స్థానిక రావి వీరవెంకయ్య భవన్‌లో (ప్రజా సంఘాల భవన్) పార్టీ సీనియర్ నాయకులు రావుల రాజబాబు అధ్యక్షతన రెడ్ బుక్ డే సందర్భంగా సమావేశం జరిపారు. ఈ సమావేశంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 1848వ సంవత్సరంలో కార్ల్ మార్క్స్, ఫెడ్రిక్ ఎంగెల్స్ నేతృత్వంలో కమ్యూనిస్టు మేనిఫెస్టో ప్రణాళికను రూపొందించారన్నారు. అప్పటి నుంచి ఆ మేనిఫెస్టోను రెడ్ బుక్‌గా పిలుచుకోవడమే గాక రూపొందించిన రోజును రెడ్ బుక్ డేగా జరుపుకోవడం జరుగుతూ వస్తోందన్నారు. ప్రజలు పడుతున్న వెతలు, వాటి పరిష్కార మార్గాలు, కార్మికులు, రైతులు, నిరుద్యోగులు, వ్యవసాయ కార్మికులు కష్టాలు తదితరాంశాలపై రెడ్ బుక్‌లో పొందు పర్చారన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కొలికిపోగు సర్వేశ్వరరావు, నాయకులు మోరంపూడి వెంకటరావు, ఓలేటి శ్రీహరి, చావా రమేశ్, సప్పిడి భాస్కరరావు, గుదే రాము, మహిళా సంఘ నాయకురాళ్ల పాకలపాటి ఝాన్సీ, చెరుకు రత్నకుమారి పాల్గొన్నారు.

కేసీఆర్ అడుగుజాడల్లోనే రేవంత్ రెడ్డి

- ప్రజా సమస్యలు చెప్పడానికి సీఎం అపాయింట్మెంట్ ఇవ్వడం లేదు
- ఈ ప్రాంతానికి నీరివ్వకుండా జిల్లా మంత్రులు ఎగరేసకపోతున్నారు
- మాజీ ఎమ్మెల్యే, మాస్ లైన్ పార్టీ రాష్ట్ర నాయకుడు గుమ్మడి నరసయ్య

నవతెలంగాణ-ఇల్లందు



ఆరు నెలల నుండి తమ నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని సీఎం కార్యాలయం చుట్టూ తిరిగినా సీఎం కలవకుండా దాటవేత ధోరణి అవలంబిస్తూ కేసీఆర్ అడుగుజాడల్లోనే రేవంత్ రెడ్డి నడుస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే, మాస్ లైన్ పార్టీ రాష్ట్ర నాయకుడు గుమ్మడి నరసయ్య తెలిపారు. ఇల్లందు నియోజకవర్గ నుండి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ ప్రజా, పార్టీ బలమున్న తనను, పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. నియోజవర్గ అభివృద్ధి ప్రజల కోసమే సమస్యలు చెప్పడానికి అపాయింట్మెంట్ అడిగానని అన్నారు. ఆనాటి ముఖ్యమంత్రులు వైయస్ రాజశేఖర్ రెడ్డి, ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి లాంటివారు సమస్య ఉంటేనే నరసన్న వస్తాడని భుజం తడిమి పరిష్కరించే దిశవైపు ఆలోచన చేసిన ముఖ్యమంత్రులను చూశానన్నారు. వారు నీతి, నిజాయితీకి విలువ ఇచ్చిన ముఖ్యమంత్రులు కాబట్టి సమస్యలు పరిష్కరించక పోయినా కలిసి మాట్లాడి కనీసం తెలుసుకునే ప్రయత్నం చేశారని అన్నారు.

సీతారామ ప్రాజెక్ట్ గోదావరి జలాలను ఇల్లందు నియోజకవర్గంతో పాటు మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతానికి నీళ్లు ఇవ్వాల్సినటువంటి ఈ జిల్లా మంత్రులు అధికారంతో ఎగరవేసుకబోతున్నారు. ఈ విషయం తో పాటు ఇక్కడ పోడు సాగు చేసుకుంటున్నా ఆదివాసీ గిరిజనులు, గిరిజనేతరులకు పోడు భూములకు పట్టాలిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆనాడు ఎన్నికల ప్రచారంలో వాగ్దానాలు చేశారని గుర్తు చేశారు. అందుకు కోసం గురువారం సచివాలయానికి వెళ్లితే అపాయింట్మెంట్ కూడా ఇవ్వలేదన్నారు.

వైద్యశాలను తనిఖీ చేసిన డీఎంహెచ్వో

నవతెలంగాణ-సుజాతనగర్



మండల పరిధిలోని స్థానిక ప్రభుత్వ వైద్యశాలను జిల్లా వైద్యాధికారి భాస్కర్ నాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి పలు ఫైళ్లను పరిశీలించారు. 30 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికి బీపీ, షుగర్ వ్యాధి పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని స్థానిక వైద్యులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మధువరన్, స్థానిక వైద్యులు రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు హాలులో దాడికి పాల్పడిన మహిళకు జైలు శిక్ష

నవతెలంగాణ-కొత్తగూడెం లీగల్

కోర్టు హాల్‌లోకి అక్రమంగా ప్రవేశించి దాడికి పాల్పడిన మహిళకు జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏ.సుచరిత శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా... కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో కేసుల కాల్ వర్క్ నిర్వహిస్తుండగా, ఆ సమయంలో పాల్వంచ వెంకటేశ్వర కాలనీకి చెందిన కొడాలి నర్మద కోర్టు హాలులోకి ఒకేసారి దూసుకు వచ్చింది. ఆ సమయంలో వాయిదాకు హాజరైన పాల్వంచ మండలం ఇల్లందుల పాడుకు చెందిన గుగులోత్ మాన్సింగ్‌ను కోర్టులో జడ్జి ముందే ఉండగా దాడి చేసింది. అతని గల్లా పట్టుకొని బూతులు తిడితూ చేతులతో కొట్టుచుండగా న్యాయవాదులు విడిపించారు. ఈ విషయమై అప్పటి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జమలేశ్వరరావు, కోర్ట్ సూపరింటెండెంట్ రషీద్ అలీ ఖాన్‌ను ఆదేశించగా 2017 మార్చి ఒకటో తేదీన రషీద్ అలీ ఖాన్ కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సబ్ ఇన్‌స్పెక్టర్ జి.తిరుపతి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు అనంతరం కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో ఏడుగురు సాక్షులను విచారించారు. నేరం రుజువు కావడంతో ఏడాదిన్నర జైలు శిక్ష, 2000 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ను ఏపిపి గాదె నాగలక్ష్మి నిర్వహించగా కోర్టు నోడల్ ఆఫీసర్, లైజాన్ ఆఫీసర్ డ్యూటీ ఆఫీసర్ సహకరించారు.

ఎమ్మెల్సీగా ఉపాధ్యాయుల పక్షాన నిబద్ధతతో నిలబడ్డాను

- చట్టసభల్లో వారి సమస్యపై గొంతు విప్పిన
- ఒక్క పైసా లేకుండా గెలిపించారు... మరోసారి గెలిపించండి
- శాసన మండలిలో విద్యారంగ సమస్యలపై పోరాడుతా...

విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నవతెలంగాణ-కొత్తగూడెం

ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్సీగా వారి పక్షాన నిబద్ధతతో నిలబడ్డానని, చట్టసభల్లో గొంతు విప్పానని, గత ఎన్నికల్లో ఒక్క పైసా ఖర్చు లేకుండా, ప్రలోభాలకు తావివ్వకుండా నన్ను గెలిపించారు... మరోసారి గెలిపించాలని, శాసన మండలిలో ఇంకా పరిష్కారం కాని పలు విద్యారంగ సమస్యలపై పోరాడుతానని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో టీచర్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గం టీఎస్ యూటీఎఫ్ బలపరిచిన ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, అధ్యాపకుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా చట్టసభల్లో ఉపాధ్యాయులకు ఉన్నా సమస్యలపై గొంతునయ్యానని చెప్పారు. ప్రతి సమస్యనూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేశానన్నారు. నియోజకవర్గ అభివృద్ధి నిధులను (సీడీపీ), ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కోసమే సుమారు 3 దఫాలుగా విడుదల అయిన రూ.9 కోట్లతో విద్యారంగ అభివృద్ధికి ఖర్చు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను అమలు చేయాలి, ఈ-కుబేర్లో పెండింగ్ బిల్లులను చెల్లించాలి, నాలుగు డీఏలను మంజూరు చేయాలనే డిమాండ్లను బలంగా వినిపించానన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ వరకు విస్తరించాలని, కేజీబీవీ, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఉపాధ్యాయులకు మినిమం టైంస్కేల్‌ను ఇవ్వాలని, మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు కింద వేతనాలను చెల్లించాలని, 317 జీవో బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని పోరాడుతున్నానని తెలిపారు. అందుకే నాకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి రెండోసారి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు.

"2019లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటిసారి నేను పోటీ చేశాను. గెలిపించారు. ఈ ఆరేండ్ల కాలంలో నా పనితీరును గమనించారు. గెలిచిన తర్వాత నేను ఉపాధ్యాయుల పక్షాన నికరంగా నిలబడ్డాను. నిజాయితీ, నిబద్ధతతో ఉన్నాను. ప్రతి సమస్యనూ సమర్థవంతంగా ప్రాతినిధ్యం చేశానని, పీఆర్సీ 2020లో 30 శాతం ఫిట్మెంట్ ఇప్పించడంలో, దాన్ని రెగ్యులర్ ఉద్యోగులతోపాటు కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వర్తింపజేయడంలో నేను కీలక పాత్ర పోషించాను" అని చెప్పారు. దీంతో 20 వేలకుపైగా ఉపాధ్యాయులకు పదోన్నతులు వచ్చాయి. 35 వేల మంది ఉపాధ్యాయులకు బదిలీలు కూడా జరిగాయన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు నిర్వహించడంలోనూ నా కృషి ఉందన్నారు. పీఆర్సీ ప్రకారం 30 శాతం జీతాల పెంపుదలకు కృషి చేశానని, వేసవి కాలం జీతాలు వచ్చేటట్లు చేశానని, మోడల్ స్కూల్ టీచర్ల ప్రతీ సమస్య పరిష్కారంలో, ఉన్నత విద్యారంగమైన ఇంటర్, డిగ్రీ, విశ్వవిద్యాలయాల అధ్యాపకుల సమస్యల పరిష్కారంలో నా కృషి ఉందని గుర్తు చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం గురుకులాల పేరు చెప్పి ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసింది, బడ్జెట్‌ను కూడా 6.5 శాతానికి తగ్గించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొంచెం భిన్నంగా కనిపిస్తున్నదన్నారు. ఈ ఏడాది బడ్జెట్లో విద్యకు 7.5 శాతం నిధులను కేటాయించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్నట్టు విద్య బడ్జెట్‌ను 15 శాతానికి పెంచాలన్నారు. తొమ్మిదేండ్ల నుంచి ఉపాధ్యాయులకు పదోన్నతులు లేకపోవడం వల్ల, ఉన్నత పాఠశాలల్లో బోధనా సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ అప్గ్రేడ్ అయిన పండితులు 20 వేలకుపైగా ఉపాధ్యాయులకు పదోన్నతులను కల్పించింది, డీఎస్సీ ద్వారా 10 వేలకుపైగా పోస్టులను అతి తక్కువ కాలంలో భర్తీ చేసిందని తెలిపారు. వెయ్యికిపైగా కుటుంబాలకు రూ.4 కోట్లు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఇప్పించానన్నారు.

ఈ-కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, బకాయిపడ్డ నాలుగు డీఏలను విడుదల చేయాలి., కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల్లోని ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్డులివ్వాలి. కేజీబీవీ టీచర్లకు గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని కాంట్రాక్టు ఉపాధ్యాయులకు మినిమం టైంస్కేల్ అమలు చేయాలని కోరారు. గురుకులాలకు సొంత భవనాలను నిర్మించాలని, ఉపాధ్యాయులకు నివాస సముదాయాలను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు నిర్వహణ గ్రాంటును రూ.2 లక్షలకు తగ్గకుండా ఇవ్వాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రూ.10 లక్షల వరకు ఇవ్వాలన్నారు. విశ్వ విద్యాలయాల్లో కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి. జూనియర్, డిగ్రీ కాలేజీల్లో మిగిలిపోయిన కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. కొత్త జిల్లాలకు డీఈవో పోస్టులను, డీఐఈవో పోస్టులను, కొత్త మండలాలకు ఎంఈవో పోస్టులను మంజూరు చేయాలన్నారు. ఎంఈవో, డిప్యూటీఈవో, డీఈవో, డైట్ లెక్చరర్ల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, పలు సమస్యలు పరిష్కారం చేయాల్సి ఉందన్నారు. వాటిని పరిష్కరించేందుకు మరో సారి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామాచారి, టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.హరిలాల్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.రాజయ్య, కోశాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, (ఎస్‌వి) రెసిడెన్షియల్ స్కూల్స్ సంఘం రాష్ట్ర కోశాధికారి ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలి

- జిఎం(పర్సనల్) వెల్ఫేర్, ఐఆర్ అండ్ పిఎం కవితా నాయుడు
- రెండు రోజుల పాటు కోల్ ఇండియా స్థాయి మహిళా, పురుషుల అథ్లెటిక్స్ పోటీలు

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెంలో జరిగే కోల్ ఇండియా స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వచ్చే క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సింగరేణి జిఎం (పర్సనల్) వెల్ఫేర్, ఐఆర్ అండ్ పీఎం కవితా నాయుడు అన్నారు. శుక్రవారం కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగిన కోల్ ఇండియా స్థాయి మహిళా, పురుషుల అథ్లెటిక్స్ పోటీల ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సింగరేణి కాలరీస్ కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో 22, 23 తేదీలలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి కోల్ ఇండియా స్థాయి మహిళా, పురుషుల అథ్లెటిక్స్ పోటీలను సింగరేణి కార్పొరేట్ ఏరియా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ పోటీలకు కోల్ ఇండియా పరిధిలోని మొత్తం 10 బొగ్గు సంస్థల జట్లలో సీఐఎల్ మినహా 9 బొగ్గు సంస్థల జట్లు అయిన సింగరేణి, బీసీసీఎల్, సిసిఎల్, సిఎంపిడిఐ, ఈసిఎల్, ఎన్‌సిఎల్, ఎస్ఈసిఎల్, ఎంసిఎల్, డబ్ల్యూసిఎల్ జట్ల నుండి 284 క్రీడా కారులు పాల్గొంటారని చెప్పారు. మహిళలు 107 మంది, పురుషులు 177 మంది పాల్గొంటారన్నారు. ఇందో 38 విభాగాలలో మహిళా, పురుషుల క్రీడాకారులు వివిధ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. 22వ తేదీన జరిగే వేడుకలను సింగరేణి సంస్థ ఈఅండ్ఎం డైరెక్టర్ డి.సత్యనారాయణ రావు లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. 23వ తేదీ ఆదివారం జరిగే ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ హాజరు కానున్నట్లు తెలిపారు. విజేతలకు చైర్మెన్ చేతులమీదుగా ట్రోఫీల ప్రదానం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమములో ఏజిఎం (ఈఅండ్ఎం) పి.రాజీవ్ కుమార్, డిజిఎం (పర్సనల్)లు జి.రాజేంద్ర ప్రసాద్, బి.రాజ గోపాల్, డిజిఎం (సివిల్) పి.రాజశేఖర్, డివై.పిఎంలు బి.సుశీల్ కుమార్, జి.కే.కిరణ్ కుమార్, కమ్యూనికేషన్ ఆఫీసర్ టి.శ్రీనివాస రావు, స్పోర్ట్స్ సూపర్ వైజర్ ఎంసి.పోస్నెట్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు దోచుపెట్టే బడ్జెట్

- ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ పాపారావు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



జీఎస్టీ పేరుతో ప్రజలపై పన్నులు వేసి వారి సంపదను కొల్లగొట్టి కార్పొరేట్లకు దోచి పెట్టే పద్ధతిలో కేంద్ర బడ్జెట్ ఉందని ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ పాపారావు అన్నారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబి నర్సారెడ్డి అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రయివేటీకరణకు ఊతమిచ్చే పద్ధతులో ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా పారిశ్రామిక ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోయిందని, నిరుద్యోగం పెరిగిపోయిందని అన్నారు. దేశవ్యాప్తంగా పేదరికం నిరుద్యోగం అసమానతలు తీవ్రంగా పెరిగాయని చెప్పారు. ఈ బడ్జెట్ కొద్దిమంది ఇన్కమ్ టాక్స్ కట్టే వారికి మినహా తప్పా, మిగతా జనాభా మొత్తానికి వ్యతిరేకమైన బడ్జెట్ అని అన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పెరిగినప్పుడే పారిశ్రామిక రంగాలు అభివృద్ధి అవుతాయని, అలాకాకుండా కేవలం కార్పొరేట్లకు రాయితీలు ఇస్తే ఉత్పత్తి, అభివృద్ధి కాదని అన్నారు. కార్మికులు, రైతులు, పేదలు ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సదస్సులో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మాచారి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు యలమంచి వంశీకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం స్వామి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు నాదెళ్ల లీలావతి, గిరిజన సంఘం పట్టణ కార్యదర్శి కుంజా శ్రీనివాస్, కేవీపీఎస్ జిల్లా నాయకులు కోరాడ శ్రీనివాస్, డీవైఎఫ్ఐ నాయకులు పి.సంతోష్ కుమార్, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు జీఎస్ శంకర్రావు, బిబిజి తిలక్, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో నేలకొరిగిన మొక్కజొన్న

నవతెలంగాణ-టేకులపల్లి



మండలంలో శుక్రవారం సాయంత్రం వచ్చిన అకాలవర్షంతో మొక్క జొన్న నేలకొరిగింది. బేతంపూడి, తడకలపూడి, కోయగూడెం, గంగారం, కిష్టారం, లచ్చగూడెం, తుమ్మల చిలక, కోటాల, అందులగూడెం తదితర గ్రామాలలో గాలి, దుమ్ము, వర్షం ప్రభావంతో నేలకొరిగిన వందల ఎకరాల మొక్కజొన్న, మిర్చి కల్లాలల్లో ఆరబోసిన పంటకు తీవ్ర నష్టం వాటిలినట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆయిల్ ఫెడ్ డీఓ సస్పెండ్

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఆయిల్ ఫెడ్ అశ్వారావుపేట డివిజనల్ అధికారి బాలకృష్ణను సస్పెండ్ చేస్తూ తెలంగాణ నూనె గింజల ఉత్పత్తిదారుల సహకార సమైక్య లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ యాస్మిన్ భాష గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రేగళ్లపాడు నర్సరీలో 80 వేల ఆయిల్ ఫాం మొక్కలను అనుమతి లేకుండా ధ్వంసం చేసిన ఘటనపై ఈ నిర్ణయం తీసుకున్నట్లు శుక్రవారం ఆయిల్ ఫెడ్ జనరల్ మేనేజర్ ధృవీకరించారు.

యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-ఇల్లందు

పట్టణంలోని 12వ వార్డు ఆర్ఆర్ కాలనీలో జక్కుల వెంకటేష్(22) గురువారం రాత్రి ఆర్ఆర్ కాలనీలోని అమ్మమ్మ ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మద్యానికి బానిసై, ఇంట్లో గొడవలు పెట్టుకుని గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని తెలిపారు. సంఘటన స్థలాన్ని సీఐ బత్తుల సత్యనారాయణ పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ సత్యనారాయణ తెలిపారు.

దమ్మపేటలో సీపీఐ(ఎం) మండల కమిటీ సంయుక్త సమావేశం

నవతెలంగాణ-దమ్మపేట



దమ్మపేట సుందరయ్య భవన్‌లో సీపీఐ(ఎం) మండల కమిటీ శాఖా కార్యదర్శుల సంయుక్త సమావేశం మండల కమిటీ సభ్యులు మారంపూడి కేశవరావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా సెక్రటేరియట్ మెంబర్ కొక్కెరపాటి పుల్లయ్య హాజరై మాట్లాడారు. రెడ్ బుక్ డే సందర్భంగా మండల కమిటీ సభ్యులు శాఖా కార్యదర్శులు అందరూ పార్టీ 24వ మహాసభ రాజకీయ తీర్మానం, ముసాయిదా 2025 జనవరి నెల 17, 19 తేదీల్లో కలకత్తాలో సమావేశమై ఆమోదించిన పుస్తకాన్ని అందరూ చదివి మార్చి 5వ తేదీ నాటికి సవరణలో జాతీయ పార్టీ కమిటీకి పంపించాలని సభ్యులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యులు మొరంపూడి శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు పిట్టల అర్జునరావు, మాజీ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు ఎంద్రాతి అప్పారావు, పిల్లి నాయుడు, ఆంబోతు చెన్నకేశవులు, రావుల శోభన్‌బాబు, కొలికిపోగు శ్రీనివాసరావు, కొప్పుల శ్రీనివాసరావు, సిహెచ్ బ్రహ్మయ్య, కోరం గోపిరాజు, తంగెళ్ళమూడి రమేష్, మొడియం వెంకటేశ్వరరావు, పెనుబల్లి ప్రశాంత్, మల్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.

"చంద్రబాబును అడ్డుకునే అధికారం మీకు లేదు"

నవతెలంగాణ-దమ్మపేట

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని తెలంగాణలో అడ్డుకునే అధికారం బీఆర్ఎస్ నాయకులకు లేదని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఎండి వలీపాషా పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీఆర్ఎస్ నుండి బిఆర్ఎస్‌గా ఏర్పాటు అయినప్పుడే తెలంగాణసెంటిమెంట్ కోల్పోయిన పార్టీ మీది అని గుర్తుచేశారు. తెలంగాణ సెంటిమెంట్ మీద టిడిపి ఆంధ్ర పార్టీ అని ప్రచారం చేస్తూ పదేళ్ళు మీరు అధికారం అనుభవించారన్నారు. గత ఎన్నికలలో చంద్రబాబు మౌనంగా ఉంటేనే అధికారం కోల్పోయిన సంగతి గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు బీఆర్ఎస్ వాళ్లకు గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు కట్టం ఎర్రప్ప, తెలుగు రైతు అధ్యక్షులు గడ్డిపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంతరించి పోతున్న భాషలన్నింటినీ రక్షించుకోవాలి

- కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు ప్రసేన్
- సింగరేణి మహిళా కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కొత్తగూడెం

మానవాలి పాశ్చాత్య పోకడలతో అంతరించి పోతున్న భాషలన్నింటినీ రక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని ప్రముఖ కవి, జర్నలిస్టు, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు ప్రసేన్ ఉద్ఘాటించారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవ రజతోత్సవ వేడుకలను సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ అధ్యక్షతన, సింగరేణి కాలరీస్ డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ కె.సునీల్ కుమార్ పర్యవేక్షణ జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవి, జర్నలిస్టు, కేంద్రసాహిత్య అకాడమీ సభ్యులు ప్రసేన్ మాట్లాడుతూ మాతృ భాష నేర్చుకోకుండా ఇతర భాషలను మాత్రమే నేర్చుకోవడం అసాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల తెలుగు అధ్యాపకురాలు పి.స్వప్న పాల్గొన్నారు.

లౌకికతత్వ ప్రజాస్వామ్యవాదులు ఏకం కావాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.బ్రహ్మాచారి

నవతెలంగాణ-దుమ్ముగూడెం



దేశంలో బీజేపీ ముందుకు తెస్తున్న హిందూత్వ ఎజెండాను అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా లౌకికతత్వ ప్రజాస్వామిక శక్తులందరూ ఏకం కావాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ కే. బ్రహ్మాచారి పిలుపునిచ్చారు. శుక్రవారం ములకపాడు యలమంచి సీతారామయ్య భవన్‌లో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కారం పుల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ రెడ్ బుక్ డే కార్యక్రమంలో బ్రహ్మాచారి పాల్గొని మాట్లాడారు. కుల అణిచివేతకు, వివక్షతకు వ్యతిరేకంగా పోరాటాన్ని పార్టీ చురుకుగా చేపట్టాలన్నారు. మోడీ ప్రభుత్వపు అమెరికా అనుకూల విదేశాంగ విధానాన్ని అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని వ్యతిరేకిస్తూ భారతదేశ ప్రజానీకంలో సామ్రాజ్యవాద వ్యతిరేక సైన్యాన్ని పెంచడానికి పార్టీ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం) పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, కొర్స చిలకమ్మ, చర్ల పార్టీ మండల కార్యదర్శి మచ్చా రామారావు, దొడ్డి హరినాగ వర్మ, మర్మం సమ్మక్క, ఈసన్నపల్లి మల్లారం, ముర్రం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు

రక్తదానంతో ప్రాణదాత అయ్యాడు

నవతెలంగాణ-అశ్వాపురం




మండల కేంద్రంలో ఓ ప్రయివేటు పాఠశాల నిర్వహిస్తున్న రవీంద్ర పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ దొడ్డ రమేష్ ఆపదలో ఉన్న ఎంతో మందికి రక్తదానం చేసి ప్రాణదాత అవుతున్నాడు. శుక్రవారం భద్రాచలంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగికి రక్తం కావాలని అడిగిన వెంటనే స్పందించి రక్తదానం చేశాడు. ఇలా ఒక్కసారి కాదు ఎంతోమంది ఆపదలో ఉన్న వారికి ఇప్పటివరకు 16 సార్లు రక్తాన్ని దానంగా ఇచ్చి పలువురి మన్ననలు పొందుతున్నాడు.

మంచినీటి సమస్య ఉందా..

- ఈ నెంబర్ కు ఫోన్ చేయండి.. : కలెక్టర్ జితేష్ వి. పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ



తాగునీరు రాకపోయినా, పైప్ లీకేజీ ఉన్న ఫోన్ చేయడం ద్వారా సమస్యను పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్యల పరిష్కారానికి అయినా మంచినీటి సమస్య తలెత్తి అధికారులు నిర్లక్ష్యం వహించినా, అధికారులకు తెలియక నీళ్లు రాకపోయినా ప్రజలు ఇబ్బంది పడవద్దని ఐడిఓసి కార్యాలయంలో ప్రత్యేకంగా 08744 241950 ద్వారా ఫిర్యాదులు స్వీకరించి తక్షణమే వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఫోన్ కాల్ ద్వారా వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్ ను ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయిలో టోల్ ఫ్రీ 1800 5994007 నెంబర్ కు కూడా ఫిర్యాదు చేయొచ్చని ఆయన తెలిపారు. ఏదైనా గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడితే స్థానిక అధికారుల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేయవచ్చు అని అన్నారు. మీ ఫిర్యాదు రాష్ట్ర కార్యాలయంలో రికార్డ్ అవుతుందని తర్వాత అక్కడి అధికారులు ఆ సమస్యను సంబంధిత జిల్లా గ్రామీణ నీటి సరఫరా అధికారికి తెలుపుతారన్నారు. ఆ అధికారి సంబంధిత అధికారిని క్షేత్రస్థాయికి పంపి సమస్య పరిష్కారానికి కృషిచేస్తారని అన్నారు. సమస్య పరిష్కారమైన తర్వాత ఆ విషయాన్ని జిల్లా అధికారి తిరిగి రాష్ట్ర కార్యాలయానికి తెలుపుతారు. టోల్ ఫ్రీ నంబర్ కార్యాలయం అధికారులు ఫిర్యాదుదారునికి ఫోన్ చేసి సమస్య పరిష్కారమైందా లేదా? అని ధ్రువీకరించుకుంటారు అని కలెక్టర్ తెలిపారు.

ఎస్సీ ప్రజల మానప్రాణాలను కాపాడండి

- నేషనల్ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ జి.సునీల్ కుమార్‌కి వినతి
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్

నవతెలంగాణ-కొత్తగూడెం

దేశవ్యాప్తంగా ఎస్సీ ప్రజల మాన, ప్రాణాలను కాపాడాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ కోరారు. శుక్రవారం హైదరాబాదులో నేషనల్ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ ఆఫీసులో నేషనల్ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ జి.సునీల్ కుమార్ బాబుని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడారు. దేశ, రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీలపై అనేక అఘాత్యాలు, అక్రమంగా దాడులు, అన్యాయంగా యువతపై అక్రమ కేసులు, ఎస్సీ మహిళల భూములను ఎమ్మెల్యేల అండదండలతో అక్రమంగా ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. విద్యార్థినిల మేజర్ వయసు 21 సంవత్సరాలకు పెంచే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, పార్లమెంట్లో చట్టం తీసుకురావాలని కోరారు. ఇటీవల బూర్గంపాడు కస్తూరిబా బాలిక పాఠశాలల నుంచి అదృశ్యమైన బాలిక ఆచూకీ ఇప్పటికీ పోలీసులు కనిపెట్టలేకపోయారని కమిషన్ కి ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో ఎస్సీ కమిషన్ డాక్టర్ సునీల్ కుమార్ బాబు వెంటనే స్పందించారని శివశంకర్ ప్రకటనలో తెలిపారు.



మిర్చి పంటకు కనీస మద్దతు ధర రూ.25 వేలు ఇవ్వాలి

నవతెలంగాణ-చంద్రుగొండ

మిర్చి పంటకు కనీసం మద్దతు ధర రూ.25 వేలు ఇవ్వాలని రైతు సంఘం మండల అధ్యక్షులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల రైతు సంఘం నాయకులు మిర్చి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మిర్చి కల్లాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ 2017 నుంచి తామర, వైరస్ మిర్చి పంటపై తీవ్ర ప్రభావం ఉందని, దీని ద్వారా దిగుబడి తక్కువ, ఖర్చు ఎక్కువ అవుతుందని తెలిపారు. ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ కూలీలు, ట్రాక్టర్ ఖర్చులకు మాత్రమే సరిపోతుందని ప్రభుత్వం వెంటనే రాయితీ రూపంలో మిర్చి పంటను కొనుగోలు చేయాలన్నారు. మిర్చి మార్కెట్ కంపెనీని ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. లేకపోతే రైతాంగమంతా నష్టపోయే అవకాశం ఉందని అన్నారు. మద్దతు ధర కల్పించకపోతే రాబోయే రోజుల్లో రైతాంగాన్ని ఐక్యం చేసి రైతాంగ ఉద్యమాలు నిర్మిస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు, రాయి రాజా, చల్లపల్లి రాజా, దడిగల శ్రీను, ఎలమందల లక్ష్మణ్, బడుగు సురేష్, అంతటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాయం వెంకటేశ్వర్లుకు ఘన సన్మానం

నవతెలంగాణ-మణుగూరు



జై సింగరేణి 14 టైర్స్ టిప్పర్ ఓనర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు, అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, సెక్రటరీ నాగభూషణం, ట్రెజరర్ శాంతి కుమార్ కమిటీ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. మణుగూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రజా భవన్ నందు పాయంని కలిసి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పిరినకి నవీన్, మండల నాయకులు, 14 టైర్ టిప్పర్ ఓనర్స్, యువజన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రేపు 5వ తరగతి ప్రవేశ పరీక్ష

- పిన్సిపాల్ రత్న కుమారి

నవతెలంగాణ-ఇల్లందు

మండలంలోని సుదిమల్ల గిరిజన గురుకుల బాలికల కళాశాలలో 23న ఆదివారం 5వ తరగతి ప్రవేశ పరీక్ష జరగనున్నట్లు ప్రిన్సిపాల్ పి.రత్న కుమారి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 6,7,8,9 తరగతులకు మిగిలిపోయిన సీట్లలో పరీక్ష జరగనున్నట్లు పేర్కొన్నారు. సుభాష్ నగర్ ఇల్లందు కరెంట్ ఆఫీస్ వెనుక భాగంలో గిరిజన గురుకుల బాలికల కళాశాల ఉంటుందని హాల్ టికెట్‌లోనే అన్ని వివరాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. 11 గంటల నుండి ఒంటిగంట వరకు ప్రవేశ పరీక్ష జరగనున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్ నెంబర్ 9490957282, 9652528303కు సంప్రదించాలని తెలిపారు.

మార్కెట్ సబ్ యార్డును సందర్శించిన విద్యార్థులు

నవతెలంగాణ-టేకులపల్లి

పీహెచ్‌డీ రీసెర్చ్ వర్క్ కోసం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు శుక్రవారం ఇల్లందు మార్కెట్ కమిటీ అదీనంలో గల టేకులపల్లి మార్కెట్ సబ్ యార్డును సందర్శించినట్టు సిబ్బంది తెలిపారు. రైతులు పండించే పంటలు, వారికి వచ్చే దిగుబడి, ధరలు వివరాలను విద్యార్థులు రైతులను అడిగి తెలుసుకున్నారు. అక్కడున్న మార్కెటింగ్ అధికారులు విద్యార్థులకు అమ్మకాలు, కొనుగోళ్లు, పండించి మార్కెట్కు తీసుకొచ్చే విధానాన్ని వివరించారు.

విద్యార్థి దశ నుండే పోటీ తత్వాన్ని పెంపొందించుకోవాలి

నవతెలంగాణ-మణుగూరు

విద్యార్థి దశ నుండే పోటీ తత్వాన్ని పెంపొందించుకోవాలని హెచ్ఎం జి.నాగశ్రీ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మణుగూరు కో ఎడ్యుకేషన్ స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో నాగశ్రీ అధ్యక్షతన జరిగిన ఎఫ్ఎల్ఎన్ ప్రతిభ పాటవా బాలమేళా పోటీలలో 3వ స్థానంలో నిలిచిన మూడవ తరగతి విద్యార్థిని కనితి శైలజాకు పాఠశాలలో ప్రోత్సాహక బహుమతులు అందించి, మాట్లాడారు. విద్యార్థినీ, విద్యార్థులు తమ ప్రతిభను చాటేందుకు ఇలాంటి బాలమేళా పోటీలు ఉపయోగపడతాయని, విద్యార్థులలో ఉన్న నైపుణ్యాలు, సృజనాత్మక శక్తిని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మీరా హుస్సేన్, సారయ్య, రుక్మిణి, సరిత, రేగా విజయలక్ష్మి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

బొగ్గు పుట్టిల్లు ఇల్లందును కాపాడండి

- ప్రభుత్వం, గుర్తింపు సంఘం పట్టించుకోవాలి
- టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ రంగనాథ్

నవతెలంగాణ-ఇల్లందు



పాతవి మూతబడుతూ, కొత్త బావులు రాక బావురు మంటోందని బొగ్గు పుట్టిల్లును కాపాడాలని టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ రంగనాథ్, వైస్ ప్రసిడెంట్ జఫర్ హుస్సేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడారు. బొగ్గు పుట్టిల్లు నేడు నీరసంచిందని ఉత్పత్తితో కళకళ లాడి, వేలాది మందికి ఆశ్రయమిచ్చిన పుట్టిల్లు నేడు బావురుమంటుందని అన్నారు. మార్చి నెలతో జెకే ఓసి జీవిత కాలం ముగుస్తుందని పూసపల్లి ఓసి పూర్తి స్థాయి పర్మిషన్లు రాకపోవడంతో ఎప్పుడు ప్రారంభం అవుతుందో చెప్పలేని దుస్థితిలో ఉందన్నారు. ఈ పరిస్థితిలో కార్మికుల సర్దుబాటు తప్పక పోవచ్చని, కొందరికి స్థాన చలనం ఉంటుందన్న వార్త కార్మిక కుటుంబాలను కల వరపెడుతుందన్నారు. గతంలో ట్వంటీ ఇంక్లెయిన్ గని బొగ్గులేదని మూసివేసే సమయంలో కేవలం కార్మికులను కాపాడటం కోసం మూడు సంవత్సరాలు ఉత్పత్తి సరిగ్గా రాకున్నా ఈ ప్రాంత మనుగడకోసం, పుట్టిల్లును కాపాడటం కోసం కార్మికులు ట్రాన్స్ఫర్ కాకుండా గత బీఆర్ఎస్ టీబీజీకేస్, నాటి ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ఈ ప్రాంతంలో ప్రవేట్ బొగ్గు కాంట్రాక్టర్లు రాకుండా అడ్డుకున్నామన్నారు. ఈ ప్రాంత సమస్యలు కార్మికులు అభిమానంతో గెలిపించిన కార్మిక సంఘం, అధికార పార్టీ పట్టించుకొని పరిష్కరించాలని టీబీజీకేఎస్ డిమాండ్ చేస్తుందన్నారు.

ఉపాధితో భరోసా గ్యారంటీ

- డీఆర్డీఏ అదనపు పీడీ రవి

నవతెలంగాణ-అశ్వారావుపేట



మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధితో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా గ్యారంటీ అని, నిరుపేద కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొని పథకానికి అర్హులుగా నమోదు చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి పథకం అదనపు సంచాలకులు నల్లబోతుల రవి కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన సమయం పని చేస్తే కనీస వేతనం అందుతుందని సూచించారు. మండలంలోని పండువారిగూడెం, ఊట్లపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పండువారిగూడెంలో ఫాం పాండ్ పనులను పరిశీలించి కూలీల హాజరును తనిఖీ చేశారు. పనుల్లో నాణ్యత, నిర్వహణ పై ఈజీఎస్ సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఊట్లపల్లి పంచాయతీ నర్సరీని సందర్శించారు. మొక్కల నాణ్యత, నర్సరీలు నిర్వహణను పరిశీలించారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీశాంత్, ఈజీఎస్ టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.

విద్యార్థుల సామర్థ్యం పెంపునకు ఉద్దీపకం వర్క్ బుక్స్, వేదిక్ మ్యాథ్స్

- ఐటీడీఏ పీవో బి.రాహుల్

నవతెలంగాణ-దుమ్ముగూడెం



గిరిజన విద్యార్థినీ, విద్యార్థులకు ఇంగ్లీష్, గణితంలో కనీస సామర్థ్యాలలో నైపుణ్యాలు పెంపొందింప చేసి వారి విద్యను బలోపేతం చేయడానికి ఉద్దీపకం వర్క్ బుక్స్, వేదిక్ మాథ్స్‌ను ప్రవేశపెట్టడం జరిగిందని, దానిని ఉపాధ్యాయులు విద్యార్థినీ, విద్యార్థులకు అర్థమయ్యేలా ఆచరణలో పెట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. శుక్రవారం మండలంలోని రామచంద్రుని పేట, రేగుబల్లి-2, ఏజీహెచ్ఎస్ ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించి, ఉద్దీపకం వర్క్ బుక్స్, వేదిక్ మాథ్స్ సంబంధించిన పాఠ్యాంశాలను విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నది, పిల్లలను అడిగి వారి చేత బోర్డుపై రాయించి ఒక్కొక్క విద్యార్థిని లేపి వర్క్ బుక్‌లోని సారాంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3 నుండి 5వ తరగతి వరకు చదువుతున్న గిరిజన పిల్లలు ఇంగ్లీష్ గణితం చదవడం రాయడంలో వెనుకబడి పోతున్నందున గణితంలో గణిత ప్రాథమిక స్థాయి సంఖ్యల నుండి కూడికలు, తీసివేతలు, గుణకారాలు, బాగా హారాలు వాటికి సంబంధించిన కృత్యాలు, చిత్రాలతో విద్యార్థి పాఠశాలల్లో ఆనందంగా ఆహ్లాదంగా నేర్చుకొనుటకు అనుకూలంగా రూపొందించామని అన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు పిల్లల చేత పుస్తకములోని కృత్యాలను తెలియజేసి బోర్డుపై రాయించి పిల్లల చేత చెప్పించాలని అన్నారు. ఈ సందర్భంగా పీఓ వేదిక్ మ్యాథ్స్ తరగతిని పరిశీలించారు. గణితం సబ్జెక్టు పై భయాన్ని పోగొట్టడానికి వేదిక్ మాథ్స్ ప్రత్యేకంగా ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. రామచంద్రుని పేట ఏజీహెచ్ఎస్ పాఠశాలలో ఏడవ తరగతి పిల్లలతో వేదిక మ్యాథ్స్ సంబంధించిన సారాంశాలను పిల్లల చేత చేయించి, తరగతి గదిలో పిల్లలతో కూర్చొని వేదిక్ మ్యాథ్స్ సబ్జెక్ట్‌ను బోధిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. అనంతరం ఫిజిక్స్ ల్యాబ్ బయో సైన్స్ ల్యాబ్ పరిశీలించి అవసరమైన సామగ్రి పంపిణీ చేస్తామని అన్నారు. రేగుబల్లి-2 ఏజీహెచ్ఎస్ పాఠశాలకు త్రీఫేస్ కరెంటు, సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం ఏమైనా మైనర్ రిపేర్‌లో ఉంటే తప్పకుండా చేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రుని పేట పాఠశాల హెచ్ఎం బట్టు రాములు, రేగుబల్లి-2 పాఠశాల హెచ్ఎం భారతమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఠాణాను సందర్శించిన ఎస్పీ

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



ఇల్లందు సబ్ డివిజన్ పరిధిలోని ఆళ్ళపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఎస్పీ రోహిత్‌రాజ్ సందర్శించారు. అందులో భాగంగా ఆళ్ళపల్లి ఠాణాలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులను మండలంలోని ప్రజల ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి, అట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. సైబర్ క్రైమ్స్ పట్ల అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తూ, ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అదేవిధంగా నిషేధిత మావోయిస్టుల కదలికలపై కూడా ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి, తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. అనంతరం ఎస్పీ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరిస్తామని కృషి చేస్తానని తెలిపారు. ఎస్పీ వెంట ఇల్లందు డీఎస్పీ చంద్రభాను, టేకులపల్లి సీఐ టి.సురేష్, ఎస్సై ఈ.రతీష్, ఏఎస్ఐలు వెంకట్ రెడ్డి, వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్‌లు కృష్ణమూర్తి, రాజేశ్వరరావు, టీఎస్ఎస్పీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



ప్రతి ఆటోకి నెంబర్ కచ్చితంగా ఉండాలి : సీఐ

- 1500 స్టిక్కర్లు ఉచితంగా అందించిన ఎస్పీ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ప్రతి ఆటోకి కచ్చితంగా నెంబర్ ప్లేట్‌తో పాటు టాప్ నెంబర్ కలిగి ఉండాలని భద్రాచలం పట్టణ సీఐ బరపాటి రమేష్ స్పష్టం చేశారు. శుక్రవారం ఎస్పీ రోహిత్ రాజ్ సహకారంతో పట్టణంలోని 1500 ఆటోలకు ఉచితంగా నెంబర్ స్టిక్కర్లను సీఐ చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు. ప్రయాణికుల రక్షణ బాధ్యత ఆటో డ్రైవర్ల దేనని అన్నారు. భద్రాచలం పవిత్ర పుణ్యక్షేత్రమైన నేపథ్యంలో దేశ నలుమూలల నుండి యాత్రికులు వస్తుంటారని వారికి భద్రాచలం పట్ల గౌరవం మర్యాదలు పెరిగే విధంగా ఆటో డ్రైవర్ నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ మధు ప్రసాద్, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి దారీ విధానానికి ప్రత్యామ్నాయం కమ్యూనిజమే

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరాజు

నవతెలంగాణ-ఇల్లందు



పెట్టుబడి దారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం కమ్యూనిజమేనని, మార్క్సిజం అజేయమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లిక్కీ బాలరాజు అన్నారు. స్థానిక ఏలూరిభవన్‌లో ఇల్లందు, టేకులపల్లి పార్టీ మండల కమిటీల ఆధ్వర్యంలో మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన రెడ్ బుక్ డే సందర్భంగా కమ్యూనిస్టు ప్రణాళికను సామూహిక పుస్తక పఠనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లిక్కి బాలరాజు పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో ఆర్థిక మాంద్యంతో, కరువు, నిరుద్యోగం, దారిద్ర్యం అధికమైన చోట పెట్టుబడి దారీ వ్యవస్థ అంతమొంది కమ్యూనిస్టు ఎర్రజెండా రెప రెప లాడుతుందని అన్నారు. ప్రపంచ దేశాలకు భిన్నంగా మన దేశంలో పెట్టుబడి దారీ, ఫాసిస్టు తరహాలో కార్పోరేట్ అనుకూల వైఖరి గల పచ్చి మతవాద బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదన్నారు. దానికి ప్రత్యామ్నాయంగా వామపక్ష లౌకిక ప్రజాతంత్ర శక్తులను ఐక్యం చేసి వామపక్ష లౌకిక ప్రజాతంత్ర సంఘటనను ఏర్పాటు చేయ వలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఏప్రిల్ నెల మొదటి వారం మదురైలో పార్టీ అఖిలభారత 24వ మహాసభలలో జాతీయ అంతర్జాతీయ పరిస్థితులపై అధ్యయనం చేసి కార్మిక కర్షక ప్రజా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను జాతీయ పార్టీ రూపొందించనున్నదని ఆయన అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పార్టీ శ్రేణులు పని చేయాలని పార్టీ జిల్లా నాయకులు అబ్దుల్ నబీ కోరారు.

ఈ కార్యక్రమంలో టేకులపల్లి పార్టీ మండల కార్యదర్శి ఈసం నరసింహారావు, పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్ రావు,పార్టీ మండల కమిటీ సభ్యులు, మాదారపు వెంకటేశ్వర్లు, కల్లేపల్లి మరియా, మహమూద్, తాళ్లూరి పద్మ, తాండ్ర కాంత, కామ నాగరాజు, సత్యనారాయణ కోరి, రమేష్, మన్యం మమత, భద్రు, బాబు, వీరయ్య, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థలలో అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవం వేడుకలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల ఆవరణలో ఘనంగా మాతృభాషా దినోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్లైన మాగంటి శ్రీనివాస వరప్రసాద్, మాగంటి రమేష్ బాబులు మాట్లాడుతూ. మాతృ భాషను కన్నతల్లి వలె గౌరవించాలని కోరారు. ప్రపంచంలో రోజురోజుకీ ఎన్నో భాషలు కనుమరుగవుతున్న నేపథ్యంలో మన మాతృ భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. ప్రపంచంలోనే అన్ని భాషలలో కెల్లా తెలుగు భాషకు ప్రత్యేకత గుర్తింపు ఉన్నదని మన భాషలో సంస్కృతి, సాంప్రదాయాలు కనిపిస్తాయని అన్నారు. తెలుగు భాష పరిరక్షణ కోసం ఎంతోమంది పండితులు, విద్యావంతులు, మేధావులు అనేక రకాలుగా కృషి చేసిన ఫలితంగానే ప్రపంచంలో భాషలలో తెలుగు భాషకు ప్రత్యేక స్థానం దక్కిందని స్పష్టం చేశారు. లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల వ్యవస్థాపకులు మాగంటి సూర్యం జీవించిన కాలంలో తెలుగు భాష కవులను కళాకారులను అనేక సందర్భాలలో గుర్తించి సన్మానించి గౌరవించే వారిని అన్నారు. తెలుగు భాష ప్రాముఖ్యతను తెలిసే విధంగా గతంలో లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో అనేక కవి సమ్మేళనాలు నిర్వహించి మాతృభాష ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలిసే విధంగా కృషి చేశామని స్పష్టం చేశారు. అనంతరం తెలుగు భాష పండితులు తులసీదాస్, వేణు, బాలాజీ, శ్రీను తదితరులు మాట్లాడుతూ... మాతృభాష పరిరక్షణ కోసం లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థలు చేసిన కృషి అభినందనీయమని అన్నారు. అనంతరం మాతృభాషా దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించినందుకు విద్యా సంస్థల కో డైరెక్టర్ మాగంటి సాయి సూర్యను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లితండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

యువతరంలో రెడ్ బుక్ డే స్ఫూర్తినింపాలి

- సంక్షోభం నుండి బయట పడాలంటే సోషలిజమే మార్గం
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాస్

నవతెలంగాణ-మణుగూరు



నేటి యువతరం ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని రెడ్డి బుక్ డేతో స్ఫూర్తిని పొందాలని, నేడు పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభం నుండి బయట పడాలంటే సోషలిజం మాత్రమే మార్గం చూపుతుందని భారత దేశంలో విభజించు, పాలించు విధానంతో పరిపాలన కొనసాగిస్తూ, కార్పొరేట్ సంస్థలను పోషిస్తూ, మతాల పేరుతో చిచ్చు పెడుతున్న బీజేపీని తుది ముట్టించేది కమ్యూనిజం ఒక్కటేనని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక శ్రామిక భవనంలో కార్ మార్క్స్ ఎంగిల్స్ సంయుక్తంగా రచించిన కమ్యూనిస్టు మ్యానిఫెస్టో 1848 ఫిబ్రవరి 21న ముద్రించిన సందర్భంగా ప్రతి సంవత్సరం రెడ్ బుక్ డే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పినపాక నియోజకవర్గంలోని మండల కమిటీ సభ్యులు శాఖ కార్యదర్శులు సమావేశం పార్టీ సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు అధ్యక్షతన రెడ్ బుక్ డే అధ్యయనం నిర్వహించారు. ఈ సమావేశంలో మార్చిలో జరగబోయే ఆల్ ఇండియా సీపీఐ(ఎం) మహాసభల రాజకీయ తీర్మానం ముసాయిదా, రాజకీయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పెంచే ఉత్పత్తిని కొనే శక్తి ప్రజల్లో సన్నగిల్లుతుందన్నారు. 2024-25లో ప్రజలకు కొనుగోలు శక్తి తగ్గిందని, ఆర్థిక వ్యవస్థ మందగించిందని వాపోయారు. దేశంలో ప్రజలు ముఖ్యంగా యువతరం ఆశలను నెరవేర్చడంలో విఫలమైన మోడీ యువత ఆలోచనలను మతం వైపు మళ్ళించి రాజకీయ పబ్బం గడుపుకోవడానికి కుంభమేళా సహా అనేక అవకాశాలను దుర్వినియోగం చేస్తున్నారని అన్నారు. కారల్ మార్క్స్ ఎంగిల్స్ రచించిన కమ్యూనిస్టు కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో ఒక్కరోజు కాదని ఏడాది పొడవునా జీవితాంతం అధ్యయనం చేయడానికి స్ఫూర్తి నిస్తుందన్నారు.

ఈ సమావేశానికి పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న, మండల కార్యదర్శులు సత్రపల్లి సాంబశివరావు, కొమరం కాంతారావు, దుబ్బ గోవర్ధన్, పార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు దామల్ల వెంకన్న, మడి నరసింహారావు, బొల్లం రాజు, కుంజా రాజు, కొండ్రు గౌరీ, రాజేశ్వరి, కళావతి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తునికాకు సేకరణ పనులు వెంటనే ప్రారంభించాలి

- వ్యకాస జిల్లా నాయకులు నిమ్మల వెంకన్న

నవతెలంగాణ-పినపాక



గిరిజనులు, గిరిజనేతర పేదలకు ఉపాధిని కల్పిస్తున్న తునికాకు సేకరణ పనులను వెంటనే చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నిమ్మల వెంకన్న అటవీ శాఖ అధికారులను, ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లో గల అటవీ శాఖ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏటా జనవరి నాటికే టెండర్ల ప్రక్రియను అటవీ శాఖ పూర్తి చేస్తుందని, కానీ, ఈ ఏడాది తాత్సారం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యకాస నాయకులు, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దుబ్బ గోవర్ధన్, మడివి రమేష్, కబ్బాకు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధిత మహిళకు విపత్తుల కిట్టు అందజేత

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండలంలోని పెద్ద ఆర్లగూడెం గ్రామానికి చెందిన పాయం ముత్యాలక్క అనే మహిళకు చెందిన పూరిగుడిస గత రెండు రోజుల క్రితం సంభవించిన షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఆదేశాలతో భద్రాచలం మార్కెట్ కమిటీ చైర్మెన్ తెల్లం సీతమ్మ, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు లంక శ్రీనివాసరావుతో పాటు కాంగ్రెస్ పార్టీ బృందం శుక్రవారం అగ్ని ప్రమాద బాధిత మహిళను పరామర్శించి, భద్రాచలం రెడ్ క్రాస్ సొసైటీ అందించిన విపత్తుల సహాయ కిట్టు, నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, దుస్తులు వారి చేతుల మీదుగా బాధిత మహిళకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ సంఘటన జరగడం చాలా బాధాకరమని అన్నారు. అగ్ని బాధిత మహిళకు కాంగ్రెస్ పార్టీ అన్ని విధాల ఆదుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షులు పిలక వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ సీనియర్ నాయకులు మట్టా వెంకటేశ్వరరావు, కుంజ శ్రీనివాస్, లంక శివకుమార్, పార్టీ మండల ఉపాధ్యక్షులు తెల్ల హరికృష్ణ, వెంకన్న రాజు, సాగర్, బాలాజీ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం న్యాయవాదికి అరుదైన గౌరవం

రాష్ట్ర మత్స్యకార సహకార సంస్థ గ్రామీణ నీటిపారుదల శాఖ స్టాండింగ్ కౌన్సిల్‌గా టి.వసంతరావు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచలం పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది, ప్రస్తుత హైకోర్టు న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్న టి.వసంతరావుకి అరుదైన గౌరవం దక్కింది. ఎంతో ప్రతిష్టాత్మకమైన తెలంగాణ రాష్ట్ర మత్స్యకార సహకార సంస్థ గ్రామీణ నీటిపారుదల శాఖ స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది టి.వసంతరావును ప్రభుత్వం నియమించింది. భద్రాచలం అంటే ఏజెన్సీ ప్రాంతంలో విద్యను అభ్యసించిన వసంతరావు న్యాయవాద వృత్తిలో తనదైన ముద్ర వేసిన విషయం తెలిసిందే. వసంతరావును భద్రాచలం న్యాయవాదుల బార్ అసోసియేషన్ సభ్యులు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోటా దేవదానం నవతెలంగాణతో మాట్లాడుతూ... ఏజెన్సీ ప్రాంతంలో న్యాయ సేవలు అందించిన వసంతరావు రాష్ట్ర మత్స్యకార సహకార సంస్థ గ్రామీణ నీటిపారుదల శాఖకు స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమించటం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో వసంతరావు మరెన్నో విజయాలు సాధించాలని దేవదానం ఆకాంక్షించారు. ఈ ప్రాంతంలో విధులు నిర్వహించిన ఎంతోమంది న్యాయవాదులు హైకోర్టులో తమ ప్రతిభను చూపించి భద్రాచలం ప్రతిష్టను పెంచుతున్నారని అన్నారు. ఇటీవల కాలంలో న్యాయవ్యవస్థ రంగంలోకి నూతనంగా యువ న్యాయవాదులు వస్తున్నారని విద్యార్థి దశలోనే విద్యార్థులు న్యాయవృత్తిని ఎంచుకోవడం లక్ష్యంతో విద్యను అభ్యసించడం అభినందనీయమని దీని ద్వారా అందరికీ న్యాయం అందాలన్న రాజ్యాంగ లక్ష్యం నెరవేరుతుందని దేవదానం అభిప్రాయపడ్డారు.

మునగ సాగు లాభదాయకం : డీఏఓ

నవతెలంగాణ-అశ్వారావుపేట



మునగ సాగు రైతులకు అధిక లాభాలు అందిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు తెలిపారు. ఆయిల్పాం తోటల్లో అంతర పంటగా కూడా మునగ సాగు చేసుకుంటూ అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. మండలంలోని ఆసుపాకలో శుక్రవారం ఆయన మునగ సాగును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మునగ సాగుకు ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తుందని, గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఆశక్తి గల రైతులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. రైతులకు ఆర్థిక తోడ్పాటు నిలుస్తుందని మునగ సాగు విస్తరణకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి శివ రామ ప్రసాద్, ఏఈవోలు రవీంద్ర, షకీరా భాను, పలువురు రైతులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | ఫిబ్రవరి 22, 2025 | www.navatelangana.com



అంకితభావంతో పనిచేస్తేనే పురోభివృద్ధి

• వైస్ చాన్సలర్ అల్దాస్ జానయ్య

నవతెలంగాణ-అశ్వారావుపేట

వ్యవస్థ కాని, సంస్థ కాని అందులోని ప్రతీ ఒక్కరూ అంకిత భావంతో కృషి చేస్తేనే పురోభివృద్ధి ఉంటుందని ప్రొఫెసర్స్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ అల్దాస్ జానయ్య అన్నారు. గత మూడు రోజులుగా స్థానిక వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాలల బోధనా సిబ్బంది జోనల్ స్థాయి సాహితీ, సంస్కృతి, క్రీడా పోటీలు ముగింపు కార్యక్రమానికి శుక్రవారం ఆయన హాజరు అయ్యారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో జరిగిన పురోభివృద్ధికి కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంత్ కుమార్‌ను ఆయన ప్రశంసించారు. బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు కలిసికట్టుగా, క్రమశిక్షణతో కార్యనిర్వాహన చేస్తే విశ్వవిద్యాలయం వ్యవస్థని మరెంతో అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. మరో ముఖ్య అతిథి, విశ్వవిద్యాలయం అధికారి డీఎస్ఏ (డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్) సీహెచ్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడారు. బోధనా సిబ్బంది ఆటలు పోటీలు ఎంతో ఘనంగా జరిగాయని కొనియాడారు. ఆటలు, క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య పోటీల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరినీ ప్రశంసించారు. అనంతరం వివిధ పోటీలో గెలుపొందిన విజేతలను వారు అభినందించి బహుమతులను అందజేశారు. క్రీడలు, ఆటల పోటీల్లో ఓవరాల్ చాంపియన్ షిప్‌ను పురుషుల విభాగంలో మధ్య తెలంగాణ జోన్, మహిళా విభాగంలో రాజేంద్రనగర్ జోన్ గెలుచుకున్నారు. సాంస్కృతిక పోటీల్లో మధ్య తెలంగాణ జోన్ విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం పర్యవేక్షకులు డాక్టర్ జే.సురేష్, వైస్ చాన్సలర్ సాంకేతిక సహాయకులు కే.గోపాలక్రిష్ణ మూర్తి నాలుగు జోన్‌ల పరిధిలోని 9 కళాశాలలకు చెందిన కాంటింజెంట్ పార్టిసిపెంట్స్, కాంటింజెంట్ లీడర్స్, ఫిజికల్ డైరెక్టర్స్, సహాయ సిబ్బంది, స్థానిక కళాశాల బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే

• కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం

నవతెలంగాణ-పినపాక



అబద్ధపు మాటలతో, అసత్య ప్రచారపు పునాదులపై కాంగ్రెస్ పార్టీని విమర్శించాలని చూస్తే బీఆర్ఎస్ పార్టీకి మైలేజీ వస్తుందనుకోవటం వారి మూర్ఖత్వమని కాంగ్రెస్ మండల అధ్యక్షులు గొడిశాల రామనాథం విమర్శించారు. శుక్రవారం పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్ రోడ్ లోపల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలలో కలిసి ఆయన మాట్లాడారు. అబద్దపు ప్రచారాలు చేస్తూనే బీఆర్ఎస్ పార్టీ అంతమవుతుందని ఆ పార్టీ నాయకులు కేవలం సోషల్ మీడియా సింహాలని, నిజమైన సింహాలంటే కాంగ్రెస్ పార్టీ నాయకులని వారిని ఏకతాడి పై నడిపించే నిజమైన నాయకుడు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అని అన్నారు. పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం పైన లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అబద్ధాలు మాట్లాడితే అవి నిజం కావు అని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను రోజువారీగా నెరవేరుస్తూనే ఉంది అని తెలిపారు. కుల గణన చేసి దేశంలోనే ప్రతిష్టాత్మకంగా నిలిచిందన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్లు ప్రకటిస్తారన్న ప్రభుత్వం ఆ మాటకు కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో దృతరాష్ట్ర పాలన అంతమై రామరాజ్య పాలన ప్రజాపాలన నడుస్తుందన్నారు. కానీ బీఆర్ఎస్ నాయకులకు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుకు అది కనిపించడం లేదా అన్నారు. ఇప్పటికైనా అసత్య ప్రచారాలు మాని ప్రజల శ్రేయస్సుకు ప్రతిపక్షాలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాల సందర్శన

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు ఏరియా పీవీ కాలనీలో గల సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలను సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ చలపతి రాజు సందర్శించారు. ఈ సందర్భంగా సెక్రటరీ విద్యార్థులతో మాట్లాడుతూ... నేడు ఓల్డ్ థింకింగ్ డేను పురస్కరించుకొని స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి అవార్డు పొందే వరకు మీకు కావలసిన సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. స్కౌట్స్ ఉద్యమం గురించి దాని వల్ల పొందే ఉపయోగాలు వరల్డ్ థింకింగ్ డే ప్రత్యేకతను పిల్లలకు వివరించారు. 8, 9, 10 విద్యార్థులతో మాట్లాడుతూ టెన్త్ క్లాస్ విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ఉత్సాహంగా చదువుకోవడానికి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ చలపతి రాజు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి గుండా శ్రీనివాస్, ఇన్‌చార్జి హెచ్ఎం ఆర్.కళ్యాణి, సీనియర్ ఉపాధ్యాయులు కృష్ణ బాబు, ఉపాధ్యాయులు బి.లలిత, విద్యార్థులు చలపతిరాజుని సన్మానించారు.

24న అద్దె వాహనల లక్కీడ్రా : జీఎం

నవతెలంగాణ-ఇల్లందు

ఈ నెల 24వ తేదీన సా.04.00 గంటలకు జీఎం కార్యాలయంలో లక్కీ డ్రా నిర్వహించడం జరుగుతుందని ఏరియా జీఎం వి.కృష్ణయ్య విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఏరియాలోని వర్క్ షాప్‌లో-3టీ ప్లాట్ఫారం ట్రక్, క్వాలిటీ డిపార్ట్ మెంట్‌లో-2 డబ్ల్యూడి నాన్ ఏసీ క్యాంపర్ జీపు, ఏరియా ఇంజనీర్ (ఇ అండ్ఎం) ఆఫీస్‌లో-70 హెచ్పి లేదా అంతకంటే ఎక్కువ కెపాసిటీ డీజిల్ వర్షన్ ఏసీ కార్ నందు అద్దె వాహనల కోసం దరఖాస్తు చేసుకున్నవారు అట్టి ప్రకటన ద్వారా టెండర్లు వేసిన వారి సమక్షంలోనే లక్కీ డ్రా నిర్వహించి టెండర్ దారులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. టెండర్లు వేసిన అభ్యర్థులందరూ సకాలంలో లక్కీ డ్రా నిర్వహణలో హాజరు కావాలని తెలిపారు.

కార్మిక వాడల్లో ఆకతాయిల ఆగడాలను అరికట్టాలి

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి కార్మికులు నివసించే వాడల్లో ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షులు నాగేల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏరియా కాలనీ వాసుల సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని యస్ఓటూ జీఎం శ్యామ్ సుందర్‌కు అందజేసి, మాట్లాడారు. కాలనీ ఏరియాపై కూడా దృష్టి సారించి ఆకతాయిల అగడాలను అరికట్టి కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. అర్ధరాత్రి సమయాల్లో కాలనీలో మొహాలకు ముసుగులు ధరించి గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇటీవల మధ్య కాలంలో బాంబే కాలనీకి చెందిన అశోక్ అనే కొండాపురం భూగర్భ గని కార్మికుడి క్వార్టర్ ముందు పెట్టిన కారు అద్దాలను కొంత మంది గుర్తు తెలియని ఆకతాయిలు పూర్తిగా ధ్వంసం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్ కుమార్, మస్తాన్, రమేష్, నాగేశ్వర రావు, ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల్లో మాతృభాషా దినోత్సవం

నవతెలంగాణ-టేకులపల్లి

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మండలంలోని బొమ్మనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు సంప్రదాయ వేషధారణలతో ఆకట్టుకున్నట్లు ఉపాధ్యాయులు శుక్రవారం తెలిపారు. నన్నయ్య, తిక్కన, ఎర్రాప్రగడ, గుర్రం జాషువా, దాశరథి, గురజాడ అప్పారావు, పోతన, అన్నమాచార్య కంచర్ల గోపన్న, దేశ నాయకులు పింగళి వెంకయ్య, జమలాపురం కేశవరావుతో పాటు రాణి రుద్రమదేవి, తెలంగాణ తల్లి, అన్నదాత రైతు, తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కారులు గద్దర్, జయరాజుల ఫ్యాన్సీ డ్రెస్‌లతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్ పర్సన్ పొగాకు లక్ష్మి పాల్గొన్నారు.

తెలుగు భాష గొప్పతనం గురించి ఊహా, సాయి కౌండిన్య చేసిన నృత్యాభినయం ఆకర్షించింది. ప్రధానోపాధ్యాయురాలు ఎం.జ్యోతిరాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, రాష్ట్ర కో ఆర్డినేటర్ మహమ్మద్ ఖాసిం, ఐఈఆర్పి నీరజా శారోన్, ఎండీఎం వర్కర్స్ సరోజ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ప్రదర్శన బాలమేళా

నవతెలంగాణ-టేకులపల్లి



టేకులపల్లి కాంప్లెక్స్ విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాల ప్రదర్శన జిల్లా విద్యా శాఖా ఆదేశానుసారం ప్రాథమిక స్థాయి విద్యార్థుల కోసం రూపొందించిన ఎల్ఎఫ్ఎన్ బాలమేళా శుక్రవారం నిర్వహించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెరుగు శ్రీనివాస్ తెలిపారు. టేకులపల్లి కాంప్లెక్స్ పరిధిలోనే వున్న ప్రతి ప్రాథమిక పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు తయారు చేసిన నమూనాలను సమర్ధవంతంగా, సృజనాత్మకంగా తయారు చేసినందున వాటి ప్రదర్శన కాంప్లెక్స్ పరిధిలో నిర్వహించామన్నారు. మండల విద్యాశాఖాధికారి ఎ.జగన్ మాట్లాడారు. విద్యార్థులు నేర్చుకున్న, సృష్టించిన ప్రతీ అంశాన్ని ప్రదర్శించి, బాలమెళాను విజయవంతం చేసినందున అభినందించారు. బాలమెళా ప్రథమ బహుమతి ఎంపీపీఎస్ బేతంపూడి, ద్వితీయ బహుమతి రేగుల తండ, తృతీయ బహుమతి పాత తడికలపూడి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చక్కని పాటలతో, డాన్సులతో ప్రదర్శన చేసి బాల మేళను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ గూగులోత్ నరేష్, కాంప్లెక్స్ సెక్రటరీ బాణోత్ లక్ష్మ, వేంకట్రాం, నాగేశ్వరావు, సుజాత, మంగిలల్, హతీరం, వీరన్న, భారతి, స్వరూప, రాణి, రాంబాబు, బలరాం, రాంబాబు పాల్గొన్నారు

ఎర్రంపాడుకు పరుగులు తీసిన పంచాయతీ రాజ్ అధికారులు

దాతలు ఇచ్చిన విద్యుత్ మోటర్ నిర్మింపచేపించిన అధికారులు

• ఆనందం వెల్లబుచ్చిన గ్రామస్తులు
• నవతెలంగాణ వార్తకు స్పందన

నవతెలంగాణ-చర్ల



మంచినీళ్లు కావాలా....ఇంటి పన్ను కట్టండి అనే శీర్షికన శనివారం నవతెలంగాణలో వెలువడిన వార్తకు పంచాయతీరాజ్ అధికారులు ఎర్రంపాడుకు పరుగులు తీశారు. దాత జలగం వెంగళరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో రీట్జ్ ఇండియా లిమిటెడ్ హైదరాబాదు వారి సహకారంతో సుమారు రూ.50 వేల విద్యుత్ మోటర్ వితరణ చేయగా అట్టి విద్యుత్ మోటర్‌ను నిర్మింప చేయడానికి కార్యదర్శి నిర్లక్ష్యం వహించగా గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న నవతెలంగాణ శనివారం వార్త మంచినీళ్లు కావాలా...ఇంటి పన్ను కట్టండి అనే శీర్షికన వార్త రావడంతో ఆర్డబ్ల్యూఎస్ డీఈ జీవి బ్రహ్మదేవ్, ఏఈ వేముల రాము, మండల పంచాయతీరాజ్ అధికారి హజరత్ వలీ, కార్యదర్శి రఫీ పరుగు పరుగున ఎర్రం పాడు చేరుకొని విద్యుత్ మోటర్ నిర్మింప చేశారు.

ఆనందం వెల్లబుచ్చిన గ్రామస్తులు

సుమారు రెండు నెలల పాటు సోలార్ డ్రింకింగ్ సెక్షన్ మరమ్మతుల గురవడంతో నానా అవస్థలు పడ్డ ఎర్రంపాడు గ్రామస్తులు నవతెలంగాణ ద్వారా తెలుసుకున్న జలగం వెంగళరావు ట్రస్ట్ చైర్మెన్ జలగం ప్రసాదరావు, ప్రముఖ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కీర్తిశేషులు సివికే రావు తనయుడు హైకోర్టు అడ్వకేట్ సిహెచ్ సతీష్ కుమార్‌ల సహకారంతో విద్యుత్ మోటర్‌ను నిర్మింపచేయడం చాలా సంతోషకరమని ఎర్రంపాడు ఆదివాసీ గ్రామ ప్రజలు తమ సంతోషాన్ని వెల్లబుచ్చారు. సమస్య తెలిపినదే తడువుగా మాజీ మంత్రి జలగం ప్రసాదరావు మాకు అందించిన సహకారం మరువలేనిదని ఎర్రంపాడు గిరిజనులు సంతోషాన్ని తెలిపారు. తాగునీరు లేక గత 60 రోజులుగా ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన మా సమస్య పరిష్కారం కాకపోవడంతో చర్ల నవతెలంగాణ పాత్రికేయునికి చెప్పడం వలన మా సమస్య తీరిందని వారు నవతెలంగాణను అభినందించారు.

రెక్కల రామక్క జాతరలో పాల్గొన్న ఎస్పీ

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



మండల పరిధిలోని పెద్దూరు గ్రామంలో జరుగుతున్న కొమరం వంశీయుల ఆహ్వానం మేరకు వారి ఇలవేల్పు రెక్కల రామక్క జాతరలో నాల్గో రోజు శుక్రవారం ఎస్పీ రోహిత్ రాజ్ పాల్గొని, దేవతను దర్శించుకున్నారు. అనంతరం రెక్కల రామక్క చరిత్ర గురించి ఎస్పీ ఆలయ కమిటీ పూజారులు, కొమరం వంశీయులను అడిగి తెలుసుకున్నారు. తదనంతరం రెక్కల రామక్కపై అధ్యయనం చేసిన పుస్తకాన్ని ఎస్పీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డీఎస్పీ చంద్రభాను, టేకులపల్లి సీఐ టి.సురేశ్, ఆళ్ళపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై రతీష్, కొమరం వంశీయులు హనుమంతరావు, రాంబాబు, వెంకన్న, సత్యనారాయణ, వెంకట కృష్ణం రాజు, వెంకటేశ్వర్లు, సతీష్, నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాదారులు బైండోవర్

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఇసుక అక్రమ రవాణాను అరికట్టే చర్యలు భాగంగా ఉన్నతాధికారులు సూచనల మేరకు డ్రైవర్‌లను, ట్రాక్టర్ యజమానులను శుక్రవారం తహసీల్దార్ క్రిష్ణ ప్రసాద్ సమక్షంలో బైండోవర్ చేసినట్లు ఎస్‌హెచ్ఓ ఎస్ఐ యయాతి రాజు తెలిపారు. బైండోవర్ అయిన వారిలో మండల పరిధిలో గత సంవత్సరంలో ఇసుక అక్రమ రవాణా కేసులలో ఉన్న మొత్తం 29 మంది వ్యక్తులు, ట్రాక్టర్ ఓనర్‌లు ఉన్నారని ఆయన తెలిపారు.

వామపక్ష భావజాలం వ్యాప్తే రెడ్ బుక్ డే సార్ధకత

• సీపీఐ(ఎం) నాయకులు పుల్లయ్య

నవతెలంగాణ-అశ్వారావుపేట



ప్రపంచ వ్యాప్తంగా వామపక్ష భావజాలం వ్యాప్తి చేయడం, బూర్జువా, భూస్వామ్య, ఆధ్యాత్మిక ప్రత్యామ్నాయ సంస్కృతి, సాంప్రదాయాలను ఆలోచించడమే రెడ్ బుక్ డేకు సార్ధకత అని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య పునరుద్ఘాటించారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం సుందరయ్య భవన్‌లో సీనియర్ నాయకులు గడ్డం సత్యనారాయణ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులోనే రెడ్ బుక్ డే పై స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి హాజరైన పుల్లయ్య మాట్లాడుతూ రెడ్ బుక్స్ డే అనేది లెఫ్ట్ వింగ్ పుస్తకాలను, వాటి రచయితలను, అవి ముందుకు నడిపించిన ప్రజా ఉద్యమాలను గుర్తు చేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి.చిరంజీవి, మండల కార్యదర్శి సోడెం ప్రసాదరావు, మండల కార్యదర్శి వర్గం సభ్యులు ముళ్ళగిరి గంగరాజు, తగరం నిర్మల, మడిపల్లి వెంకటేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు సీతారామయ్య, నారం అప్పారావు, మురళీలు పాల్గొన్నారు.

బహుజనులు రాజ్యాధికారం సాధించాలి

• ఎమ్మెల్సీ ఎన్నికల్లో రవీందర్‌ను గెలిపించాలి

నవతెలంగాణ-పాల్వంచ



రాష్ట్రంలో బహుజనులు రాజ్యాధికారం సాధించేందుకు కృషి చేయాలని మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అపెక్స్ కన్వీనర్ సర్దార్ పురుషోత్తం పటేల్ అన్నారు. శుక్రవారం పాల్వంచ పట్టణంలో తెలంగాణ మున్నూరు కాపు పటేల్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాంపెల్లి కనకేష్ పటేల్ అధ్యక్షతన పాల్వంచ పట్టణ, మండల మున్నూరు కాపు సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మున్నూరు కాపుల ప్రాధాన్యతను తగ్గించేందుకు కుట్ర జరుగుతుందని అన్నారు. బహుజనుల రాజ్యాధికారమే మున్నూరు కాపుల లక్ష్యమని అన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. త్వరలో జరగనున్న టీచర్స్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహుజనులందరూ పూల రవీందర్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు.

అనంతరం కాంపెల్లి కనకేష్ పటేల్ మాట్లాడుతూ 2014లో కేసీఆర్ సమగ్ర సర్వేలో తెలంగాణలో మున్నూరు కాపులు 28 లక్షల మంది ఉండగా రేవంత్ రెడ్డి నేడు చేపట్టిన కులగణనలో కేవలం 13 లక్షల మందిని మాత్రమే చూపెట్టి మున్నూరు కాపులను అణిచివేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత హిందూ బీసీ మహాసభ జాతీయ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్, రాష్ట్ర అధ్యక్షులు పర్వతపు సతీష్ కుమార్, తెలంగాణ మున్నూరు కాపు రాష్ట్ర కార్యదర్శి బాపట్ల మురళి, చింతా నాగరాజు, తోట మల్లేశ్వర రావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, అప్పారావు, కొండలరావు, సాంబశివరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌లు సమయపాలన పాటించాలి

• డీఎంహెచ్ఓ డా.భాస్కర్ నాయక్

నవతెలంగాణ-పాల్వంచ



జిల్లాలోని అన్ని రకాల వైద్యశాలల్లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ అందరూ తమ తమ పరిధిలోని వైద్యశాలకు సమయపాలన పాటించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.భాస్కర్ నాయక్ సూచించారు. జిల్లాలోని అన్ని వైద్య శాఖల్లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్‌లతో జిల్లా సమీకృత కలెక్టరేట్ నందు జరిగిన నెలవారీ సమీక్షా సమావేశంలో శుక్రవారం నిర్వహించగా డీఎంహెచ్ఓ పాల్గొని మాట్లాడారు. హాస్పిటల్ ఏఓఈలు సమయానికి వైద్య ఆరోగ్య శాఖకు రావాలని, హాజరు శాతం తప్పకుండా పాటించాలని, ఉద్యోగుల ఆసుపత్రికి సంభందించిన అన్నిరకాల ఖర్చులను బిల్స్‌తో సహ జత చేసి వైద్య ఆరోగ్య శాఖ సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ గుగులోతు సింగోజీ, సుదర్శన్, రతన్ రాజ్ పాల్గొన్నారు.

మిర్చి రైతులకు మద్దతు ధర రూ.25వేలు చెల్లించాలి

• సీపీఐ(ఎం) మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు

నవతెలంగాణ-చింతకాని



రాష్ట్ర ప్రభుత్వం మిర్చి రైతులకు క్వింటాకు కనీస మద్దతు ధర రూ.25 వేలు చెల్లించాలని సీపీఐ(ఎం) మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలో రాయల వీరయ్య భవనంలో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు ఆత్మహత్యలు ఆగాలంటే రైతు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాల్సారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన మిర్చి పంట మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలన్నారు. గతంలో ఉన్న మిర్చి ధరల కన్నా ఈ ఏడాది మిర్చి ధరలు పూర్తిగా తగ్గడం వల్లనే రైతులు అప్పులు పాలై పెట్టిన పెట్టుబడులు కూడా బోడక ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వాలు స్పందించి రైతులకి పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని కోరారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం మధిర డివిజన్ నాయకులు పాపినేని రామ్ నర్సయ్య, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రాచ్చబంటి రాము, మండల కమిటీ సభ్యులు వత్సవాయి జానకి రాములు, రైతు సంఘం నాయకులు తోటకూరి వెంకట నరసయ్య, ఆలస్యం రవికుమార్, కాటబత్తిన వీరబాబు, నన్నక కృష్ణమూర్తి, మద్దిని బసవయ్య, మడిపల్లి కిరణ్ బాబు, దేశబోయిన ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచానికి కమ్యూనిజమే ప్రత్యామ్నాయం

ఘనంగా రెడ్ బుక్ డే వేడుకలు

నవతెలంగాణ-తల్లాడ

ప్రపంచానికి కమ్యూనిజం ప్రత్యామ్నాయమని, రెడ్ బుక్ చదివి కార్యోన్ముఖులు కావాలని సీపీఐ(ఎం) సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి సూచించారు. సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రెడ్ బుక్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శీలం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ 1848వ సంవత్సరంలో ప్రజలు పడుతున్న కష్టాలు, బాధలు, కార్మికులు, రైతులు, నిరుద్యోగులు, వ్యవసాయ కార్మికులు, పడుతున్న కష్టాలకు ప్రత్యామ్నాయ విధానాలను రూపొందిస్తూ ప్రపంచానికి అందించిన పుస్తకమే రెడ్ బుక్ అన్నారు. రెడ్ బుక్కును చదివి, కార్యోన్ముఖులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు నల్లమోతు మోహన్‌రావు, చల్ల నగేశ్వరరావు, సత్తెనపల్లి నరేష్, కళ్యాణం కృష్ణయ్య, మేడి బిక్షం తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి : సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో రెడ్ బుక్ డే ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు, పార్టీ మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు మల్లెల సన్మతరావు, షేక్ బషీరుద్దీన్, డివిజన్ నాయకులు యడవల్లి రమణారెడ్డి, బిక్కసాని గంగాధర్, శీలం గురుమూర్తి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కర్ణ బాబు, తాళ్ళూరి వెంకటేశ్వరరావు, మూడు గన్యానాయక్, మండల కమిటీ సభ్యులు శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం : సంక్షేమ పథకాలు ద్వారా పేదల కష్టాలు తీరవని కష్టజీవులు రాజ్యం వస్తేనే పేదల కష్టాలు తీరుతాయని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్ అన్నారు. శుక్రవారం స్థానిక గజ్జల వెంకటయ్య భవనంలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో రెడ్ బుక్కు డే సందర్భంగా సామూహిక అధ్యయనాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ మహాసభల ముసాయిదాను మండల కమిటీ సభ్యుల చేత చదివించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, మండల నాయకులు దాసరి మహేందర్ బింగి రమేష్, తుళ్లూరు నాగేశ్వరరావు, కొత్తపల్లి వెంకన్న, దిండు మంగపతి, సైదులు, మట్టా సుధాకర్, కోడి లింగయ్య, పల్లి రమేష్, వర్షపొంగు వీరన్న, వాసయ్య, శ్రీనివాస్‌రెడ్డి, షేక్ పట్టే మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



తల్లాడ



కూసుమంచి

ఖమ్మం రూరల్ : రెడ్ బుక్ డేను పురస్కరించుకొని ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్ వద్ద గల తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో శుక్రవారం రెడ్ బుక్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీ సభ్యులు భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు 24వ మహాసభ రాజకీయ తీర్మానం ముసాయిదా చదివారు. సీపీఐ(ఎం) ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి ఉరడీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు నంద్ర ప్రసాద్,మండల కార్యదర్శి వర్గ సభ్యులు పొన్నెకంటి సంగయ్య, నందిగామ కృష్ణ, పెండ్యాల సుమతి, ఎస్‌కె.రంజాన్, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, మండల కమిటీ సభ్యుడు చామకూరి రవీందర్, మడిపల్లి వెంకన్న, పాపిట్ల సత్యనారాయణ, ధనియాకుల రామయ్య, నాగేశ్వరరావు, ఆంటోనీ తదితరులు పాల్గొన్నారు.



తిరుమలయపాలెం



ఖమ్మం రూరల్

చివరి ఆయకట్టుకు సాగర్ నీటిని అందించేందుకు కృషి

నవతెలంగాణ-బోనకల్



మండల పరిధిలోని బీబీసీ పరిధిలో చివర ఆయకట్టు భూములకు సైతం సాగర్ నీటిని అందించేందుకు మండల స్థాయి అధికారులతో టీములను ఏర్పాటు చేసినట్లు తహసిల్దార్ అని శెట్టి పున్నం చందర్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నీటిపారుదల శాఖ, వ్యవసాయ శాఖ, రెవిన్యూ శాఖ, విద్యుత్ శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలోని అన్ని గ్రామాల చివర భూములకు సాగర్ నీటిని అందించేందుకు అధికారులతో టీములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 22 గ్రామాలకు సంబంధించి ఈ టీములను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ టీములు చివర భూములను గుర్తించి ఆ భూములకు సాగర్ నీటిని అందించేందుకు కృషి చేస్తారని తెలిపారు. బోనకల్ మండలంలో సాగర్ కెనాల్ కింద ఎకరం పంట కూడా దెబ్బ తినకుండా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రైతులు సాగర్ నీటిని వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాలవలకు ముందు ఉన్న రైతులు చివరన గల రైతులకు సాగరనీరు వెళ్లే విధంగా సహకరించాలని వారు కోరారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ డిఈ తమ్మారపు వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ శాఖ అధికారి పసునూరి వినయ్ కుమార్, గిర్దావర్ వన్ గుగులోతు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తల్లాడ : మండల పరిధిలోని రంగం బంజర స్టేజి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. తల్లాడ గ్రామపంచాయతీ పరిధిలోని నారాయణపురం గ్రామం నుండి గ్యాస్ సిలిండర్ టీవీఎస్ పై తీసుకుని వెళ్తున్న, ముత్తగూడెంకు చెందిన బొగ్గుల నాగిరెడ్డి(55) తల్లాడ నుండి కల్లూరు వైపు వెళుతున్న లారీ ఢీకొంది. లారీ అతని పైనుండి వెళ్లడంతో శరీర భాగాలు ముక్కలు ముక్కలుగా విడిపోయాయి. లారీని పెనుబల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తల్లాడ ఎస్ఐ కొండలరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

CHANGE OF NAME AND DATA OF BIRTH

I, **SHAIK ZAHEDA**, W/O. Ex-Service No.14586594A, CFN, SHAIK ABDUL NABI ,R/O h.No.10-4-57/1, Ex-Servicemen Colo ny, Chunchupalli, Kothagudem, Bhadra dri Kothagudem-507101, T S . I have changed my name and date of birth as "ZAHADA" & Date of birth **10-3-1973** to "**SHAIK ZAHEDA**" and date of birth 01-01-1975 As per affidavit dated on 14/02/25 both names and date of birth are pertaining to one and the same.

యాంసంగి పూర్తయ్యేదాకా సాగునీరు అవసరం

రైతుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకోవాలి

- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖ

నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట నియోజకవర్గంలో నాలుగేండ్ల నుంచి యాసంగి పంటకు రంగనాయక సాగర్ కాల్వల ద్వారా రైతుల పంట పొలాలకు సాగు నీటిని అందిస్తున్నామని, ఈ ఏడాది కూడా పంటకాలం పూర్తి అయ్యే వరకు సాగునీటిని అందించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రైతుల పక్షాన లేఖ



రాశారు. లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం.. నియోజకవర్గంలో నాలుగేండ్ల నుంచి యాసంగి పంటకు ఇబ్బంది కాకుండా, పంటలు ఎండి పోకుండా నీటిని విడుదల చేసి కాపాడుకున్నామని తెలిపారు. రంగనాయక సాగర్ కాల్వల ద్వారా రైతుల పంట పొలాలకు సాగునీటిని గతంలో అందించామని, దాని వల్ల రైతులకు పంట రాబడి బాగా పెరిగింద న్నారు. ఈ యేడు 50 వేల ఎకరాల పంట సాగులో ఉన్నదని, రంగనాయక సాగర్‌లో ఇటీవల 2.4 టీఎంసీల నీరు పంపింగ్ చేశారని, ప్రస్తుతం 1.85 టీఎంసీలు మాత్రమే ఉందని తెలిపారు. యాసంగి పంటకు పూర్తి స్థాయిలో నీరు అందాలంటే ఇంకా 2.5 టీఎంసీల నీరు అవసరం ఉంటుందని వివరించారు. మిడ్ మానేరు నుంచి రెండు విడుతలుగా రంగనాయక సాగర్‌లోకి నీళ్లు పంపింగ్ చేసేలా ఇరిగేషన్ అధికారులను ఆదేశించాలని మంత్రిని కోరారు. సాగు నీరు లేక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, పంట పొలాలకు నీరందించాలని హరీశ్‌రావు మంత్రికి రాసిన లేఖలో కోరారు.

కూతురు పెండ్లిలో తండ్రి మృతి

- కాళ్లు కడుగుతుండగానే గుండెపోటు

నవతెలంగాణ-భిక్కనూర్



అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు పెండ్లి సంతోషంగా జరుగుతున్న సమయం లో ఒక్కసారిగా తండ్రి కుప్పకూలి హఠాత్మరణం చెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలంలోని రామేశ్వర్‌పల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన బాల్‌చంద్రం (56) కొంతకాలంగా కామారెడ్డిలో నివసిస్తున్నారు. శుక్రవారం మండలంలోని బీటీఎస్ వద్ద ఉన్న ఇంద్రప్రస్థాన్‌లో తన కూతురు వివాహం జరుగుతున్న సమయంలో పెండ్లి కొడుకు కాళ్లు కడుగుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. దాంతో కుటుంబీకులు హుటాహుటిన కామారెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. అప్పటి వరకు ముందుండి పెండ్లి తంతు నిర్వహిస్తూ పలకరింపులతో హడావుడిగా గడిపిన తండ్రి.. గుండెపోటుతో మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదం నింపింది.

నేటితో ముగియనున్న ఇంటర్ ప్రాక్టికల్స్

కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలు శనివారంతో ముగియనున్నాయి. ఈ నెల మూడో తేదీ నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఆ పరీక్షల నిర్వహణ కోసం 33 జిల్లాల్లో ఒకేషనల్‌తో కలిపి 2,008 కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. వాటిలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. సీసీ కెమెరాలను ఇంటర్ బోర్డులో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ప్రాక్టికల్ పరీక్షలను అధికారులు పర్యవేక్షించారు. ప్రాక్టికల్ పరీక్షలకు 4,29,052 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. వారిలో 3,33,805 మంది ఇంటర్ ద్వితీయ సంవత్సరం నుంచి, 95,247 మంది ఒకేషనల్ విద్యార్థులున్నారు. వార్షిక పరీక్షలు వచ్చే నెల ఐదో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 4,88,336 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 5,07,956 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు.

బడ్జెట్‌లో వికలాంగులకు నిధులుపెంచాలి

ఎన్‌పీఆర్‌డీ 15వ ఆవిర్భావ దినోత్సవంలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బడ్జెట్‌లో వికలాంగులకు నిధులు పెంచాలనీ, రాష్ట్ర ప్రభుత్వం వారికిచ్చిన హామీలను అమలు చేయాలని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య డిమాండ్ చేశారు. ఆ సంఘం పదిహేనో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో సంఘం అధ్యక్షులు కె వెంకట్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్ల సాధన కోసం పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 'జాలి, దయ, కరుణ మాకొద్దు, మా హక్కులు మాక్కావాలి' అనే నినాదంతో దేశ వ్యాప్తంగా వికలాంగులను ఐక్యం చేయడానికి 2010లో ఎన్‌పీఆర్‌డీ కోల్‌కత్తా పట్టణంలో ఏర్పడిందని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం వికలాంగులను సమీకరించి తమ సంఘం పోరాటాలు చేస్తోందని వివరించారు. పార్లమెంట్ వేదికగా వికలాంగుల సమస్యలను చర్చించి అనేక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసిందన్నారు. 2016 ఆర్‌పీడీ చట్టం సాధన, అంత్యోదయ రేషన్ కార్డులు, రైల్వేలో సౌకర్యాలు, సామూహిక ప్రాంతాలను అవరోధ రహితంగా మార్చడం, నేషనల్ ఇనిస్టిట్యూట్ విలీనానికి వ్యతిరేకంగా పోరాటాలు చేసి విజయాలు సాధించామన్నారు. మహిళా వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం సమరశీల పోరాటాలు నిర్వహించామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో విఫలమయ్యాయని విమర్శించారు. పింఛన్ పెంపుతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించటంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందనీ, దాన్ని సవరించి 5శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ కోసం ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ పరిశ్రమల్లో వికలాంగులకు 5శాతం ఉద్యోగాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం నుంచి 27వరకు రాష్ట్రవ్యాప్తంగా సంఘం ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తు న్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు ఎ వెంకటేశ్, నాగరాజు, కోశాధికారి ఆర్ వెంకటేష్, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె దశరథ్,రాష్ట్ర కమిటీ సభ్యులు కె చంద్రమోహన్, జె మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు టెన్త్ విద్యార్థులకు టీశాట్‌లో అవగాహన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పదో తరగతి విద్యార్థులకు టీశాట్‌లో సబ్జెక్టు నిపుణులతో శనివారం అవగాహన తరగతులను నిర్వహించాలని రాష్ట్ర విద్యా, పరిశోధన శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్టీ) నిర్ణయించింది. శనివారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సబ్జెక్టు నిపుణులు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారని శుక్రవారం ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకు మ్యాథమెటిక్స్, 10.30 నుంచి 11.15 వరకు ఫిజికల్ సైన్స్, 11.15 నుంచి మధ్యాహ్నం 12 వరకు బయలాజికల్ సైన్స్, 12 నుంచి 12.30 వరకు ఉర్దూ, 12.30 నుంచి ఒంటిగంట వరకు హిందీ సబ్జెక్టులపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం రెండు నుంచి మూడు వరకు ఇంగ్లీష్, మూడు నుంచి నాలుగు వరకు సోషల్ స్టడీస్, నాలుగు నుంచి ఐదు గంటల వరకు తెలుగు సబ్జెక్టులపై నిపుణులు అవగాహన కల్పిస్తారని వివరించారు.

12 ఏండ్ల మోడీ, పదేండ్ల కేసీఆర్

పాలనపై చర్చిద్దాం రండి



(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. ఆ తర్వాత ఏపీ సీఎం జగన్‌తో కేసీఆర్ చీకటి ఒప్పందం చేసుకుని రాయలసీమ ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చారన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే ఈ రోజు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం పెట్టి ఉండేది కాదన్నారు. ఆనాటి పరిస్థితులే నేడు చంద్రబాబుతో నీటి పంచాయతీకి కారణమన్నారు. కేసీఆర్ కొట్టాలంటే తప్పుచేసిన కొడుకు, కూతురు, అల్లుడును కొట్టుకోవాలని, కాంగ్రెస్ కార్యకర్తలను కొడతానంటే ఊరుకోరని హెచ్చరించారు. తమ హయాంలో ఆర్టీసీ ఫ్రీ జర్నీ, గ్యాస్, ఉచిత కరెంట్‌తోపాటు అనేక పథకాలు అమలు చేస్తున్నామన్నారు.

తాము మహిళా సాధికారతకు కట్టుబడి ఉన్నామని, రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా కృషి చేస్తామని చెప్పారు. పాలమూరు జిల్లాను రాష్ట్రంలో అగ్రభాగాన నిలబెట్టేందుకు చేస్తున్న కృషిని కొందరు అడ్డుకుంటున్నారని, ప్రజలు వారి కుట్రలకు బలికావొద్దని సూచించారు. ప్రాజెక్టులు, పరిశ్రమలను పూర్తి చేయడానికి ప్రజలు సహకరించాలని కోరారు. ప్రాజెక్టులకు భూములు కోల్పోతే, కావాల్సిన పరిహారం అందిస్తామని, ఎకరానికి రూ. పది లక్షల నుంచి 20 లక్షలు అందిస్తామని తెలిపారు. తాము ఏడాదిలోపే 56వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని వివరించారు. కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందన్న కేసీఆర్‌కు తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎందుకు కనబడటం లేదని ప్రశ్నించారు. స్వాతంత్ర్యం కంటే ముందు బీసీ కులగణన చేస్తే.. తాము అధికారంలోకి రాగానే బీసీ కులగణన చేసి చిత్తశుద్ధి నిరూపించుకున్నామన్నారు.

స్థానిక ఎన్నికల్లో ఇందిరమ్మ ఇండ్లు ఉన్న గ్రామాల్లోనే తాము పోటీ చేస్తాం.. డబుల్ బెడ్‌రూమ్స్ ఉన్న గ్రామాల్లోనే పోటీ చేయడానికి బీఆర్‌ఎస్ నేతలు సిద్ధమా అని ప్రశ్నించారు. మార్చి 31 నాటికి రైతు భరోసా ప్రతి రైతు ఖాతాలో వేస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టులు, పరిశ్రమలు నిర్మిస్తే.. కాంగ్రెస్‌కు మంచి పేరు వస్తోందని ప్రజలను రెచ్చగొట్టి లగచర్లలో జిల్లా కలెక్టర్‌పై దాడులు చేయించారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్ష కోట్లలో వేల కోట్లు కమీషన్ తీసుకున్న చరిత్రమీదన్నారు. మక్తల్, నారాయణపేట ఎత్తిపోతల పథకం గురించి తాను 2014లో నాటి అసెంబ్లీలో మాట్లాడానని, అది తాను సీఎం అయిన తర్వాత కార్యరూపం దాల్చిందన్నారు. గత పాలకులు ప్రాజెక్టులు సరిగ్గా నిర్మించి వుంటే.. కృష్ణా జలాల వాటాలో మనకు రావాల్సిన 811 టీఎంసీల నీళ్ల వినియోగంలోకి వచ్చేవని తెలిపారు. అందుకే పదేండ్ల గత పాలకుల పాలన.. ఏడాది కాంగ్రెస్ పాలనను ఒకసారి చూసి ప్రజలు స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, బీజేపీ ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు వాకిట శ్రీహరి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, అనిరుధ్‌రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఎన్పీఎఫ్ఎం ముసాయిదాను వెనక్కి తీసుకోవాలి

మార్కెటింగ్ వ్యవస్థలో పెరుగుతున్న కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం

చిన్న రైతులు వ్యవసాయానికి దూరమయ్యే పరిస్థితి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్
- నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా నిరసన యాత్ర



నవతెలంగాణ-ఆర్మూర్/నవీపేట్/కంఠేశ్వర్

కేంద్ర ప్రభుత్వం 2024 నవంబర్ 24న విడుదల చేసిన జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం (ఎన్పీఎఫ్ఎం) ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్మూర్ నుంచి శుక్రవారం రైతుల నిరసన యాత్ర చేపట్టారు. ఆర్మూర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర ఆలూరు, నందిపేట్, నవీపేట్, జానకంపేట్ మీదుగా నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ శ్రద్ధానంద్ గంజ్‌లో ముగిసింది. ఈ సందర్భంగా శోభన్ మాట్లాడుతూ.. ఈ ముసాయిదా వల్ల గతంలో రద్దయిన చట్టాలను మార్కెట్ విధానాల రూపంలో రైతులపై రుద్దే అవకాశం ఉందని అన్నారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం దీన్ని రూపొందించిందని తెలిపారు. జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం ద్వారా కనీస మద్దతు ధరకు (ఎంఎస్పీ) చట్టబద్ధ హామీ ఇవ్వకపోవడంతో రైతులు మార్కెట్‌లో ఉన్న అనిశ్చిత పరిస్థితులను అధిగమించడం చాలా కష్టమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ ఫార్మింగ్‌ను ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నదని, ప్రయివేట్, కార్పొరేట్ సంస్థలు వ్యవసాయ ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లో అధిక ప్రాధాన్యత పొందే అవకాశం ఉందన్నారు. దీనివల్ల చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయంపై పట్టు కోల్పోయి, కార్పొరేట్ సంస్థల ఆధీనంలోకి వెళ్లే ప్రమాదం ఉందని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓ) ప్రధాన భాగస్వాములుగా చూపబడుతున్నప్పటికీ, కార్పొరేట్ సంస్థల కేంద్రీకృత నియంత్రణకు దోహదపడుతుందని అన్నారు. గిడ్డంగుల ప్రయివేటీకరణతో రైతులు తమ ఉత్పత్తులను సకాలంలో నిల్వ చేసుకునే అవకాశాలను కోల్పోతారని తెలిపారు. మార్కెట్ నియంత్రణలను తొలగించడం ద్వారా పెద్ద సంస్థలు మార్కెట్‌ను పూర్తిగా ఆధీనంలోకి తీసుకోవడమే కాకుండా, రైతులపై ఆర్థిక ఒత్తిడి పెంచే పరిస్థితిని సృష్టిస్తోందన్నారు. వ్యాపారులు రైతుల ఉత్పత్తులను తక్కువ ధరకు కొనుగోలు చేయడం, తద్వారా అధిక లాభాలను పొందే అవకాశం ఉందని అన్నారు. దాంతో చిన్న రైతులు వ్యవసాయం నుంచి వైదొలగాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయన్నారు. మార్కెటింగ్ వ్యవస్థలో కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం మరింత పెరగడంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అసమానతలు పెరుగుతాయని తెలి పారు. రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న వ్యవసాయ మార్కెట్ వ్యవస్థకి సంబంధించిన అంశాలపై కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఇలాంటి విధానాలు తీసుకురావటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల హక్కులకు భంగం వాటిల్లుతుందని తెలిపారు. దేశ రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ యాత్రకు తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకటేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎ.రమేష్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి సిర్ప లింగం మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భూమన్న, నాయకులు ఎర్ర సాయిలు, ఇడగొట్టి సాయిలు, గంగారాం, ఎర్రన్న పాల్గొన్నారు.



తాను అనువదించిన రెండు పుస్తకాలను స్వాతంత్ర్య సమరయోధుడు, భగత్ సింగ్ మేనల్లుడు ప్రొఫెసర్ జగ్ మోహన్‌కు బహుకరించిన ప్రజాశక్తి పూర్వ సంపాదకులు, సీనియర్ పాత్రికేయులు ఎస్.వినయకుమార్. శుక్రవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఆర్ఎస్‌యూ పూర్వ విద్యార్థుల సమావేశంలో జగ్ మోహన్‌తో వినయకుమార్ భేటీ అయ్యారు. ఈ రెండు పుస్తకాల్లో ఒకటి ప్రొఫెసర్ ఇర్ఫాన్ హబీబ్ ఎడిట్ చేసిన భగత్ సింగ్ రచనలు కాగా, మరొకటి పి.సాయినాథ్ రచించిన లాస్ట్ హీరోస్ పుస్తకం ఉన్నాయి.

సాగునీటి కోసం అన్నదాతల ధర్నా

ఏఈ నిర్లక్ష్యంపై ఆగ్రహం



నవతెలంగాణ-నూతనకల్

పొట్ట దశలో ఎండుతున్న వరి పంటకు గోదావరి జలాలను అందించి కాపాడాలని కోరుతూ సూర్యాపేట జిల్లా, నూతనకల్ మండల రైతులు శుక్రవారం ఎర్రపహాడ్ అడ్డరోడ్డు వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ప్రధాన రోడ్డుపై అడ్డంగా ద్విచక్రవాహనాలు పెట్టి బైటాయించారు. విషయం తెలుసుకుని అక్కడికొచ్చిన ఎస్సారెస్పీ ఏఈని నిర్లక్ష్య వైఖరిపై ప్రశ్నించారు. పక్క మండల ఏఈ అనునిత్యం పర్యవేక్షిస్తూ కాల్వలో అడ్డుగా ఉన్న కంపచెట్లను, రాళ్లను తొలగిస్తూ మండలానికి సమృద్ధిగా నీళ్లు తీసుకెళుతుంటే.. తమరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో ఏఈ మాట్లాడుతూ.. ఈ సమస్య తన పరిధి కాదని, ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పది రోజులుగా నీళ్ల కోసం అనేక ప్రయత్నాలు చేశామని, ఇక్కడ నుంచి జలాల్పురం వరకు కాలువలు పరిశీలించామని, కంపచెట్లను డీఈ హరికృష్ణ సమక్షంలో కొంతవరకు తొలగించామని తెలిపారు. అయినప్పటికీ నీటి సామర్థ్యం అంతగా లేకపోవడంతో ఇతర మండలాలకు నీరు వెళ్తుంది కానీ, అతి సమీపంలో ఉన్న తమ మండలానికి ఎందుకు రావడం లేదని రైతులు నిలదీశారు. డీఈ హామీ మేరకు నీటిని చివరి గ్రామాల వరకు అందించాలని కోరారు. నీరు అందనిపక్షంలో కలెక్టరేట్ వచ్చే వరకు ఇక్కడే ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. తుంగతుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీను నాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సీఐ నీటి పారుదల శాఖ ఉన్నత అధికారులతో ఫోనులో మాట్లాడి ధర్నా స్థలానికి ఇంజినీరింగ్ అధికారి జె.సత్యనారాయణను రప్పించారు. ఆయనకు రైతులు సమస్యను వివరించారు. ఈఈకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, మద్ధి సంజీవరెడ్డి, సైరెడ్డి వీరారెడ్డి, జక్కుల మల్లయ్య, తీగల మల్లారెడ్డి, బండారు రవీందర్‌రెడ్డి, బయ్య అశోక్, ఉప్పల పాపయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 20శాతం నిధులు కేటాయించాలి

తెలంగాణ విద్యాపరిరక్షణ కమిటీ డిమాండ్

అందరికీ నాణ్యమైన చదువుతోనే సామాజిక న్యాయం : అఖిల భారత విద్యాహక్కు వేదిక అధ్యక్షులు జగ్‌మోహన్‌సింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 20 శాతం నిధులను కేటాయించాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అఖిల భారత విద్యా హక్కు వేదిక అధ్యక్షులు జగ్‌మోహన్‌సింగ్ మాట్లాడుతూ దేశంలో ఫెడరలిజం, రాష్ట్రాల హక్కులు, రాజ్యాంగం కల్పించిన అధికారాలపై కేంద్రీకరించాలని చెప్పారు. అందరికీ నాణ్యమైన విద్యను అందించడం ద్వారానే సామాజిక న్యాయం దక్కుతుందని వివరించారు. పన్నులను జీఎస్టీ ద్వారా కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్నదనీ, రాష్ట్రాలకు వాటా ఇవ్వడం లేదని అన్నారు. రాజీవ్‌గాంధీ, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఫెలోషిప్‌లను కేంద్రం తగ్గించిందని విమర్శించారు. విద్యారంగం వ్యాపారంగా మారిందన్నారు. మరింత ప్రయివేటుపరం చేసేందుకే ఎన్ఈపీ-2020ని కేంద్రం తెచ్చిందని చెప్పారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు టెక్నాలజీని అందించాలని సూచించారు. ప్రభుత్వ విద్య బలోపేతం కావాలంటే అధిక నిధులను కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్షులు కె చక్రధర్‌రావు, ప్రధాన కార్యదర్శి జి హరగోపాల్, కార్యనిర్వాహక కార్యదర్శి కె లక్ష్మినారాయణ మాట్లాడుతూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) మార్గదర్శకాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యాకేంద్రీకరణలో భాగంగానే ఇది జరుగుతున్నదని విమర్శించారు. యూజీసీ మార్గదర్శకాలు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని, రాష్ట్రాల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేరళ ప్రభుత్వం యూజీసీ మార్గదర్శకాలను తిరస్కరించిందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం కూడా యూజీసీ మార్గదర్శకాలను తిరస్కరిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. రాష్ట్రంలో విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు తక్కువగా ఉంటున్నాయని వివరించారు. కొఠారి కమిషన్ సిఫారసుల ప్రకారం జీడీపీలో ఆరు శాతం, కేంద్ర బడ్జెట్‌లో పది శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులను కేటాయించాలని సూచించారు. రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 20 శాతం నిధులను కేటాయించి ఖర్చు చేయాలని కోరారు. విద్యకు 15 శాతం నిధులను కేటాయిస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల టీచర్ల సంఘం నాయకులు రవిచంద్ర, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి, టీపీటీఎఫ్ నాయకులు ప్రకాశ్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ ప్రదీప్, పీడీఎస్‌యూ నాయకులు మహేష్, అనిల్, ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

ఖనిజాన్వేషణే కీలకం

- వాటిద్వారానే కాలుష్య రహిత భారత్ నిర్మాణం : జాతీయస్థాయి కీలక ఖనిజాల సదస్సులో సింగరేణి సీఎండీ ఎన్ బలరాం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



బ్యాటరీ వాహనాలు, సోలార్ విద్యుత్, ఎలక్ట్రానిక్స్ వస్తు వినియోగం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో లిథియం, కోబాల్ట్, నికెల్ వంటి కీలక ఖనిజాలకు అనూహ్య డిమాండ్ ఏర్పడుతోందనీ, దీనిలో భారతదేశం స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రభుత్వరంగ సంస్థల కృషి మరింత పెరగాల్సి ఉంటుందని సింగరేణి కాలరీస్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం అన్నారు. క్రిటికల్ మినరల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కీలక ఖనిజాలు అంశంపై శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2070 నాటికి భారతదేశాన్ని కర్బన ఉద్గార రహిత (నెట్ జీరో) దేశంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామనీ, ఇది నెరవేరాలంటే దేశీయ ఖనిజ పరిశ్రమలు కీలక ఖనిజాల ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. దీనికోసం ప్రభుత్వరంగ సంస్థల మధ్య సమన్వయం, సహకారం ఎంతో అవసరమని చెప్పారు అన్నారు. ఇప్పటి వరకు కీలక ఖనిజాలను విదేశాలనుంచే ఎక్కువ శాతం దిగుమతి చేసుకుంటున్నామనీ, ఇటీవలే కేంద్ర ప్రభుత్వం 30 రకాల కీలక ఖనిజాల జాబితాను విడుదల చేసి, వాటిని దేశీయంగా ఉత్పత్తి చేయాలని నిర్ణయం తీసుకున్నదని వివరించారు. దీనికోసం సింగరేణి సంస్థ కీలక ఖనిజాన్వేషణ పరిశ్రమ రంగంలోకి ప్రవేశించేందుకు సిద్ధంగా ఉందన్నారు. దీనికోసం ఈ ఏడాది జనవరి మొదటి వారంలో ఐఐటి హైదరాబాద్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి విడుదలయ్యే ఫ్లయ్ యాష్, క్లే, ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ నుంచి రేర్ ఎర్త్ ఎలిమెంట్స్‌ను వెలికితీసే అంశంపై పరిశోధనలు ప్రారంభమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి, సింగరేణి ఈడీ కోల్ మూమెంట్, జీ.ఎం కో-ఆర్డినేషన్ ఎస్‌డీఎమ్ సుభాని, క్రిటికల్ మినరల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు డాక్టర్ చైతన్యమొయి గంగూలీ, మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ హామిల్టన్, సింగరేణి జనరల్ మేనేజర్లు మనోహర్, నారాయణరావుతో పాటు మిథానీ, న్యూక్లియర్ ఫ్యూయల్ కార్పొరేషన్, వేదాంత తదితర కంపెనీల అధికారులు, ఐ.ఐ.టి సంస్థల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా ప్రాసేఫ్ బయోలాజికల్స్‌లో మందుల తయారీ

డీసీఏ దాడుల్లో వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

లైసెన్స్ లేకుండా ప్రొసేఫ్ బయోలాజికల్స్ సంస్థ మందులను తయారు చేస్తున్నట్టు డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారుల దాడుల్లో బయటపడింది. విశ్వసనీయ సమాచారం మేరకు అధికారులు సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం, మల్లెపల్లె గ్రామంలోని ప్రొఫెసర్ బయోలాజికల్స్‌పై దాడులు చేశారు. ఈ దాడుల్లో 54.75 లక్షల విలువైన మందులను సీజ్ చేశారు. నమూనాలను పరీక్షల కోసం పంపించారు. మంచిర్యాల జిల్లాలో ఆహార ఉత్పత్తుల పేరుతో మందులను తయారు చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ప్రొకాల్క్ జెడ్ -డ్రాప్స్ (జింక్ గ్లూకోనెట్ ఓరల్ డ్రాప్స్) ను హైదరాబాద్ విజయనగర్ కాలనీలోని క్యూర్ జెన్ ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్ మార్కెటింగ్ చేస్తున్నది. దీనిని ఢిల్లీలోని జీఎక్స్ హెల్త్ కేర్ తయారు చేస్తున్నది.

బంధం బలంగా...

భార్యాభర్తలంటే కేవలం ప్రేమను పంచుకోవడమే కాదు.. ఒకరి అభిరుచుల్ని మరొకరు గౌరవించుకోవడం, ఓదార్పునివ్వడం, సర్‌ప్రైజ్ చేసుకోవడం... ఇలాంటివన్నీ దాంపత్య బంధాన్ని దృఢంగా ఉంచుతాయి. అయితే ప్రస్తుతం కాలంలో నిత్య జీవితంలో బిజీగా ఉంటూ భార్యాభర్తలిద్దరూ మాట్లాడుకునే సమయం కూడా తగ్గిపోయింది. ఇదే కొనసాగితే వైవాహిక బంధం బీటలు బారే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. దీన్ని అధిగమించడానికి ప్రయత్నించాలంటున్నారు. బంధాన్ని బలోపేతం చేసుకోవడానికి వీటిని పాటించమని చెబుతున్నారు.



రోజువారీ పనిలో ఎంత బిజీగా ఉన్నా భాగస్వామిని నిర్లక్ష్యం చేయకూడదు. ఉదయం నిద్ర లేచిన వెంటనే ప్రేమగా ఓ పలకరింపు అవతలివారిని మీకు దగ్గర చేస్తుంది. ఈ రోజు మీ జీవితంలో ఏదైనా మంచి జ్ఞాపకంతో ముడిపడి ఉంటే మరోసారి గుర్తుకు తెచ్చుకోండి. ఆ సంతోషాన్ని పంచుకోండి. ఇవి ఉత్సాహాన్ని ఇస్తాయి. మీ భాగస్వామితో మాట్లాడేటప్పుడు ముఖంలో ప్రశాంతతను చెరగనివ్వకండి. మీ పెదాలపై కనిపించే ఆ చిరునవ్వు అవతలి వాళ్లని ఎంతటి సమస్య నుంచైనా బయటపడేలా చేస్తుంది. మీ తోడు వాళ్లలో భరోసాను నింపుతుంది.

వారానికొకసారైనా ఇద్దరూ కలిసి మనసుకు నచ్చిన చోటకు వెళ్లడానికి సమయాన్ని కేటాయించుకోవాలి.

కానుకలు ఇచ్చుకోండి

ఐ లవ్యూ... ప్రేమికులే కాదు భార్యాభర్తలు కూడా చెప్పుకోవాల్సిన మాట ఇది. అయితే ఇలా చెప్పుకోకపోతే ప్రేమ లేదని మాత్రం కాదు. అలాగని రోజూ చెప్పినా బోర్ కొడుతుంది కూడా. అందుకే అప్పుడప్పుడు విభిన్న రీతుల్లో, వేర్వేరు భాషల్లో ఐలవ్యూ చెప్పడానికి ప్రయత్నించండి. ఇది ఇద్దరికీ సరదాను పంచుతుంది. ఇక ప్రత్యేకమైన రోజుల్లో అంటే పుట్టినరోజులు, పెండ్లి రోజు వంటివైతే మీ భాగస్వామికి నచ్చిన మంచి కానుక కొని దాన్ని ఇస్తూ ఈ మాట చెబితే మరింత సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. ఒకటి మాత్రం గుర్తుపెట్టుకోండి ప్రేమించుకున్నప్పుడు సమయంతో సంబంధం లేకుండా చెప్పుకునే ఐలవ్‌యూ అనే పదం పెండ్లి తర్వాత కూడా చెప్పడం మరవద్దు.



పాత జ్ఞాపకాలతో...

ఇరువురూ కలిసి నచ్చిన వంటకం చేసుకుంటూ గత అనుభవాల గురించి మాట్లాడుకుంటే గంటలు కూడా నిమిషాల్లా గడిచిపోతాయి. అలాగే భాగస్వామి కబోర్డు సర్దుతూ ఆయా దుస్తుల వెనక ఉన్న జ్ఞాపకాలను పంచుకుంటే మనసు ఆనందంతో నిండుతుంది. అప్పుడప్పుడు మీ ఆల్బమ్ తిరగేయండి. వేడి కాఫీ తాగుతూ ఆ ఫొటోల వెనక కున్న సంఘటనల గురించి ఒకరికొకరు చెప్పుకోవాలి. మీ ఇద్దరూ కలిసి ఉన్న ఫొటోను అందంగా ఫ్రేమ్‌లో బిగించి కానుకగా అందించి సర్‌ప్రైజ్ చేయండి. ఆందోళన, ఒత్తిడి వల్ల ఎదుటి వారిపై తగ్గుతున్న ప్రేమ తిరిగి గుర్తుకొస్తుంది. ఆ జ్ఞాపకాలు తిరిగి మీ బంధానికి వారధిగా మారతాయి. ఆఫీసుకెళ్లాక ప్రేమగా ఓ చిన్న మెసేజ్, తిన్నారా లేదా అనే సమాచారాన్ని తెలుసుకోవడం వంటివన్నీ ఎదుటివారికి ఆనందాన్ని కలిగిస్తాయి. ఆ రోజు ఆఫీసు విశేషాలు చెబుతుంటే మీరు మంచి శ్రోతగా ఉండండి. దాంతో వారి మనసులోని ఆందోళనలాంటిది ఉన్నా తేలికపడుతుంది.

హాయిగా నవ్వుకోండి

ఓ నవ్వు జీవితంలోని బాధల్ని మరిపిస్తుంది. అలాగే భార్యాభర్తల మనసుల్ని కూడా మరింత దగ్గర చేస్తుంది. కాబట్టి ఖాళీ సమయాల్లో దంపతులిద్దరూ



కలిసినప్పుడు అనవసర విషయాలతో కాలక్షేపం చేయకుండా జోక్స్, నవ్వు తెప్పించే చిన్నప్పటి సంగతుల వంటివి పంచుకోవాలి. అలాగే ఉదయం లేదా సాయంత్రం ఇద్దరూ కలిసి చేతిలో చెయ్యేసి కాసేపు అలా నడుస్తూ రొమాంటిక్ వాక్ చేయడం మంచిది. అలాగే సమయం దొరికినప్పుడైనా ఇద్దరూ కలిసి తమకు నచ్చిన కామెడీ, రొమాంటిక్ సినిమాలు చూడడం అలవాటు చేసుకోవాలి. ఇలా వీలైనప్పుడల్లా దంపతులిద్దరూ కలిసి రొమాంటిక్‌గా గడపడం వల్ల వారి మధ్య సాన్నిహిత్యం మరింతగా పెరిగే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు.

ఫీలింగ్స్ పంచుకోండి

దంపతులిద్దరూ రోజూ ఎవరి పనులతో వారు బిజీగా ఉంటారు. దాంతో ఒకరినొకరు పట్టించుకునే తీరికే దొరక్కపోవచ్చు. అయితే కనీసం సెలవు రోజునో లేదా అలా బయటకు వెళ్లినప్పుడో లేదంటే ఏదైనా పండగలు, ప్రత్యేక సందర్భాలప్పుడో ఒకరికొకరు ఆకర్షణీయంగా కనిపించేలా అందంగా రెడీ కావాలి. అక్కడితో ఆగిపోకుండా ఆ క్షణం భాగస్వామిపై మీకున్న ఫీలింగ్‌ని వారితో చెప్పేయాలి. దగ్గరికి తీసుకొని లేదంటే నుదుటిపై ఓ ముద్దు పెడుతూ, ప్రేమగా హత్తుకుంటూ రొమాంటిక్‌గా మీ మనసులోని భావాల్ని వ్యక్తం చేయాలి. దీని వల్ల ఎదుటి వారు ఎంతో హ్యాపీగా ఫీలవుతారు. ఇక ఇద్దరి మధ్య ప్రేమ హద్దులు దాటుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ■

కొవ్వు కరగాలంటే...


కొలెస్ట్రాల్ రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి మంచి కొలెస్ట్రాల్, మరొకటి చెడు కొలెస్ట్రాల్. చెడు కొలెస్ట్రాల్‌ని ఎల్‌డిఎల్ అంటారు. ఇది రక్తనాళాలలో అడ్డుపడి రక్తాన్ని గుండెకి చేరకుండా చేస్తుంది. దీని వల్లే గుండె పోటు, స్ట్రోక్ వంటి సమస్యలొస్తాయి. కొలెస్ట్రాల్ తగ్గాలంటే బ్రేక్‌ఫాస్ట్‌లో మంచి ఐటెమ్ తీసుకోవాలి. ఎందుకంటే రాత్రంతా ఏం తినకుండా ఉంటాం. కడుపు ఖాళీగా ఉంటుంది. ఈ టైమ్‌లో మంచి ఫుడ్ తీసుకుంటే పోషకాలు త్వరగా బాడీ అబ్జార్వ్ చేసుకుంటుంది. అందుకోసం ఏయే ఫుడ్స్ తీసుకోవాలో తెలుసుకోండి.

ఓట్స్..

ఓట్స్ ఫైబర్‌కి మంచి మూలం. ఫైబర్ కొలెస్ట్రాల్‌ని కరిగించి బయటికి పంపుతుంది. ఇందుకోసం పీచుపదార్థాలు తీసుకుంటే గుండెకి మంచిది. ఓట్స్‌ని చాలా రకాలుగా తీసుకోవచ్చు. మసాలా ఓట్స్, పాలతో కలిపి తీసుకోవచ్చు.

ఎగ్

ఉదయాన్నే ఖాళీ కడుపుతో పచ్చసొనతో గుడ్డని తీసుకోండి. పాలకూర వంటి ఫైబర్ రిచ్ ఫుడ్‌తో ఆకుకూరలు తినండి. ఫైబర్‌తో కూడిన ప్రోటీన్ తినడం



వల్ల కొలెస్ట్రాల్ కరుగుతుంది. ఈ బ్రేక్ ఫాస్ట్‌లో ప్రోటీన్, ఫైబర్ పుష్కలంగా ఉంటుంది.

నానబెట్టిన బాదం..

బాదంని నానబెట్టి పరగడపున తినడం చాలా మంచిది. హార్వర్డ్ యూనివర్శిటీ ప్రకారం, ప్రతిరోజూ బాదం తింటే చెడు కొలెస్ట్రాల్ 5 శాతం తగ్గుతుంది. వీటి పాలని తీసుకోవడం వల్ల రక్తంలోని మలినాలు కూడా తగ్గిపోతాయి. ప్రతిరోజూ రాత్రి బాదంపప్పుని నానబెట్టి ఉదయాన్నే తింటే కొలెస్ట్రాల్ కచ్చితంగా తగ్గుతుంది.

పనీర్..

పాలతో తయారైన పనీర్‌ని తీసుకోవడం వల్ల కూడా కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. వీటిని కూరలా వండి తినవచ్చు. లేదా చపాతీ పిండిలో కలిపి పరాఠాల్లా కూడా చేసుకుని తీసుకోవచ్చు. ■

ఎమ్మెల్సీ ఎన్నికలకు చురుగ్గా ఏర్పాట్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ నెల 27న జరగనున్న మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రులు, వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలంగాణ ఎన్నికల ముఖ్య అధికారి సి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీఆర్కేభవన్ నుంచి ఎన్నికల సన్నద్ధతపై సంబంధిత జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతా, సౌకర్యాలు, వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు, మైక్రో అబ్జర్వర్‌ల నియామకం, పోలింగ్ సిబ్బందికి శిక్షణ, బ్యాలెట్ బాక్సుల ఓవరాలింగ్ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేసి, పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూంల వద్ద 24 గంటల భద్రత, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా కలెక్టర్లు సీఈవోకు వివరించారు. ఓటరు స్లిప్పుల పంపిణీ, మైక్రో అబ్జర్వర్ శిక్షణ గడువులోగా పూర్తి చేయాలని సీఈవో వారికి సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు సీఈవో లోకేశ్‌కుమార్, డిప్యూటీ సీఈవో సత్యవాణి, ఈవీఎం ఇన్‌చార్జి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ జరిగే జిల్లాల్లో 27న స్పెషల్ క్యాజువల్ లీవ్

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఈ నెల 27న ఎన్నికలు జరిగే జిల్లాల్లో ప్రత్యేక సాధారణ సెలవు ప్రకటిస్తున్నట్టు తెలంగాణ సీఈవో సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం రాష్ట్ర శాసన మండలి ఎన్నికల కోసం సాధారణ సెలవు దినాన్ని ప్రకటించేందుకు ప్రయివేట్ సంస్థలకు ఎలాంటి నిబంధన లేదని తెలిపారు. ఈ క్రమంలో ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు ప్రత్యేక క్యాజువల్ లీవ్‌ను మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయుల నియోజకవర్గాల్లో నమోదిత ఓటర్లుగా ఉన్న తమ ఉద్యోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేట్, వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక సంస్థలను ఆదేశించారు.

ఒక్క ఎకరాకు నీళ్లివ్వలే..

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్‌ఎస్ పాలనలో దాదాపు 12 లక్షల ఎకరాల ఆయకట్టుకు పాలమూరులో నీళ్లు అందించినట్టు తెలిపారు. అదే విధంగా తాము తుమ్మిళ్ల ఎత్తిపోతల పూర్తి చేసి రాజోలి బండ పూర్తి ఆయకట్టుకు నీళ్లందించామని, మిషన్ కాకతీయతో చెరువులను బాగు చేసి మరో రెండు లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించామని చెప్పారు.

పాలమూరును ఎడారిగా మార్చిన పాపం మాత్రం టీడీపీ, కాంగ్రెస్ పార్టీలదేనని విమర్శించారు. ఆ రెండు పార్టీలతో అంటకాగి పాలమూరుకు ద్రోహం చేసిన చరిత్ర సీఎం రేవంత్ రెడ్డిదేనని చెప్పారు. చంద్రబాబుకు పాదసేవ చేస్తూ పాలమూరు ప్రయోజనాలను కాలరాశారని తెలిపారు. నదీ జలాల్లో కాంగ్రెస్ చేస్తున్న ద్రోహానికి వ్యతిరేకంగా గతంలో అసెంబ్లీని 40 రోజులు స్తంభింపజేశామని గుర్తుచేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో తాము 90 శాతం పనులు పూర్తి చేశామనీ, మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయకుండా ప్రాజెక్టు పనులను నిలిపేశారని విమర్శించారు. ఆ ప్రాజెక్టు పూర్తయితే కొడంగల్, నారాయణపేటకు కూడా నీళ్లు వస్తాయనీ, అయితే కమిషన్ల కోసమే నారాయణపేట ఎత్తిపోతల పథకాన్ని తెరమీదకు తెచ్చారని తప్పుపట్టారు. 2014 వరకు కల్వకుర్తి, బీమా, నెట్టంపాడు, కోయిల్ సాగర్ ప్రాజెక్టుల ద్వారా 27 వేల ఎకరాలే సాగైతే, ప్రాజెక్టులు పూర్తి చేసి ఆరున్నర లక్షల ఎకరాలకు నీళ్లిచ్చినట్టు తెలిపారు. జూరాలకు సంబంధించి కర్నాటకలో ఉన్న సబ్మర్జెన్స్ కాంపెన్సేషన్ చెల్లించి పూర్తిస్థాయిలో నీటిని నింపి లక్ష ఎకరాల పూర్తి ఆయకట్టుకు నీరు అందించిన ఘనత కేసీఆర్ దేనని కొనియాడారు. దవడలే పగలగొట్టాల్సి వస్తే ఏపీ చేస్తున్న కృష్ణా జలాల దోపిడీ ఆపలేకపోయిన రేవంత్ రెడ్డి దవడలే పగలగొట్టాలన్నారు. నిందలు వేయడం మాని నదీజలాల్లో తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలని కోరారు.

సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని..అందుకోసం ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రానున్న బడ్జెట్‌లో రూ.మూడువేల కోట్లతో ఎస్సీ, ఎస్టీ యువతకు రెండు నెలల వ్యవధిలో స్వయం ఉపాధి పథకాలు రూపొందించాలని ఆయన ఉన్నతాధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, సంక్షేమ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష నిర్వహించారు. ఉపాధి పథకాలకు సంబంధించిన ప్రణాళికలను వెంటనే సిద్ధం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. రాష్ట్రాన్ని పదేండ్ల పాటు పాలించిన బీఆర్‌ఎస్ ఎస్సీ, ఎస్టీ యువతకు స్వయం ఉపాధి పథకాలను పూర్తిగా పక్కన పెట్టిందని విమర్శించారు. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలకు సంబంధించి అద్దెలు, డైట్ బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించాలని అధికారులకు సూచించారు. శాఖల వారీగా ఈ అంశాల్లో ఉన్న బకాయిల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటికి సంబంధించి శాఖల అధికారులు బాధ్యత తీసుకుని ఆర్థిక శాఖ నుంచి బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు చేయించుకోవాలని సూచించారు. మంత్రులు,



ఎమ్మెల్యేలు, సీనియర్ అధికారులు సంక్షేమ హాస్టళ్ళు, గురుకులాల పర్యటన కార్యక్రమం నిరంతరం కొనసాగేలా సంక్షేమ శాఖ అధికారులు ఫాలో అప్ చేసుకోవాలని ఆదేశించారు. పర్యటనలకు సంబంధించిన షెడ్యూల్‌ను సంక్షేమ శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు, సీనియర్ అధికారులకు గుర్తుచేయాలని కోరారు. సబ్ ప్లాన్ చట్టం ప్రకారం వివిధ శాఖల నుంచి ఎస్సీ, ఎస్టీ శాఖలకు రావాల్సిన నిధులపై కసరత్తు చేసి సీరియస్‌గా ఫాలోఅప్ చేయాలని తెలిపారు. కేంద్ర పథకాలకు సంబంధించి ఎప్పటికప్పుడు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించి నిధులు రాబట్టడంలో వేగం పెంచాలని కోరారు. ఆదిలాబాద్ నుంచి భద్రాచలం వరకు అటవీ హక్కుల చట్టం కింద లక్షలాది మంది గిరిజనులకు భూ పంపిణీ జరిగిందని తెలిపారు. ఈ భూముల అభివృద్ధికి ఎస్సీ ,ఎస్టీ శాఖల అధికారులు విద్యుత్తు, వ్యవసాయ, అటవీ, ఉద్యాన శాఖ అధికారులతో సంయుక్తంగా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆ భూముల్లో సోలార్ పవర్ ఆధారంగా సాగు విస్తీర్ణాన్ని పెంచడం, అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు అవకాడో, వెదురు వంటి పంటల సాగుకు ప్రణాళికలు రూపొందించాలనీ, రాబోయే రెండేండ్లలో ఫలితాలు అందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ ఆవాసాల్లో నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టి ఆయా వర్గాల ఆదాయం పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సంక్షేమ శాఖ అధికారులు ఆయా వర్గాల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఏ సూచన చేసినా అమలు చేయటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు, ఎస్సీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, ఎస్టీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శరత్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రెటరీ హరిత, ఇరిగేషన్ సెక్రెటరీ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

విధానపరమైన జాప్యాలుండవ్

(మొదటిపేజీ తరువాయి)

అన్వేషించటం, రాష్ట్రంలో పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణాన్ని నిర్మించే దిశగా మా చొరవలను వీక్షించటం లక్ష్యంగా పెట్టుకున్నది. వామపక్ష ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులు గణనీయమైనవి. మానవాభివృద్ధి సూచికలలో అధిక స్కోరును సాధించటంలో చెప్పుకోదగ్గ ఉదాహరణగా నిలిచిన కేరళ.. ఇప్పుడు పెట్టుబడి కేంద్రంగా హోదా సాధించే దిశగా దూసుకుపోతున్నది" అని ఆయన అన్నారు.

ప్రక్రియల సరళీకరణలో కేరళ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సులభతర చట్టం, 2019ను సీఎం కోట్ చేశారు. రవాణా మాలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం చాలా దృష్టి పెట్టిందన్నారు. జాతీయ రహదారి 66 విస్తరణకు కావాల్సిన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం కంట్రిబ్యూట్ చేసిందన్నారు. హైస్పీడ్ రైళ్లకు అవసరమైన రైల్వే అభివృద్ధి కోసం కేంద్రం నుంచి అప్రూవల్స్ కోసం అన్ని చర్యలూ తీసుకుంటున్నామని తెలిపారు. స్టార్టప్ రంగంలో కేరళ భారీ పురోగతి సాధించిందని చెప్పారు. " గత ఎనిమిదేండ్లలో కేరళలో రూ.5800 కోట్ల పెట్టుబడులతో, 62 వేల ఉద్యోగావకాశాల కల్పనతో 6200 స్టార్టప్‌లు నెలకొన్నాయి. 2026 నాటికి 15 వేల స్టార్టప్‌లను నెలకొల్పి, లక్ష ఉద్యోగావకాశాలను సృష్టించాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో కేరళ చొరవ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. 2021, జులై నుంచి 2023, డిసెంబర్ మధ్య స్టార్టప్ గ్రోత్ 254 శాతం పెరిగిందని గ్లోబల్ స్టార్టప్ ఎకో-సిస్టమ్ నివేదిక వెల్లడించింది" అని సీఎం వివరించారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయెల్, కేంద్ర నైపుణ్యాభివృద్ధి సహాయ మంత్రి జయంత్ చౌదరీ, యూఏఈ ఆర్థిక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీలతో పాటు కేరళ ప్రతిపక్ష నేత వి.డి. సతీషన్, కేరళ పరిశ్రమల మంత్రి పి. రాజీవెలు పాల్గొన్నారు.

కంప్లయింట్ చేసిన వ్యక్తి చనిపోతే..కేసు విచారణ ఎలా?

(మొదటిపేజీ తరువాయి)

లేనపుడు ఫిర్యాదుపై కింది కోర్టు విచారణ చేయలేదని అభిప్రాయపడింది. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ వల్లె నాగేశ్వర్‌రావు స్పందిస్తూ, ఫిర్యాదుదారు లేకపోయినా విచారణ చేపట్టవచ్చనీ, సుప్రీంకోర్టు ఆర్డర్ కూడా ఉందని చెప్పారు.

దీంతో విచారణను 24కు వాయిదా వేసింది. మేడిగడ్డ కుంగుబాటుకు అవినీతి కారణమనీ, ఇందుకు నాటి సీఎం కె.చంద్రశేఖర్‌రావు, నాటి ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావు, అప్పటి అధికారే కారణమనే ఫిర్యాదును మేజిస్ట్రేట్ కోర్టు కొట్టివేసింది.

దీనిపై రివిజన్ పిటిషన్‌ను విచారించేందుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా జడ్జి నిర్ణయం తీసుకున్నారు. కేసీఆర్, హరీష్ ఇతరులకు నోటీసులు ఇచ్చారు. వీటిని కేసీఆర్, హరీష్ హైకోర్టులో సవాలు చేసిన పిటిషన్లను శుక్రవారం జస్టిస్ కె.లక్ష్మణ్ విచారించారు. పీపీ వాదిస్తూ రూ.1.30 లక్షల కోట్లు దుర్వినియోగానికి చెందిన ఫిర్యాదును ప్రజల ఆస్తి కోణంలో చూడాలని కోరారు. సీఆర్‌పీసీ సెక్షన్ 256 ప్రకారం ఫిర్యాదుదారు లేకపోయినా విచారణ చేయవచ్చునని చెప్పారు. గడువు కావాలని కోరగా, తదుపరి విచారణ 24కి వాయిదా పడింది.

ఆదాయం అంతంతే..

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నార్థకంగా మారింది.

ఆరు గ్యారెంటీలతోపాటు విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి రిటైర్మెంట్ బెనిఫిట్లు, మరణించిన ఉద్యోగులు, సిబ్బందికి ఇవ్వాల్సిన ఈఎల్స్ తదితరాల కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించాల్సి ఉంది. బీఆర్‌ఎస్ హయాం నుంచి పేరుకుపోయిన ఈ బకాయిల కోసం బాధితులు సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వీరికి చెల్లించేందుకు డబ్బుల్లేకపోవటంతో ఏం చేయాలో పాలుపోక ఆర్థికశాఖ ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదాయ, వ్యయాలను సమతూకం చేయటం ప్రభుత్వానికి కత్తిమీద సాములా తయారైంది. భూముల అమ్మకాల ద్వారా ఎంతో కొంత మొత్తంలో ఆదాయాన్ని సమకూర్చుకోవాలని సర్కారు భావించినా, అది అంతగా వర్కవుట్ కాలేదని ఆర్థికశాఖ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో మార్చిలో ప్రవేశపెటబోయే బడ్జెట్ కూర్పు అనేది అనుకున్నంత సులభంగా ఉండబోదని ఆయా వర్గాలు అభిప్రాయపడ్డాయి. మరి ఆదాయంపై తాను వేసుకున్న అంచనాలను సర్కారు మార్చి నాటికి ఎంతమేరకు చేరుకుంటుందో వేచి చూడాలి.

ఇంకెక్కడి బ్రిక్స్..చచ్చిపోయింది

(మొదటిపేజీ తరువాయి)

పది దేశాలతో ఏర్పడిన అంతర్ ప్రభుత్వ సంస్థ. ఇందులో మన దేశంతో పాటు బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సభ్య దేశాలు. బ్రిక్స్ దేశాలు డాలర్‌ను బలహీనపరుస్తున్నాయని, అందుకే 150 శాతం సుంకాలు విధిస్తానని తాను హెచ్చరించానని ట్రంప్ చెప్పారు. 'బ్రిక్స్ దేశాలు డాలర్‌ను నాశనం చేయాలని ప్రయత్నిస్తున్నాయి. కొత్త కరెన్సీని సృష్టించాలని అనుకుంటున్నాయి. డాలర్‌ను బలహీనపరుస్తామని ఏ బ్రిక్స్ సభ్యదేశం చెప్పినా దానిపై 150 శాతం సుంకం విధిస్తానని నేను అధికారంలోకి రాగానే అన్నాను. మీ వస్తువులు మాకు అవసరం లేదని చెప్పాను. దీంతో బ్రిక్స్ దేశాలు కకావికలమై పోయాయి' అని తెలిపారు. 150 శాతం సుంకం విధిస్తామని తాను చెప్పిన తర్వాత బ్రిక్స్ నోట మాట రాలేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. వాటికి ఏం జరిగిందో తనకు తెలియదని, కానీ వాటి నుండి ఎలాంటి స్పందన రాలేదని చెప్పారు. కాగా డాలర్‌తో ఆటలాడాలని అనుకుంటే వంద శాతం సుంకాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఈ నెల 13న ట్రంప్ బ్రిక్స్ దేశాలను హెచ్చరించారు. బ్రిక్స్ జీవం కోల్పోయిందని వ్యాఖ్యానించారు. అమెరికా డాలర్ స్థానంలో ఏ ఇతర కరెన్సీని ప్రవేశపెట్టాలని వారు అనుకున్నా వారితో వాణిజ్యం నెరపబోమని బెదిరించారు. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు కూడా ట్రంప్ ఇలాంటి హెచ్చరికలే చేశారు. గత సంవత్సరం జరిగిన 15వ బ్రిక్స్ సదస్సు ప్లీనరీ సమావేశంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లలో డాలర్ ప్రాధాన్యతను తగ్గించాలని పిలుపునిచ్చారు. బ్రిక్స్ దేశాలు జాతీయ కరెన్సీలలోనే పరిష్కారాలను విస్తరించుకోవాలని, బ్యాంకుల మధ్య సహకారాన్ని పెంచుకోవాలని ఆయన సూచించారు.

బీఆర్‌ఎస్ నిర్లక్ష్యంతోనే కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం

మంత్రి ఉత్తమ్ విమర్శ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగానే కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రులుగా పని చేసిన బీఆర్‌ఎస్ నేతలకు కష్ణా బేసిన్‌లో ఉన్న ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని వ్యాఖ్యానించారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన ప్రాజెక్టులను గత పదేండ్లుగా నిర్లక్ష్యం చేశారని గుర్తు చేశారు. రూ.1.81 లక్షల కోట్లను, తెలంగాణ ప్రజలను తాకట్టు పెట్టి అప్పులు తీసుకొచ్చినా కృష్ణా జలాల విషయంలో అన్యాయం చేసింది బీఆర్‌ఎస్ మాత్రమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్ణా బేసిన్‌లో ఉన్న ఏ ప్రాజెక్టును కూడా పూర్తి చేయకపోగా నిధులు కేటాయించడంలో కూడా పూర్తిగా నిర్లక్ష్యం చేశారని చెప్పారు. దీంతో ప్రతియేటా 100 టీఎంసీల నీటిని నిలువ చేసుకునే సామర్థ్యాన్ని దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులు కోల్పోవడం జరిగిందన్నారు.



ప్రసారదారుపై పీసీబీ ఫైర్

ఐసీసీకి ఫిర్యాదు చేసిన పాక్ క్రికెట్ బోర్డు

దుబాయ్ : ఐసీసీ 2025 చాంపియన్స్ ట్రోఫీ మొదలైనా..పాకిస్థాన్ స్టేడియంలో భారత జాతీయ జెండా అంశం, భారత్‌లో టెలివిజన్ ప్రసారాల్లో పాకిస్థాన్ పేరు వంటి అంశాలు వివాదాస్పదం అవుతూనే ఉన్నాయి. చాంపియన్స్ ట్రోఫీ గ్రూప్-ఏలో గురువారం దుబాయ్ వేదికగా భారత్, బంగ్లాదేశ్ మ్యాచ్ జరిగింది. భారత్‌లో స్టార్‌స్పోర్ట్స్ ఐసీసీ టోర్నమెంట్ల ప్రసార హక్కులు సొంతం చేసుకుంది. సాధారణంగా ఐసీసీ టోర్నమెంట్లలో టెలివిజన్ స్క్రీన్‌కు పైభాగం ఎడమవైపున టోర్నమెంట్ పేరు, ఆతిథ్య దేశం పేరు గ్రాఫిక్స్ డిజైన్ వస్తాయి. టోర్నమెంట్ ఆరంభ మ్యాచ్ పాకిస్థాన్, న్యూజిలాండ్ పోరుకు ప్రసారదారు ఈ డిజైన్‌ను ముందుగానే ఐసీసీకి పంపించారు. కానీ భారత్, బంగ్లాదేశ్ మ్యాచ్ ప్రసారాల్లో టోర్నమెంట్ పేరును చూపించినా.. ఆతిథ్య దేశం పాకిస్థాన్ పేరును విస్మరించారు. దీంతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ప్రసారదారుపై మండిపడింది. దీనిపై ప్రసారదారు నుంచి వివరణ ఇవ్వాలని ఐసీసీకి పీసీబి లేఖ రాసింది. సాంకేతిక కారణంతోనే ఆతిథ్య దేశం పేరు కనిపించలేదని, ఇందులో వివాదానికి తావులేదని ఐసీసీ నచ్చజెప్పినా.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మాత్రం అసంతృప్తితో రగులుతున్నట్టు సమాచారం. చాంపియన్స్ ట్రోఫీలో భారత్, పాకిస్థాన్ ఆదివారం దుబాయ్‌లో ముఖాముఖి తలపడనున్న సంగతి తెలిసిందే.

సఫారీల సవారీ

అఫ్గాన్‌పై 107 పరుగులతో గెలుపు
ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ 2025

కరాచి (పాకిస్థాన్) : ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ తొలి చాంపియన్ దక్షిణాఫ్రికా.. 2025 చాంపియన్స్ ట్రోఫీ వేటను అదిరే విజయంతో ఆరంభించింది. గ్రూప్-బిలో అఫ్గనిస్థాన్‌తో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 107 పరుగుల తేడాతో ఏకపక్ష విజయం నమోదు చేసింది. 316 పరుగుల భారీ ఛేదనలో అఫ్గనిస్థాన్ చతికిల పడింది. ఏ దశలోనూ ఆ జట్టు గెలుపు తీరం వైపు సాగలేదు. రెహమత్ షా (90, 92 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) భారీ అర్థ సెంచరీతో ఆకట్టుకున్నాడు. సఫారీ బౌలర్లను ఎదుర్కొని స్ఫూర్తిదాయక ఇన్నింగ్స్ నమోదు చేశాడు. కానీ సహచర బ్యాటర్ల నుంచి రెహమత్‌కు మద్దతు లభించలేదు. రెహ్మానుల్లా గుర్బాజ్ (10), ఇబ్రహీం జద్రాన్ (17), సెదిఖిల్లా (16), హష్మతుల్లా షాహిది (0), అజ్మతుల్లా ఓమర్‌జాయ్ (18), మహ్మద్ నబి (8), గుల్బాదిన్ నయిబ్ (13) నిరాశపరిచారు. ఆఖర్లో రషీద్ ఖాన్ (18, 13 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్‌తో ఆ జట్టు స్కోరు 200 పరుగులు దాటించాడు. సఫారీ పేసర్లు కగిసో రబాడ (3/36), లుంగిసాని ఎంగిడి (2/56), ముల్డర్ (2/36) రాణించటంతో అఫ్గనిస్థాన్ 43.3 ఓవర్లలో 208 పరుగులకే కుప్పకూలింది. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 6 వికెట్లకు 315 పరుగులు చేసింది. ఓపెనర్ రియాన్ రికెల్టన్ (103, 106 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో చెలరేగాడు. వాన్‌డర్ డసెన్ (52, 46 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఎడెన్ మార్‌క్రమ్ (52 నాటౌట్, 36 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) సహా కెప్టెన్ తెంబ బవుమా (58, 76 బంతుల్లో 5 ఫోర్లు) అర్థ సెంచరీలతో కదం తొక్కారు. గాయం కారణంగా హెన్రిక్ క్లాసెన్ అఫ్గాన్‌తో మ్యాచ్ ఆడలేదు. కెరీర్ తొలి సెంచరీ సాధించిన దక్షిణాఫ్రికా ఓపెనర్ రియాన్ రికెల్టన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. గ్రూప్-బి తదుపరి మ్యాచుల్లో ఆస్ట్రేలియాతో దక్షిణాఫ్రికా తలపడనుండగా.. ఇంగ్లాండ్‌తో అఫ్గనిస్థాన్ ఆడనుంది.





బీసీసీఐలో సరికొత్త రాజకీయం!

సంయుక్త కార్యదర్శిగా రోహన్ దేశాయ్

ముంబయి : భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) రాజకీయాలు సరికొత్తగా సాగుతున్నాయి. సహజంగా బీసీసీఐలో బలమైన రాష్ట్ర క్రికెట్ సంఘాలు పెత్తనం చెలాయిస్తాయి. ముంబయి, ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటక సహా గుజరాత్, బరోడా, విదర్భ, మహారాష్ట్ర క్రికెట్ సంఘాలు ఆఫీస్ బేరర్ల పదవులను పంచుకోవటం పరిపాటి. బోర్డు కార్యదర్శి పదవి వదులుకుని జై షా ఐసీసీ చైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత.. బీసీసీఐలో చిన్న రాష్ట్రాలు, క్రికెట్‌లో ఏమాత్రం ఆధిపత్యం లేని రాష్ట్ర క్రికెట్ సంఘాల నుంచి ఆఫీస్ బేరర్లు ఎన్నిక కావటం గమనార్హం. ఇటీవల అస్సాం క్రికెట్ సంఘం నుంచి దేవజిత్ సైకియా బీసీసీఐ కార్యదర్శిగా, చత్తీస్‌గఢ్ నుంచి ప్రభతేజ్ సింగ్ భాటియా కోశాధికారిగా ఎన్నికైన సంగతి తెలిసిందే. తాజాగా సంయుక్త కార్యదర్శి పదవికి మార్చి 1న ప్రత్యేక సర్వ సభ్య సమావేశంలో ఎన్నిక జరుగనుండగా.. గోవా క్రికెట్ సంఘం కార్యదర్శి రోహన్ దేశాయ్‌ను ఎన్నుకునే అవకాశం ఉంది. దీంతో బీసీసీఐలో తొలిసారి చిన్న రాష్ట్రాలు, క్రికెట్ ఆధిపత్యం లేని రాష్ట్ర క్రికెట్ సంఘాల తరఫున ఆఫీస్ బేరర్లు కీలక స్థానాల్లో ఉండనున్నారు. ఎటువంటి ఎన్నిక అవసరం లేకుండా రోహన్ దేశాయ్‌ని జాయింట్ సెక్రటరీగా ఎన్నుకోనున్నారు. ఇటీవల దక్షిణాఫ్రికా పర్యటనలో భారత జట్టుకు రోహన్ దేశాయ్ టీమ్ మేనేజర్‌గా సైతం పని చేశారు.


ఫైనల్లో విదర్భ, కేరళ

సెమీస్‌లో ముంబయి, గుజరాత్‌కు భంగపాటు



నాగ్‌పూర్/అహ్మదాబాద్ : 41 సార్లు చాంపియన్ ముంబయిని మట్టికరిపిస్తూ విదర్భ.. మాజీ చాంపియన్ గుజరాత్‌కు షాకిస్తూ కేరళ రంజీ ట్రోఫీ ఫైనల్లోకి ప్రవేశించాయి. ఉత్కంఠభరితంగా సాగిన సెమీఫైనల్లో గుజరాత్‌పై 2 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కేరళ తొలిసారి రంజీ ట్రోఫీ టైటిల్ పోరుకు చేరుకుంది. ముంబయిని 80 పరుగుల తేడాతో చిత్తు చేసిన విదర్భ నాల్గోసారి రంజీ ట్రోఫీ ఫైనల్లో ఆడనుంది. విదర్భ, ముంబయి సెమీఫైనల్లో 406 పరుగుల రికార్డు ఛేదనలో ముంబయి ఆఖరు వరకు పోరాడింది. 97.5 ఓవర్లలో 325 పరుగులు చేసింది. టెయిలెండర్లు శార్దుల్ ఠాకూర్ (66, 124 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), శామ్స్ ములాని (46, 94 బంతుల్లో 2 ఫోర్లు), మోహిత్ (34), తనుశ్ కొటియన్ (16), డియాస్ (23 నాటౌట్) రాణించారు. బ్యాటర్లు సిద్దేశ్ లాడ్ (2), అజింక్య రహానె (12), శివం దూబె (12), సూర్యకుమార్ యాదవ్ (23), ఆయుశ్ (18) విఫలమయ్యారు. విదర్భ బౌలర్ హర్ష్ దూబె (5/127) ఐదు వికెట్ల ప్రదర్శనతో చెలరేగగా ఆ జట్టు 80 పరుగుల తేడాతో గెలుపొందింది.

కేరళ, గుజరాత్ సెమీఫైనల్ ఐదో రోజు ఆట నాటకీయ రీతిలో రసవత్తరంగా సాగింది. మందకొడిగా సాగిన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ కోసం ఇరు జట్లు ఆఖరు వరకు చెమటోడ్చాయి. కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 457 పరుగులు చేయగా.. గుజరాత్ తొలి ఇన్నింగ్స్‌లో 455 పరుగులకు ఆలౌటైంది. రెండు పరుగుల దూరంలో కేరళ తొలి ఇన్నింగ్స్ చేజార్చుకుంది. ఓపెనర్ ప్రియాంక్ పంచల్ (148, 237 బంతుల్లో 18 ఫోర్లు, 1 సిక్స్), ఆర్య దేశాయ్ (73, 118 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్), జైమీట్ పటేల్ (79, 177 బంతుల్లో 2 ఫోర్లు) రాణించారు. గుజరాత్ స్కోరు 455 వద్ద అర్జాన్ (10) ఆఖరు వికెట్ నిష్క్రమించటంతో కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 2 పరుగుల విలువైన ఆధిక్యం సొంతం చేసుకుంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఫైనల్‌కు అర్హత సాధించింది. కేరళ రెండో ఇన్నింగ్స్‌లో 46 ఓవర్లలో 114/4 పరుగులు చేసింది. జలజ్ సక్సేనా (37 నాటౌట్), రోహన్ (32) రాణించారు.



అందుకే విరాట్ విఫలం!

భారత మాజీ కోచ్ అనిల్ కుంబ్లే

న్యూఢిల్లీ : భారత స్టార్ క్రికెటర్, సూపర్ బ్యాటర్ విరాట్ కోహ్లి కొంతకాలంగా పేలవ ఫామ్‌లో కొనసాగుతున్నాడు. 2023 వన్డే వరల్డ్‌కప్ అనంతరం.. వన్డేల్లో చివరి ఆరు ఇన్నింగ్స్‌ల్లో విరాట్ కోహ్లి 137 పరుగులే చేశాడు. అందులో ఒకే ఒక్క అర్థ సెంచరీ ఉంది. చాంపియన్స్ ట్రోఫీలో బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో సైతం విరాట్ కోహ్లి 38 బంతుల్లో 22 పరుగులే చేశాడు. లెగ్ స్పిన్నర్ రిషద్ హుస్సేన్ ఓవర్లో వికెట్ కోల్పోయాడు. తనపై తాను ఎక్కువ ఒత్తిడి పెంచుకుంటూ విరాట్ కోహ్లి పరుగుల వేటలో విఫలం అవుతున్నాడని భారత మాజీ కెప్టెన్, మాజీ చీఫ్ కోచ్ అనిల్ కుంబ్లే అభిప్రాయపడ్డాడు. 'విరాట్ కోహ్లి కొంతకాలంగా పేలవ ఫామ్‌లో ఉన్నాడు. వైట్‌బాల్ ఫార్మాట్‌లో కోహ్లి ఫామ్‌లోకి వచ్చేందుకు పెద్దగా సమయం తీసుకున్న దాఖలాలు లేవు. కోహ్లి తనపై మరీ ఎక్కువ ఒత్తిడి పెంచుకుంటున్నాడని నా అభిప్రాయం. మ్యాచ్‌ను ప్రత్యర్థిని లాగేసుకునే సత్తా, సామర్థ్యం ఉన్న ఆటగాళ్లను గతంలోనూ చూశాం. భారత జట్టులో విరాట్ కోహ్లి ఆ కోవలోకే వస్తాడు. భారీ అంచనాలు, ఒత్తిడితో పరుగుల వేటలో అనవసర దూకుడు చూపించటం ప్రతికూలంగా మారుతుంది. విరాట్ కోహ్లి కాస్త రిలాక్స్‌గా ఉంటూ ఆడాలి. రోహిత్ శర్మ మాదిరిగా కోహ్లి సైతం క్రీజులోకి రావాలి.. స్వేచ్ఛగా అనుకున్న షాట్లు ఆడేయాలి. ఎక్కువగా గాబరా పడొద్దు. జట్టులోని సహచర బ్యాటర్లు అందరూ మంచి ఫామ్‌లో ఉన్నారు. కోహ్లి చివరి ఆరు ఇన్నింగ్స్‌ల్లో స్పిన్నర్లకే వికెట్ కోల్పోగా.. అందులో ఐదుసార్లు లెగ్ స్పిన్‌కు దాసోహం అయ్యాడు. ఈ అంశంలో కోహ్లి పొరపాట్లను సరిదిద్దుకోవాలి' అని అనిల్ కుంబ్లే అన్నాడు.

స్పోర్ట్స్ జర్నలిస్ట్స్ డైరీ ఆవిష్కరణ

ఎస్‌జేఏటీని అభినందించిన డిప్యూటీ సీఎం

నవతెలంగాణ-హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజా ప్రభుత్వంలో క్రీడా రంగం అభివృద్ధిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సచివాలయంలోని తన చాంబర్‌లో స్పోర్ట్స్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ తెలంగాణ (ఎస్‌జేఏటీ) 2025 వార్షిక డైరీని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో క్రీడా రంగానికి అధిక నిధులు కేటాయించి క్రీడలు, క్రీడాకారులను మరింతగా ప్రోత్సహిస్తామని, జాతీయ క్రీడలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తిగా ఉందని చెప్పారు. ఆతిథ్య హక్కులకు బిడ్ వేసే విషయంలో చొరవ తీసుకుంటానని తెలిపారు. క్రీడలు, క్రీడా సంఘాల సమాచారంతో డైరీని రూపొందించిన ఎస్‌జేఏటీని భట్టి విక్రమార్క ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జేఏటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కష్టా రెడ్డి, శ్రీనివాస్ దాస్, ఉపాధ్యక్షుడు ఎస్ఎస్‌బీ సంజయ్, సంయుక్త కార్యదర్శి సీహ?ఎచ్. రాజశేఖర్ ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.





'కోర్ట్' సినిమా తీసినందుకు గర్వపడుతున్నా : నాని

హీరో నాని వాల్ పోస్టర్ సినిమా సమర్పించిన చిత్రం 'కోర్ట్' - స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని రామ్ జగదీష్ దర్శకత్వం వహించారు. ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రం మార్చి 14న హోలీ పండుగ సందర్భంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ నిర్వహించిన ప్రెస్‌మీట్‌కి చిత్ర సమర్పకుడు నాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'ఈ సినిమా బ్లాక్ బస్టర్ కావాలి. వెరీ బ్యూటీఫుల్ ఫిల్మ్. దర్శి, రోషన్, శ్రీదేవి, డైరెక్టర్ జగదీశ్ అందరూ అద్భుతంగా చేశారు. ఈ సినిమా తీసినందుకు గర్వపడుతున్నాను. నాలోని కాన్ఫిడెన్స్ చూసి మీరే డిసైడ్ అవ్వండి..మార్చి 14న మీరు ఎంత మంచి సినిమా చూడబోతున్నారో. ఈ సినిమా చూశాను. ఇందులో ఎవరు హీరో అని చెప్పడం కష్టం. ఈ కథ చాలా సెన్సిటివ్ మేటర్. చాలా జాగ్రత్తలు తీసుకొని చేశాం. జగదీశ్ చాలా రీసెర్చ్ చేశారు. సినిమా పూర్తయినప్పటికీ నిలబడి క్లాప్స్ కొడతారు. ఇది నా గ్యారెంటీ. గ్రేట్ ఐడియా, బ్యూటీఫుల్ లవ్ స్టోరీ, చాలా గ్రిప్పింగ్ డ్రామా, మైండ్ బ్లోయింగ్ పెర్ఫార్మెన్స్‌తో ఇది అద్భుతమైన కోర్ట్ రూమ్ డ్రామాగా అందర్నీ మెస్మరైజ్ చేస్తుంది. అలాగే గ్రేట్ మెసేజ్ కూడా ఉంటుంది. ఆడియన్స్ సెలబ్రేట్ చేసుకునే సినిమా అవుతుంది. జగదీశ్ చాలా హానెస్ట్‌గా కథ చెప్పాడు. నేను అనుకున్న దానికంటే నెక్స్ట్ లెవల్‌లో తీశాడు. ఇలాంటి సినిమా బ్లాక్ బస్టర్ అయితే ఇండస్ట్రీ, ఆడియన్స్ ఒక అడుగు ముందుకి వేసినట్లే' అని తెలిపారు. 'తెలుగు సినిమాకి స్వర్ణయుగం నడుస్తోంది. ఇలాంటి సమయంలో నాని అద్భుతమైన కథలతో సినిమాలు తీస్తున్నారు. నానితో నటిస్తూ, స్ఫూర్తి పొందుతూ, ఆయన బ్యానర్‌లో సినిమా చేయడం లక్కీగా భావిస్తున్నాను. ఈ సినిమా తప్పకుండా మిమ్మల్ని మెప్పిస్తుంది' అని హీరో ప్రియదర్శి చెప్పారు.

డైరెక్టర్ రామ్ జగదీష్ మాట్లాడుతూ, 'నాని ప్రొడక్షన్‌లో అన్నీ సక్సెస్ ఫుల్ సినిమాలే వచ్చాయి. అలాంటి సక్సెస్ ఫుల్ సినిమా ఇవ్వడం నా బాధ్యత. నన్ను నమ్మి ఈ సినిమా చేసిన నానికి థ్యాంక్స్. ఒక్క డౌట్ లేకుండా స్క్రిప్ట్‌ని నమ్మి సినిమా చేశారు. దీప్తి సెట్స్‌లో ఉంటే ఎప్పుడూ భయం ఉండదు. చాలా కంఫర్ట్‌బుల్‌గా సినిమాని చేశాను' అని అన్నారు.

యాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ,'ఈ సినిమా అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. నాపై నమ్మకం ఉంచిన దర్శక, నిర్మాతలు థ్యాంక్స్. మార్చి 14 రిలీజ్ అవుతుంది. తప్పకుండా వచ్చి చూడండి' అని చెప్పారు.

> నాని, ప్రశాంతి ప్రొడక్షన్ హౌస్‌లో రెగ్యులర్ ప్రొడ్యూసర్ రూల్ బుక్ ఉండదు. కథ నచ్చితే ఎంత అయినా పెడతారు. మా టీమ్ విషయంలో చాలా ప్రౌడ్‌గా ఉన్నాను. జగదీశ్ అద్భుతమైన స్క్రిప్ట్ రాశారు. అంతే అద్భుతంగా సినిమాని తీశాడు. మార్చి 14న చాలా మంచి సినిమా చూడబోతున్నారు. నిర్మాతగా ఈ అవకాశం ఇచ్చిన నానికి థ్యాంక్స్.
> - నిర్మాత దీప్తి గంటా

నవచిత్రం

'భైరవం' థీమ్ సాంగ్ రిలీజ్



బెల్లంకొండ శ్రీనివాస్

అద్భుతమైన ఫస్ట్ లుక్ పోస్టర్స్, చార్ట్ బస్టర్ ఫస్ట్ సింగిల్, టీజర్‌కి వచ్చిన ట్రెమండస్ రెస్పాన్స్‌తో 'భైరవం'మూవీపై హ్యూజ్ బజ్ నెలకొంది అని మేకర్స్ తెలిపారు. విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్ పై కెకె రాధామోహన్ నిర్మించారు.

పెన్ స్టూడియోస్ డాక్టర్ జయంతిలాల్ గడా ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. శుక్రవారం మేకర్స్ 'భైరవం' థీమ్ సాంగ్‌ను విడుదల చేశారు. మహా శివరాత్రి శుభ సందర్భంగా విడుదలైన ఈ పాట ఆధ్యాత్మిక శక్తి, డైనమిక్ ఫోర్స్ బ్లెండ్‌తో అదిరిపోయింది. శ్రీచరణ్ పాకాల వండర్, భక్తి రెండింటి కలయికతో సాంగ్ రూపొందించారు. చైతన్య ప్రసాద్ రాసిన సాహిత్యం, శివుని దైవిక సారాన్ని అందంగా ప్రజెంట్ చేసి, లోతుగా ప్రతిధ్వనించే ఎమోషన్స్‌ని అందించింది. ఈ పాటకు శంకర్ మహదేవన్ అద్భుతమైన వోకల్స్ గొప్ప శక్తిని నింపింది. బెల్లంకొండ శ్రీనివాస్ అద్భుతమైన పెర్ఫార్మెన్స్ ఇస్తూ, ఫియర్, స్ట్రెంత్ రెండింటినీ కనబరిచారు. తన పాత్ర శివ తాండవం ప్రేరణ స్ఫూర్తితో మెస్మరైజ్ చేస్తోంది. ఆలయం ముందు చిత్రీకరించిన విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. మహా శివరాత్రి ఉత్సవాలు ఇప్పటికే ప్రారంభమవుతున్నందున, ఈ పాట 'భైరవం' పై అంచనాలను మరింత పెంచింది.

సమ్మర్ స్పెషల్‌గా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.



అప్పుడు జంధ్యాల.. ఇప్పుడు అనిల్ రావిపూడి

'విజయకృష్ణ సిల్వర్ క్రౌన్ అవార్డ్ తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది. కృష్ణ రియల్ సూపర్ స్టార్. విజయ నిర్మల ఆడపులి. వారి పేరు మీద ఈ అవార్డ్‌ని తీసుకోవడం గర్వంగా ఫీలౌతున్నాను' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి అన్నారు. శ్రుతిలయ సీల్ వెల్ కార్పోరేషన్- కళాకారుల ఐక్యవేదిక సమక్షంలో నటి, దర్శకురాలు విజయనిర్మల జయంతి సందర్భంగా రచయిత, దర్శకులు జంధ్యాల 75 సంవత్సరాల వజ్రోత్సవ సంచిక ఆవిష్కరణ వేడుకని నిర్వహించారు. ఇదే వేడుకలో డైరెక్టర్ అనిల్ రావిపూడికి విజయకృష్ణ సిల్వర్ క్రౌన్ అవార్డ్ -2025ని బహుకరించారు.

నరేష్ వికె సమక్షంలో అత్యంత వైభవంగా జరిగిన ఈ వేడుకకు తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా జహరయ్యారు. హీరో మంచు విష్ణు, శివబాలాజీ, పవిత్ర లోకేష్, జంధ్యాల అన్నపూర్ణ, శ్రీలక్ష్మీ, ప్రదీప్, సాయినాథ్‌తో పాటు అనేక మంది ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొనారు.

డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ, నరేష్ గ్రేట్ సన్. వారి అమ్మ పేరు మీద ఈ అవార్డ్‌ని కొనసాగించడం చాలా ఆనందంగా ఉంది. జంధ్యాలకి నేను ఏకలవ్య శిష్యుడిని. ఆయన సినిమాలు చూస్తూ కామెడీ టైమింగ్ నేర్చుకున్నాను. ఈ రోజు నేను కామెడీ పండిస్తున్నానంటే ఆ క్రెడిట్ జంధ్యాలకి దక్కుతుంది. నవ్వు ద్వారా ప్రజలు దగ్గరైనందుకు గర్వంగా ఫీలౌతున్నాను. వరుస హిట్స్ కొడుతున్నాను. ఇంకా పీక్స్ రాలేదని భావిస్తున్న తరుణంలో 'సంక్రాంతి వస్తున్నాం' లాంటి ఓ హాస్య ప్రధానమైన సినిమాతో దేవుడు ఓ అద్భుతమైన సినిమా ఇచ్చాడు' అని తెలిపారు.

'సూపర్ స్టార్ కృష్ణ నా జీవితానికి దేవుడు. నాకు ఇద్దరు గురువులు, అమ్మ విజయనిర్మల, దర్శకుడు జంధ్యాల. జంధ్యాల వజ్రోత్సవం అన్నప్పుడు రెండేళ్ళుగా ఓ ఆలోచన చేశాం. ఆయనపై ఓ పుస్తకం రాయాలని భావించాం. రచయిత సాయినాథ్ తోటపల్లి ఆ బాధ్యత తీసుకోవడానికి ముందుకు వచ్చారు. ఈ పుస్తకం కోసం అనేక మైళ్ళు తిరిగి 40మంది ప్రముఖులని ఇంటర్వ్యూ చేసి ఈ పుస్తకాన్ని తయారు చేశారు. వయసు రీత్యా ఇది జంధ్యాల వజ్రోత్సవం. రచయితగా ఆయన జర్నీ 50 ఏళ్ళు పూర్తి అయ్యింది. ఇది అద్భుతమైన సందర్భం. హాస్యం పాదరం లాంటింది. హాస్యం పండించే సత్తా ఉన్న దర్శకులు వందలో ఒకరో ఇద్దరో ఉంటారు. ఈ తరంలో అనిల్ రావిపూడి ఒకరు. ఆయనకు విజయకృష్ణ సిల్వర్ క్రౌన్ 2025 పురస్కారం అందజేయడం చాలా సంతోషంగా ఉంది. 'సంక్రాంతికి వస్తున్నాం' మేము కలసి చేసిన మొదటి సినిమా కావడం నా అదృష్టం. అనిల్‌ని చూస్తే జంధ్యాల గుర్తుకు వస్తారు' అని నరేష్ వికే చెప్పారు.

కలర్‌ఫుల్‌గా 'సొమ్మసిల్లి పోతున్నావే..'

సందీప్ కిషన్, రీతూ వర్మ జంటగా నటించిన చిత్రం 'మజాకా'. త్రినాథరావు నక్కిన దర్శకుడు. ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ బ్యానర్‌లపై రాజేష్ దండా, ఉమేష్ కెఆర్ బన్సల్ నిర్మిస్తున్నారు. బాలాజీ గుత్తా సహ నిర్మాత.

శుక్రవారం మేకర్స్ ఈచిత్రంలోని ఫోక్ సాంగ్ 'సోమ్మసిల్లి పోతున్నావే..'ని రిలీజ్ చేశారు.

ప్రైవేట్ ఆల్బమ్ ద్వారా విశేష ప్రజాదరణ పొందిన 'సొమ్మసిల్లి పోతున్నావే..' పాటను ఇప్పుడు న్యూ జనరేషన్ శ్రోతలను అలరించడానికి రీ-ఇన్వెంట్ చేశారు. ఇప్పటికే అద్భుతమైన విజయాన్ని సాధించిన ఈ జానపద పాటకు కొత్త ట్విస్ట్ ఇస్తూ హై ఎనర్జీ చార్మ్‌ని తిరిగి పరిచయం చేశారు. లియోన్ జేమ్స్ స్వరపరిచిన ఈ ట్రాక్, మోడరన్ బీట్‌లను సాంప్రదాయ జానపద సౌండ్స్ బ్లెండ్ చేసి, ప్రేక్షకులను అలరిస్తుంది.

పవర్ ఫుల్ రీమిక్స్ ఎనర్జీని పెంచుతుంది. రాము రాథోడ్, ప్రసన్న కుమార్ బెజవాడ రాసిన ఈ పాట సాహిత్యం రస్టిక్ పదాలతో ఆకట్టుకుంది. రేవంత్ హై ఎనర్జీ వోకల్స్ పాటను మరింత ఎగ్జైటింగ్‌గా మార్చాయి. సాంగ్ అందరూ పాడుకునే చార్ట్ బస్టర్‌గా నిలిచింది. సందీప్ కిషన్, రీతు వర్మ సాంప్రదాయ దుస్తులలో అద్భుతంగా కనిపించారు. విజువల్స్ కలర్‌ఫుల్‌గా ఉన్నాయి. మోయిన్ మాస్టర్ కొరియోగ్రఫీతో డైనమిక్ డ్యాన్స్ మూవ్‌లు పాటకు పర్ఫెక్ట్‌గా యాప్ట్ అయ్యాయి. మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 26న ఈ సినిమా థియేటర్లలోకి రానుంది అని చిత్ర యూనిట్ తెలిపింది.



సందీప్ కిషన్, రీతూ వర్మ

థ్రిల్ చేసే 'లెవెన్'

నవీన్ చంద్ర హీరోగా లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో రూపొందిన రేసీ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'లెవెన్'. ఎఆర్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్ పై అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మిస్తున్నారు. ఈ మూవీని తెలుగు, తమిళ భాషల్లో ఏక కాలంలో రూపొందించారు.

ఇప్పటికే విడుదలైన ఈ మూవీ టీజర్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. శ్రుతిహాసన్ పాడిన 'ది డెవిల్ ఈజ్ వెయిటింగ్' సాంగ్ సెన్సేషన్ క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ ఈ మూవీ నుంచి 'ఇక్కడ రా..' సాంగ్‌ని రిలీజ్ చేశారు. డి. ఇమ్మాన్ ఈ సాంగ్‌ని ఫుట్ ట్యాపింగ్ డ్యాన్స్ నెంబర్‌గా కంపోజ్ చేశారు. రాకేందు మౌళి రాసిన లిరిక్స్ క్యాచీగా ఉన్నాయి. ఈ పాటని ఆండ్రియా జెరెమియా పాడటంతో పాటు పెర్ఫార్మ్ చేయడం విశేషం. ఈ సాంగ్‌లో ఆండ్రియా డ్యాన్స్ మూమెంట్స్ ఆకట్టుకున్నాయి. 'సిల నెరంగళిల్ సిల మణిధర్గళ్' చిత్రంలో నటించిన రేయా హరి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో 'విరుమాండి' ఫేమ్ అభిరామి, 'వత్తికూచి' ఫేమ్ దిలీపన్, 'మద్రాస్' ఫేమ్ రిత్విక కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

'ఇదొక రేసీ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. ఇప్పటివరకు ఎవ్వరూ చూపించని ఓ సరికొత్త పాయింట్‌తో ఈ సినిమా ఉంటుంది. నవీన్‌చంద్ర పాత్ర అందర్నీ మెస్మరైజ్ చేస్తుంది. సమ్మర్‌లో ఈ సినిమాని విడుదల చేయబోతున్నాం' అని మేకర్స్ తెలిపారు.

ఈ చిత్రానికి రచన, దర్శకత్వం : లోకేశ్ అజ్ల్స్, సంగీతం : డి. ఇమ్మాన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్ : ప్రభు సాలమన్, సహ నిర్మాత : గోపాలకృష్ణ.ఎం, డీవోపీ : కార్తీక్ అశోక్, ఎడిటర్ : శ్రీకాంత్. ఎస్.బి, ఆర్ట్ డైరెక్టర్ : పి.ఎల్.సుబెంధర్, యాక్షన్ డైరెక్టర్ : ఫీనిక్స్ ప్రభు.



ఆండ్రియా జెరెమియా

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886